thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal
సంపుటి - 20 సంచిక - 222 కరీంనగర్ ఆదివారం, 19 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## రద్దీ ప్రాంతాల్లో మాస్కు ధరించండి..

చెన్నై: రద్దీ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు మాస్క్ ధరించాలని ఆరోగ్యశాఖ సూచించింది. వాతావరణ మార్పుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగలు ఎండ తీవ్రత, రాత్రి వేళల్లో వర్షం కురుస్తోంది. ఈ కారణంగా చెన్నై సహా పలు జిల్లాల్లో వైరల్ జ్వరాల వ్యాప్తి అధికంగా ఉంది. నగరంలో కూడా జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లునొప్పులు తదితర లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరేవారి సంఖ్య అధికమవుతోంది. ఈ క్రమంలో, ఆరోగ్య శాఖ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు వ్యాపిస్తున్నాయని, జ్వరాలు నిరోధించేలా ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించింది. వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు రద్దీ ప్రాంతాలకు వెళ్లొద్దని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే మాస్క్ ధరించాలని పేర్కొంది.




## బీసీలం.. మేమెంతో మాకంత కావాలి

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల అంశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. జూబ్లీ బస్ స్టేషన్ వద్ద నిర్వహించిన బీసీ బంద్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. తమిళనాడు ఒక్కటి మాత్రమే నిజాయతీగా రిజర్వేషన్లు అమలు చేసిందన్నారు. తెలంగాణలో కేసీఆర్ ఒక సారి సర్వే చేశారని.. బీసీ కమిషన్ కూడా వేశారని తెలిపారు. కానీ నిజాయతీ లేక అమలు కాలేదని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పేరుకు కమిషన్లు వేసింది తప్ప నిజాయతీ లేదన్నారు. "బీసీలు 52 శాతం ఉంటే 42 శాతం అని కాకి లెక్కలు చెబుతున్నారు. నేను చెప్పేది అబద్ధం అయితే రాజకీయాల నుంచి తప్పుకొంటా. బీసీలం మేమెంతో మాకంత కావాలి. యాచించే స్థాయిలో కాదు.. శాసించే స్థాయిలో ఉన్నాం. ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్నంత కాలం ఆ కుటుంబం వారికే అధికారం దక్కుతుంది. కుటుంబమే ఏలుతుంది. కాంగ్రెస్ జాతీయ పార్టీ అయినా.. స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ఒక్క బీసీ, ఒక ట్రైబల్ ముఖ్యమంత్రి కాలేకపోయారు. ఈ రాష్ట్రంలో బీసీలు 8 మంది మంత్రులుండాలి.. కానీ ముగ్గురున్నారు. ఉన్న వారికి ఇచ్చిన శాఖలు చిన్నవి.


నామినేటెడ్ పోస్టుల్లో ఎందుకు బీసీలకు స్థానం కల్పించలేదు. తెలంగాణలో బీసీని సీఎం చేస్తా అని ప్రధాని మోదీ ప్రకటించారు. మోదీ క్యాబినెట్‌లో 27 మంది ఓబీసీ మంత్రులు ఉన్నారు. భాజపా నిజాయతీని ఎవరు శంకించలేరు. ఈ ఉద్యమం ఇక్కడితో ఆగదు. 42 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో మాత్రమే కాదు.. చట్టసభల్లో కూడా వచ్చే వరకు ఆగదు. మాది యాచన కాదు.. పాలించే శక్తి మాకు ఉంది. తెలంగాణ రాష్ట్రం ఎలా సాధ్యం అయిందో.. బీసీ రాజ్యాధికారం కూడా సాధ్యం అవుతుంది. ఆశయాన్ని ముద్దాడే వరకు ఐక్య ఉద్యమాలు చేద్దాం" అని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు.

# గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ఉద్యోగ నియామకాలు ఆలస్యం




హైదరాబాద్, అక్టోబర్ 18: గ్రూప్-2 పరీక్షలో విజేతలకు ఇవాళ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. విద్యార్థి, నిరుద్యోగ యువత ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్న సీఎం.. అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో పదేళ్లు అధికారం చెలాయించిన వాళ్లు ఒక్కక్షణం కూడా నిరుద్యోగుల గురించి ఆలోచన చేయలేదని విమర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ పలు అంశాలపై మాట్లాడారు. 'అమరుల ఆశయ సాధనపై వాళ్లు ఆలోచన చేసి ఉంటే మీకు ఎనిమిదేళ్ల క్రితమే ఉద్యోగాలు వచ్చేవి. వాళ్ల కుటుంబంలో పదవులు భర్తీ చేసుకున్నారు తప్ప, గ్రూప్ 2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వలేదు. పదిహేనేళ్లుగా గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీ జరగలేదంటే, ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉంటుందా? ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మేం గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేశాం. గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించి ఇవాళ నియామక పత్రాలను అందిస్తున్నాం.' అని సీఎం రేవంత్ అన్నారు. 'మిమ్మల్ని తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములను చేసే బాధ్యత టీజీపీఎస్సీ తీసుకుంది. మీరు.. మేము వేరు కాదు. మీరే మేము.. మేమే మీరు. చీకటి రోజులు పోవాలి.. నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని గ్రూప్ 1 విషయంలో సమస్యలన్నింటినీ ఎదుర్కొని నియామక పత్రాలు అందజేశాం. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. గత పాలకులు ఉద్యోగాల భర్తీని అడ్డుకునేందుకు కేసులు వేసి అక్రమ సంపాదనతో ఏర్పాటు చేసుకున్న సోషల్ మీడియా వ్యవస్థతో మాపై బురద జల్లే ప్రయత్నం చేశారు. అలాంటి ఏ వ్యవస్థ మాకు లేదు.. మా వ్యవస్థనే మీరు.. ఆ వ్యవస్థలో మీరే మా కుటుంబ సభ్యులు. ఇప్పటి వరకు మీరు సామాన్యులు.. ఈ రోజు నుంచి మీరు ఆఫీసర్స్. మీ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి రైజింగ్ తెలంగాణ 2047 విజన్ డాక్యుమెంట్ కు అనుగుణంగా పనిచేయాలి. దేశంలోనే తెలంగాణను అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలి. రక్తం చెమటగా మార్చి మిమ్మల్ని ఇంతవాళ్లను చేసిన తల్లిదండ్రులను మరిచిపోవద్దు. నిస్సహాయులకు సహాయం చేయండి.. పేదలకు అండగా నిలవండి. గత పాలకుల పాపాల పుట్ట పగులుతోంది.

వాళ్ల దోపిడీ గురించి మేం చెప్పడం కాదు..వాళ్ల కుటుంబ సభ్యులే చెబుతున్నారు. హాస్టల్స్ లో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయితే వాళ్లు పైశాచిక ఆనందం పొందుతున్నారు. సెంటిమెంట్ తో మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్నారు. అలాంటి వారి పట్ల మీరు జాగ్రత్తగ ఉండాలి. ఎలాంటి ప్రమాద ఘటనలు జరగకుండా, ఫుడ్ పాయిజన్ తో ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా చూడాలి. సమర్థవంతంగా పనిచేసి ఆదర్శంగా నిలవాలి.' అని కొత్తగా ఉద్యోగాల్లో నియమితులైన వారిని ఉద్దేశించి ప్రసంగించారు.



# హీటెక్కిన తెలంగాణ పాలిటిక్స్!

## రాజకీయ యుద్ధంగా బీసీ బంద్!!

## నెక్స్ట్ ఏంటి?

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయం బీసీ రిజర్వేషన్ల అంశంతో అట్టుడుకుతోంది. తమ వాటా తమకు దక్కాల్సిందే నంటూ బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపుతో ఇవాళ రాష్ట్రమంతటా బంద్ విజయవంతమైందనే చెప్పాలి. ఈ బంద్‌కు రాష్ట్రంలోని అన్ని ప్రధాన పార్టీలు మద్దతు ఇచ్చాయి. ఈ క్రమంలో ఇవాళ ఉదయం నుంచే ఆయా పార్టీలు బీసీ రిజర్వేషన్ల కోసం రోడెక్కాయి. ఈ బంద్ సందర్భంగా ప్రధాన పార్టీల మధ్య మొదలైన ఈ డైలాగ్ వార్ ఇప్పుడు తెలంగాణలో రాజకీయ యుద్ధంగా మారింది. పార్టీల మధ్య మాటల దాడి దిపావళి బాంబుల కంటే పవర్ ఫుల్‌గా పేలుతున్నాయి. దీంతో ఈ బంద్ ప్రభావం ఎలాంటి పరిణామాలకు దారి తీయబోతోంది అనేది ఉత్కంఠగా మారింది.

**పొలిటికల్ వార్ కాస్త క్రెడిట్ వార్ గా..** బీసీ రిజర్వేషన్ల అంశంలో తప్పు మీదంటే మీదని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య డైలాగ్ వార్ మొదలైంది. పరస్పర విమర్శలతో పార్టీలన్నీ దూకుడు పెంచాయి. బీజేపీ కిరికిరి వల్లే రిజర్వేషన్లు ఆగిపోయాయని కాంగ్రెస్ ఆరోపిస్తుంటే, బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని బీజేపీ కౌంటర్ ఇస్తోంది.

ఇక కాంగ్రెస్, బీజేపీలు డ్రామాలాడుతున్నాయని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఇదిలా ఉంటే బీసీ రిజర్వేషన్లపై పొలిటికల్ వార్ కాస్త క్రెడిట్ వార్‌గా మారిందనే విమర్శలు నెటిజన్ల నుంచి వినిపిస్తున్నాయి. ఇవాల్టి బంద్ లో పాల్గొన్న అన్ని పార్టీలు ప్రత్యర్థులను దోషులుగా చూపించే ప్రయత్నం చేస్తూ తాము నిజాయితీగానే ఉన్నామని నిరూ పించుకునే ప్రయత్నం చేస్తున్నాయని అన్ని పార్టీలు సానుకూలంగా ఉంటే బీసీ రిజర్వేషన్లకు అడ్డు ఇంకేంటని ప్రశ్నిస్తున్నారు. కేవలం బీసీల వద్ద బద్నాం కాకూడదనే పార్టీలు ఇలా పోటీ పడి మరీ ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటున్నారని సామాన్య ప్రజలు, నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నెక్స్ట్ ఏంటి?:** ఇవాల్టి బంద్ తర్వాత పరిణామాలు ఏంటి అనేది రాష్ట్ర రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మీ నిర్ణయం ఏంటో చెప్పాలని ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది.

ఇక అధికార కాంగ్రెస్ పార్టీ తాము బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికలకు వెళ్తామని కుండబద్దలు కొడుతోంది. బీసీలకు రిజర్వేషన్ల అంశం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ అని దాన్ని ఆ పార్టీనే సాల్వ్ చేయాలని బీజేపీ, బీఆర్ఎస్‌లు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ జరుగుతున్న బంద్ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి నిర్ణయాలు రాబోతున్నాయి? ప్రతిపక్షాలు, బీసీ సంఘాలు ఎలాంటి వ్యూహం అమలు చేయబోతున్నాయి అనేది సస్పెన్స్ గా మారింది.

# క్షవరం అయితే కానీ వివరం రాలేదా!

## చైనా దెబ్బకు అమెరికా గిలగిలా..

### భారతదేశం మద్దతు కోరుతున్న ట్రంప్ టీమ్.. సమిష్టిగా పోరాడేందుకు పిలుపు..



చైనా కొట్టిన దెబ్బకు అమెరికా ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు కనిపిస్తోంది. బీజింగ్ అరుదైన ఖనిజ ఎగుమతి నియంత్రణలను కఠినతరం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆ దేశం చర్యలపై ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఆ దేశ ఉత్పత్తులపై 100శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ టారిఫ్‌లు నవంబర్ నెల నుంచి ప్రారంభమవుతాయని ప్రకటించారు. అయితే, అమెరికా బెదిరింపులను చైనా పట్టించుకోకపోవడంతో భారత్‌సహా పలు దేశాల సహకారంతో చైనా దూకుడుకు అడ్డుకట్ట వేయాలని అమెరికా చర్యలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అక్టోబర్ 9వ తేదీన చైనా కొత్త నిబంధన ప్రకారం.. అరుదైన ఖనిజాల (రేర్ ఎర్త్) ఎగుమతులపై నియంత్రణలు విధించింది. ప్రపంచంలో రేర్ ఎర్త్ మాగ్నెట్ (భూమి నుంచి లభించే అరుదై ఖనిజాలు) ఉత్పత్తిలో చైనా సుమారు 70శాతం నియంత్రణ కలిగి ఉంది. ఈ ఖనిజాలు ఎలక్ట్రిక్ వాహనాలు, రక్షణ, ఏరోస్పేస్, హై-టెక్ పరిశ్రమలకు కీలక ఇన్‌పుట్‌లుగా ఉన్నాయి. ఇవిలేకుంటే ఆటో మొబైల్, వాహన మోటార్, రక్షణ రంగాల కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితం అవుతాయి.

ప్రపంచంలో ఎక్కడా దొరకని అరుదైన ఖనిజాలను ఎగుమతి చేయడంపై చైనా నియంత్రణలు విధించడం పట్ల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సీరియస్ అయ్యాడు. ఆ దేశం ఉత్పత్తులపై 100శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ చిప్‌లు, లేజర్లు, జెట్ ఇంజిన్లు, ఇతర టెక్నాలజీల్లో వినియోగించే మ్యాగ్నెట్లు, ఇతర ఖనిజాలను నియంత్రించడం ద్వారా ప్రపంచాన్ని గుప్పిట పట్టాలని చైనా చూస్తోందని ట్రంప్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. చైనా తీసుకున్న నిర్ణయం ఒక్క అమెరికాకే ఇబ్బంది కాదని.. ప్రపంచంలోని అనేక దేశాలకు చైనా చర్యలు ఇబ్బంది కరమని అమెరికా పేర్కొంది. దీంతో ఈ సమస్య చైనా వర్సెస్ ప్రపంచంగా అభివర్ణిస్తున్నారు. ట్రంప్ 100శాతం టారిఫ్‌లపై చైనా స్పందించింది.

అరుదైన ఖనిజాల (రేర్ ఎర్త్) ఎగుమతులపై విధించిన నియంత్రణల నుంచి వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసింది. ట్రంప్ టారిఫ్ ల నిర్ణయానికి భయపడబోమని.. ప్రపంచ శాంతి కోసమే తాము అరుదైన ఖనిజాల ఎగుమతులపై నియంత్రణలు విధించామని చైనా పేర్కొంది. అరుదైన ఖనిజాలపై చైనా అధిపత్యం విషయంలో అమెరికా ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో చైనాకు వ్యతిరేకంగా భారత్ మద్దతు ఇవ్వాలని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆయన ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అమెరికా ప్రపంచ శాంతి, ఆర్థిక స్థిరత్వం కోసం కృషి చేస్తోందని అన్నారు. ఇదే సమయంలో చైనా ప్రపంచంలో వార్ ఎకానమీకి ఫైనాన్స్ చేస్తోందని ఆరోపించారు. అరుదైన ఖనిజాల ఉత్పత్తి, సరఫరాపై చైనా పెంచుకుంటున్న ఆధిపత్యాన్ని అడ్డుకోవడంలో భారత్, యూరోపియన్ దేశాలు అమెరికా తో కలిసి నడవాలని కోరుతున్నామని, ఆ మేరకు ఆ దేశాలు ముందుకొస్తాయని భావిస్తున్నామని పేర్కొన్నారు. అమెరికా అరుదైన ఖనిజ వనరుల సరఫరాను చైనా నుండి స్వతంత్రంగా మార్చుకునే ప్రయత్నం లో ఉంది. భారత్ ఈ రంగంలో విస్తారమైన వనరులు కలిగి ఉండటంతో అమెరికా వ్యూహాత్మకంగా భారత్ వైపు మొగ్గు చూపుతోంది. ఖనిజాల రంగంలో భారత్ భాగస్వామ్యం అమెరికాకు వ్యూహాత్మకంగా అవసరమని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, టారిఫ్‌లతో భారత్ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తూనే, చైనాపై పోరులో మద్దతు కోరడం విడ్డూరంగా ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.




# సొంత నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: పథకాలు, అభివృద్ధి పనుల అమల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు గడుస్తున్నా.. కొందరు అధికారుల పనితీరులో ఇంకా మార్పు రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎస్ రామకృష్ణారావు, సీఎంవో కార్యదర్శులతో సీఎం సమావేశమయ్యారు. కొందరు ముఖ్య కార్యదర్శులు, విభాగాధిపతుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

అధికారులు అలసత్వం వీడి అభివృద్ధి పనులపై దృష్టిసారించాలని హితవు పలికారు. సొంత నిర్ణయాలతో అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావొద్దని సూచించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తేనే పనులు వేగవంతమవుతాయని, ప్రజలకు మేలు జరిగే నిర్ణయాలు, కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని దిశానిర్దేశం చేశారు. ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకొని, పనుల పురోగతిని సమీక్షించాలన్నారు. "కీలక దస్త్రాలు, పనులు ఎక్కడా ఆగిపోవడానికి వీల్లేదు. కేంద్రం నుంచి గ్రాంట్లు, నిధులు రాబట్టుకునే కార్యాచరణను వెంటనే చేపట్టాలి. ఇకపై సీఎస్, సీఎంవో అధికారులు ప్రతివారం నివేదికలు అందించాలి" అని సీఎం ఆదేశించారు.




# పద్మశ్రీ అవార్డు గ్రహీత మొగులయ్యకు కేటీఆర్ అండ

హైదరాబాద్, అక్టోబర్ 18: ఇంటి స్థల సమస్య, ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్యకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. ఈరోజు (శనివారం) కేటీఆర్‌ను మొగులయ్య కలిశారు. ఈ సందర్భంగా తన సమస్యను మాజీ మంత్రికి వివరించారు మొగులయ్య. తాను కట్టుకున్న ఇంటి గోడలను కబ్జాదారులు కూల్చి వేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు గత ప్రభుత్వం ఇచ్చిన భూమిని కాపాడి తమ కుటుంబానికి అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మొగులయ్య ఆరోగ్యం, యోగక్షేమాల గురించి కేటీఆర్ ఆరా తీశారు. కంటి చికిత్స చేయిస్తానంటూ హామీ ఇచ్చారు. కేటీఆర్‌ను కలిసిన మొగులయ్య తన కంటిచూపు మందగించిందని, చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కేటీఆర్.. మొగులయ్యకు హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌లో పూర్తి చికిత్సను అందించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం గత ప్రభుత్వం తనకు హయత్‌నగర్ మండలంలో కేటాయించిన 600 గజాల స్థలం విషయంలో కొంతమంది వ్యక్తుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులు, కోర్టు కేసుల వివరాలను కేటీఆర్‌కు మొగులయ్య వివరించారు. తాను కట్టుకున్న గోడలను, ఇంటిని కూడా కూలగొట్టారని, కోర్టు కేసులు వేసి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని కాపాడాలని కేటీఆర్‌ను కోరారు. అనేకసార్లు కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ తనకు పరిష్కారం దొరకలేదని, తనకు అండగా నిలవాలని మొగులయ్య కోరారు. దీనిపై స్పందించిన కేటీఆర్.. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. సమస్యను వెంటనే పరిష్కరించి, మొగులయ్యకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను మాజీ మంత్రి కేటీఆర్ కోరారు.




# రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ డ్రామా

హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా బీసీ బంద్ కొనసాగుతోందని బీఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ బంద్‌కు మద్దతు తెలుపుతూ బస్ భవన్‌కు బయలుదేరే ముందు తెలంగాణ భవన్ వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పెద్ద డ్రామా ఆడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలపై ఎలాంటి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. హైకోర్టు ఇచ్చిన స్టేతో బీసీలపై కాంగ్రెస్ పార్టీ వైఖరి బట్టబయలైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందని ఆరోపించారు. కేవలం కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన మోసపూరిత విధానాలతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా పోయిందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలను మభ్యపెట్టారని చూశారని.. కానీ బీసీలు వాస్తవాలను తెలుసుకున్నారని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో వారిని మోసం చేయడం దారుణమని పేర్కొన్నారు. చెల్లని జీవోలను, ఆర్డినెన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సమస్యలు పరిష్కరించే నాధుడే కరువయ్యాడని అన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తున్నాయని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ బూటకం అని ఫైర్ అయ్యారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. 'బీసీ బంద్‌లో కాంగ్రెస్, బీజేపీ పాల్గొంటున్నాయి. మొక్కుబడిగా బీసీ బంద్‌లో కాంగ్రెస్, బీజేపీ భాగస్వామ్యం కావొద్దు. బీసీలకు రాజ్యాంగ సవరణ ద్వారానే 42 శాతం రిజర్వేషన్లు వస్తాయి. బీసీ రిజర్వేషన్లు తగ్గిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి. బీసీలకు ఒక్క శాతం రిజర్వేషన్ తగ్గవద్దు' అని హెచ్చరించారు.




ఆదిలాబాద్: ఇటీవల కాలంలో ప్రేమ కారణంగా జరుగుతున్న నేరాల సంఖ్య బాగా పెరుగుతోంది. పెద్దలు ఒప్పుకోలేదని కొన్ని ప్రేమ జంటలు సూసైడ్ చేసుకుంటున్నాయి. అలానే తమకు ఇష్టంలేని పెళ్లి చేసుకున్నారని కొందరు పెద్దలు పరువు హత్యలకు పాల్పడుతున్నారు. ఇంకా దారుణం ఏమిటంటే.. మరికొందరు పెద్దలు ప్రేమ పెళ్లి చేసినట్లే నమ్మించి.. అల్లుడు లేదా కోడల్ని అత్యంత దారుణంగా చంపేస్తున్నారు.

ఈ తరహా ఘటన తాజాగా కొమరం భీం జిల్లాలో చోటుచేసుకుంది. గర్భిణీగా ఉన్న కోడలిని మామ అత్యంత దారుణంగా హత్య చేశాడు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. కొమురం భీం జిల్లా దహెగాం మండలం గెర్రె గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి రాణి అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. శేఖర్ బీసీ కులానికి చెందిన వ్యక్తికాగా.. రాణి ఎస్టీ కులానికి చెందిన యువతి. కుమారుడు వేరే కులం అమ్మాయిని వివాహం చేసుకున్నాడని శేఖర్ తండ్రి సత్తయ్య ఆగ్రహంతో ఉన్నాడు. ఇదే సమయంలో రాణి గర్భం దాల్చింది. ప్రస్తుతం ఆమెకు ఎనిమిదో నెల. దీంతో శేఖర్, రాణి దంపతులు సంతోషంగా ఉన్నారు. తమ ఫ్యామిలీలోకి బేబీ రాబోతుందని ఆనందపడుతున్నారు. అయితే వారి ఆశలను శేఖర్ తండ్రి సత్తయ్య అడియాసలు చేశాడు. అంతేకాక కోడలు గర్భవతి అనే విషయాన్ని మరిచి.. దారుణానికి తెగబడ్డాడు. ఎనిమిది నెలల గర్భిణీ అయిన కోడలు రాణిని సత్తయ్య గొడ్డలితో నరికి చంపాడు.

దీంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ ఉద్యమం మాదిరిగా మరో బీసీ ఉద్యమాన్ని చేపడతాం: కవిత




హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమం మాదిరిగా మరో బీసీ ఉద్యమాన్ని చేపడతామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. బీసీల బంద్‌కు మద్దతుగా ఆటోలతో ర్యాలీగా బయల్దేరి హైదరాబాద్ లోని ఖైరతాబాద్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి మాట్లాడారు. గంటపాటు ఖైరతాబాద్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిడ్డలు తమకు రిజర్వేషన్లు కావాలని కోరుతున్నారని.. రిజర్వేషన్లు ఇచ్చే పార్టీలే బంద్ కు మద్దతు ప్రకటించటం నవ్వులాటగా ఉందని ఎద్దేవా చేశారు. దొంగ జీవోలు ఇచ్చిన కాంగ్రెస్, బీసీ బిల్లును పాస్ చేయించాల్సిన బీజేపీలు బంద్ కు మద్దతు పేరుతో డ్రామాలు చేస్తున్నాయని మండిపడ్డారు. హంతకులే వచ్చి నివాళులు అర్పించినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీసీ బిడ్డలను పదే పదే మోసం చేస్తున్నారని.. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి బీసీలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ బీసీ బిడ్డల పంతం దేశానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. యూనైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో జాగృతి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని.. బీసీ బంద్ ను విజయవంతం చేయాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నట్లు తెలిపారు. బీసీల రిజర్వేషన్లు అమలు చేసేలా టెక్నికల్ గా ప్రభుత్వాలు సరైన వాదనలు వినిపించటం లేదని కవిత విమర్శించారు. ఈ కారణంగానే బీసీలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో తీర్పులు వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ రూల్స్ ప్రకారం జనగణన నిర్వహించలేదని చెప్పారు. జీవో 9 విషయంలో కూడా కాంగ్రెస్ కు చిత్తశుద్ధి లేదని.. అందుకే కోర్టు జీవో ను కొట్టేసిందని అన్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్, బీజేపీలకు చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. ఇప్పటికిప్పుడే ఎన్నికలు జరగాల్సినంత తొందర ఏముంది? అని ప్రశ్నించారు. మహారాష్ట్ర, తమిళనాడు లో 5 ఏళ్ల వరకు ఎన్నికలు జరగలేదని.. బీసీలకు రిజర్వేషన్ల అంశం తేలిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ లకు బిల్లులు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ వారిని ఇబ్బంది పెడుతోందని ఫైర్ అయ్యారు. బీసీ రిజర్వేషన్లను అమలు చేయాల్సిన పార్టీలు చిత్తశుద్ధిగా పనిచేయాలని తాను డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు.

# బీసీగా మారిన ప్రధాని మోదీ.. బీసీ రిజర్వేషన్లకు అడ్డు పడుతున్నారు..




ఖమ్మం: కులగణన ఆధారంగా బీసీల రిజర్వేషన్ల కోసం శాసనసభలో అన్ని పార్టీల ఆమోదం తీసుకొని హైకోర్టు, సుప్రీంకోర్టు ద్వారా న్యాయం కోసం ముందుకెళ్లామని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. సత్తుపల్లిలో చేపట్టిన బీసీ బంద్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజల మనోభావాలకు తగ్గట్టుగా రాజ్యాంగబద్ధంగా అందరికీ సమన్యాయం జరిగి, రాజ్యాధికారం కల్పించాలనేదే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉద్దేశమని పేర్కొన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ పాదయాత్ర చేపట్టారని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. అందరికీ విద్యా, ఉద్యోగం కల్పించాలనే గొప్ప సామాజిక విప్లవం కోసం రాహుల్ గాంధీ మేనిఫెస్టో రూపొందించారని మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. కొద్ది తేడాతో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాలేక పోయిందని అసహనం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రజలకు ఇచ్చిన మాట ప్రకామరమే.. బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగబద్ధంగా ఉన్న అధికారాలతోనే చట్టం చేశామని పేర్కొన్నారు. చట్టబద్ధత ఇవ్వాల్సిన గవర్నర్లు, రాష్ట్రపతి పట్టించుకోవడం లేదని తుమ్మల ఆరోపించారు. న్యాయబద్ధంగా చట్టసభల్లో అమలు చేసిన కూడా సాంకేతిక కారణాలతో బీసీ రిజర్వేషన్ల అమలుకు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు గుజరాత్ రాష్ట్రంలో చట్ట సవరణ ద్వారానే ప్రధానమంత్రి మోదీ బీసీగా కన్వర్ట్ అయ్యారని మంత్రి తుమ్మల తెలిపారు. నరేంద్ర మోదీ కులం బీసీ కాకపోయినా అక్కడ రాష్ట్ర ప్రభుత్వం ఆయన సామాజిక వర్గాన్ని బీసీలో చేర్చిందని పేర్కొన్నారు. బీసీగా ప్రధానమంత్రి స్థానం దక్కించుకున్న మోదీ, తెలంగాణలో బీసీలకు న్యాయం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరావు డిమాండ్ చేశారు.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు ఉన్న చిత్తశుద్ధి ఏ పార్టీకి లేదు: మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్: బీసీ బంద్‌లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట్ చౌరస్తా దగ్గర నిర్వహించిన ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంద్ విజయవంతమైందని పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారని తెలిపారు. "బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు ఉన్న చిత్తశుద్ధి ఏ పార్టీకి లేదు. కుల సర్వే చేశాం. జీవో ఇచ్చాం. బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలని త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ప్రధాని మోదీని కలుస్తాం. ప్రభుత్వ పరంగా 42 శాతంతో ఎన్నికలకు వెళ్లాలని చూస్తున్నాం. సాధ్యాసాధ్యాలు పరిశీలించిన తర్వాత స్థానిక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటాం" అని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో మద్దతిచ్చి.. కేంద్రంలో భాజపా వెనకడుగు: మంత్రి పొన్నం



హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా బీసీ బంద్ సందర్భంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, సీతక్క, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఇతర ముఖ్య నేతలు నిరసన చేపట్టారు. రాజ్యాంగంలో జనాభా ప్రాతిపదికన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు చట్టబద్ధత కల్పించాలని కేంద్రంలో ఉన్న భాజపాను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడారు. బీసీ బంద్‌లో తెలంగాణ వ్యాప్తంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ఇందు కోసం కుల సర్వే నిర్వహించినట్లు తెలిపారు. భాజపా రాష్ట్రంలో బీసీ బిల్లుకు మద్దతిచ్చి.. కేంద్రంలో మాత్రం వెనకడుగు వేస్తోందని విమర్శించారు.

# ఖమ్మంలో బీసీ బంద్.. బీజేపీ వర్సెస్ కాంగ్రెస్


ఖమ్మం: సత్తుపల్లి బస్టాండ్ సెంటర్‌లో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ముస్లింలకు 42% బీసీ రిజర్వేషన్‌లలో స్థానం కల్పించటంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తే.. మీకేంటి అభ్యంతరం అంటూ కాంగ్రెస్ శ్రేణులు అడ్డగించారు. దీంతో ఇరు పార్టీ నాయకుల మధ్య మాటమాట పెరిగి తోపులాట జరిగింది. సత్తుపల్లిలో చేపట్టిన బీసీ బంద్‌లో భాగంగా బీసీ సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన బీజేపీ కార్యకర్తలను కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకున్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ముందుకు వెళ్లకుండా అడ్డుకుంటూనే మరోపక్క ర్యాలీకి ఎలా వస్తారంటూ.. కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. దీంతో ఇరు పార్టీల నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కొద్దిసేపటి వరకు అక్కడ ఉద్రిక్త వాతావరణం కొనసాగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు పార్టీల నాయకులను చెదరకొట్టారు.



చురకలు


ఆదివారం 19 అక్టోబర్ 2025

# అమరజీవి ఆత్మార్పణానికి మరో కోణం - అక్టోబర్ 19... పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష ప్రారంభించిన దినం



అక్టోబర్ 19, 1952లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర డిమాండ్‌తో పొట్టి శ్రీరాములు మద్రాసులో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన దినం. 50రోజుల నిరహార దీక్ష తరువాత, మద్రాసును వదులుకొంటే ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం సాధ్యపడుతుందని ప్రధాని నెహ్రూ ప్రకటించినా, పొట్టి శ్రీరాములు అందుకు అంగీకరించ కుండా తన నిరాహార దీక్షను కొనసాగించి డిసెంబర్ 15వ తేదీన ఆత్మార్పణ చేసుకొన్న నేపథ్యం. అమరజీవి'గా ప్రాచుర్యం పొందిన పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేసి, ఆత్మార్పణం చేసుకున్న నేపథ్యం గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆయన ఆమరణ నిరాహారదీక్ష ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసమే అనే మిగుల ప్రచారంలో ఉన్నా, దాని వెనక మద్రాసు నగర అంశం ప్రధానమని కొందరి అభిప్రాయము. రాష్ట్ర ఏర్పాటు అనేది చాలా తీవ్రమైన రాజకీయ సమస్యగా మారిపోగా, అలాంటి రాజకీయ సమస్య కోసం శ్రీరాములు దీక్ష చేయటానికి ప్రధానంగా మద్రాసు నగర భవిష్యత్తే అని పలు వ్యాసాలను బట్టి మరో కోణానికి బలం చేకూరు తున్నది. మద్రాసు ప్రెసిడెన్సీలో 40 శాతం జనసంఖ్య, 58 శాతం రాష్ట్ర విస్తీర్ణం తెలుగు వారిదే. రాష్ట్ర రాజకీయాలలో తమకు పలుకుబడి లేదని, తమిళుల చేత అవహేళనకు గురౌతున్నామన్న భావన తెలుగు వారిలో మెదలైంది. 1911 లో ఆనాటి వార్తా పత్రికల వ్యాసాల ద్వారా, సంపాదకీయం ద్వారా తెలుగు ప్రజలలో ప్రత్యేక రాష్ట్ర వాంఛ మొదలైంది. 1911 చివరి నాటికి ప్రత్యేక రాష్ట్ర చర్చ ఊపందుకుంది. తెలుగు మాట్లాడే ప్రజలందరూ ఒకే రాష్ట్రంగా ఏర్పడాలనే అభిప్రాయాలు ఆంధ్రరాష్ట్ర ఉద్యమం ప్రారంభమైనప్పటి నుండి వినబడు తుండేది. హైదరాబాద్ సంస్థానం విమోచన తర్వాత సమైక్య తెలుగు రాష్ట్రం ఏర్పాటుకు అవకాశాలు పెరిగాయి. 1949 లో అయ్యదేవర కాళేశ్వరరావు విశాలాంధ్ర మహాసభ ఏర్పాటు చేశారు. 1951 లో కూడా కాంగ్రెస్ అఖిల భారత సమావేశాలలో ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు విశాలాంధ్ర విషయాన్ని ప్రస్తావించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన 58 రోజుల ఆమరణ దీక్షకు ముందు శ్రీరాములు ఐదు సార్లు నిరాహార దీక్షలు చేశారు. నెల్లూరులో దళితులకు ఆలయ ప్రవేశం, అస్పృశ్యత నివారణ మొదలైన వాటికోసం ప్రచారం, నిరాహార దీక్షలు చేసి విజయం సాధించారు. ఈ నేపథ్యంలోనే శ్రీరాములు లక్ష్య సాధన కోసం ఆమరణ దీక్ష ప్రారంభించాలని నిర్ణయించారు. "మద్రాసును కేంద్ర పాలిత ప్రాంతం చేయాలి" అని 1952 సెప్టెంబర్ 15వ తేదీన శ్రీరాములు నెల్లూరు నుంచి భాగవతుల లక్ష్మీ నారాయణకు ఒక లేఖ రాశారు. అందులో.. "ఆంధ్ర రాష్ట్ర సమస్య అనేక మందికి, అనేక పార్టీలకు, అనేక అభిప్రాయాలకు, అనేక భావాలకు అనేక రకాలుగా పుట్టిల్లు అయ్యింది. ప్రతి ఒక్కరి స్వార్థమూ వేర్వేరుగా ఉంది. ప్రత్యక్ష ఆర్థిక లాభాలున్నాయి. కాబట్టి అందరూ పరమార్థ దృష్టితో ఆలోచిస్తే తప్ప ఏకాభిప్రాయానికి రాలేరు. అధికారంలో ఉన్న మహా నాయకుల దృష్టి మార్చాలంటే సామాన్యం కాదు. ఇందుకు ఒక్కటే మార్గం కనబడుతోంది. నిష్కామ దృష్టితో, ద్వేష రహితంగా, నిశ్చింతగా ప్రాణాలర్పించటమే. ఇక ఈ సమస్యను ఉపేక్షించటం పాపమని నిన్నే (1952 సెప్టెంబర్ 14) అనిపించింది". తర్వాత 15 రోజులకు భీమవరంలో స్వామి సీతారాంను శ్రీరాములు కలిసి, లక్ష్మీనారాయణకు రాసిన లేఖను, దానితోపాటు పంపించిన 'ఆంధ్ర రాష్ట్రం' అనే వ్యాసాన్ని చూపించారు. వాటిని పరిశీలించిన స్వామి సీతారాం అక్టోబర్ 2వ తేదీన శ్రీరాములుకు తన స్పందన తెలియజేస్తూ లేఖ రాశారు. దీక్ష చేయాలన్న శ్రీరాములు నిర్ణయాన్ని అభినందిస్తూనే.. "ప్రస్తుతానికి మద్రాసు నగర భవిష్యత్తును గూర్చి పట్టుబట్టడం ఉచితం కాదు" అని సూచించారు. కానీ, ఆయన సూచనను శ్రీరాములు అంగీకరించ లేదు. "మద్రాసు నగర భవిష్యత్తు నిర్ణయించే బాధ్యతను పండిట్ నెహ్రూకు అప్పగించటానికి వీలులేదు. మద్రాసు నగర పౌరులే ఆ నగరం భవిష్యత్తుని నిర్ణయించాలి. నా దీక్ష వలన మద్రాసు నగరంలోని తమిళ ప్రముఖుల్లో కొందరిలోనైనా హృదయ పరివర్తన ఏర్పడి.. మద్రాసు నగరాన్ని కేంద్ర పాలిత రాష్ట్రంగా ఏర్పరచడానికి వారు అంగీకరించగలరని నేను నమ్ముతున్నాను. ప్రజాభీష్టాన్ని అమలు జరపడమే పండిట్ నెహ్రూ వంతు" అని పేర్కొన్నారు. 1952 అక్టోబరు 19వ తేదీన తన దీక్ష ప్రారంభించడానికి ముందు పత్రికలకు శ్రీరాములు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో.. "మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం సాధించడానికి తీవ్రమైన కృషి జరగాలి" అని పేర్కొన్నారు. దీక్షకు ఐదు రోజుల ముందు మద్రాసు పౌరులకు చేసిన విజ్ఞప్తిలో ఆయన ఇలా పేర్కొన్నారు.. "ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని తగినంత ప్రచారం, ఆందోళన, లెక్కల సేకరణ మొదలైనవి ఇప్పటికే జరిగాయి. 1916లోనే ఆంధ్రోద్యమ ప్రచారం ముమ్మరం కావటంతో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర స్థాపన సమస్య అందరి దృష్టినీ ఆకర్షించింది. దానివలన కలిగిన తక్షణ ఫలితం అనిబిసెంటు అధ్యక్షతన 1917 డిసెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘాన్ని ఏర్పాటు చేయడం. 'ఆ రాష్ట్ర కాంగ్రెసు సంఘం మదరాసు నగరం మీద తక్కిన మదరాసు రాష్ట్ర కాంగ్రెసు సంఘంతో సమానంగా హక్కు కలిగి ఉంటుంది' అని ఒక తీర్మానం కూడా ఆ సందర్భంగా ఆమోదించబడింది." ఆయనదీక్షను చేపట్టాక...విరమించడానికి రెండు షరతులు పేర్కొన్నారు. 1) మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం ఏర్పడటం. 2) భారత ప్రభుత్వం రాజ్యాంగం లోని 3వ ఆర్టికల్ కింద ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించటం. " పొట్టి శ్రీరాములు దీక్ష వెనుక లక్ష్యం గురించి ఆయన మేనల్లుడు ఎన్ఆర్ గుప్తా మాటల్లో.. "మద్రాసు ఉమ్మడి సొత్తుగా ఉండాలని ఆయన అనుకుంటూ వచ్చారు. మద్రాసు మన సొత్తు కావచ్చు. అయితే, వాళ్లు (తమిళులు) మనం చాలా కాలంగా కలసి ఉంటున్నాము. అలాంటప్పుడు మనల్ని వాళ్లు వెళ్లిపొమ్మంటే ఎంత కష్టపడతామో.. వాళ్లను మనం వెళ్లిపొమ్మన్నా అంత కష్టపడతారు. అందువల్ల ఉమ్మడిగా నగరం చేస్తే బాగుంటుందన్నారు." "మరి నిర్వివాద ప్రాంతాలతో చాలామంది రాష్ట్రం కావాలంటున్నారు కదా! అంటే.. 'మనం మద్రాసు ఎందుకు వదులు కోవాలి? వేరేచోటకు వెళ్లి మట్టిలోను, ఇటుకల్లోను రూ. 15-20 కోట్లు ఎందుకు పోసు కోవాలి? ఇంత డబ్బు ఎందుకు వృధా చెయ్యాలి? త్వరగా రాష్ట్రం వస్తుందని ఉన్న హక్కు ఎవరైనా వదులు కుంటారా? అసలు ఆ మాటకు వస్తే మద్రాసుపై మనకు ఎక్కువ హక్కు ఉంది. ఇదంతా గుర్తించే ధార్ కమిటీ మద్రాసును ప్రత్యేక రాష్ట్రం చెయ్యాలని న్యాయంగా తీర్పు చెప్పింది. మన రాజధాని ఈ నగరంలో వద్దు అని అంతా అంటే నేను ఏమంటా? ఆంధ్ర రాష్ట్రపు రాజధాని వేరేచోట పెట్టుకోవచ్చు. అయితే, ఈ వ్యవహారాన్ని సామరస్యంతో పరిష్కరించుకోవాలి." అయితే, మద్రాసు కోసం ఎందుకు ఉపవాసం చేయటం, విడిచి పెట్టవచ్చు కదా? అని తాను అడిగానని, అందుకు శ్రీరాములు స్పందిస్తూ.. "నేను చచ్చిపోవాలని చెయ్యడం లేదు. మనకు న్యాయమైన హక్కు ఉన్నదనటం కోసం చేస్తున్నాను. అదివస్తే సంతోషిస్తాను. రాకపోతే చచ్చిపోతాను. నేను పోతే దీన్ని సాధించటానికి ఎవరికైనా అవకాశం ఉండవచ్చు" అన్నారని గుప్తా తెలిపారు. (ఆంధ్ర పత్రిక: 18 డిసెంబర్ 1952) ప్రకాశం పంతులు మాటల్లో చెప్పాలంటే.. "ఉపవాసం చెయ్యడానికి ఎవ్వరూ స్థలం ఇవ్వకపోతే అట్టలు కట్టుకొని, వీధుల్లో తిరిగి ప్రాణాలైనా అర్పిస్తానన్న పట్టుదల గల మనిషి శ్రీరాములు". ఆయనకు ఆశ్రయం ఇచ్చేందుకు బులుసు సాంబమూర్తి ముందుకు వచ్చారు. పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19వ తేదీన బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ దీక్ష ప్రారంభించారు. 1952 అక్టోబర్ 19వ తేదీ నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు ఆమరణ నిరాహార దీక్ష చేశారు. మద్రాసు లేకుండా ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డిసెంబర్ 19వ తేదీన లోకసభలో ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు. ఈ మేరకు వాంఛూ కమిటీని ఏర్పాటు చేశారు. 1953 అక్టోబర్ 1వ తేదీన కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 2008 మే 22వ తేదీన నెల్లూరు జిల్లా పేరును శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# నరక బాధ నివారిణి...నరక చతుర్దశి



ఏ చతుర్దశి నాటి అభ్యంగన స్నానం వల్ల, దీపదానం వల్ల, యమ తర్పణం వల్ల మానవులు నరకబాధ నివారణ చేసుకుంటారో దానిని "నరక చతుర్దశి" అంటారు. నరక చతుర్దశి (ప్రేత చతుర్దశి అని పర్యాయనామం కలిగి, ఈనాడు నరక ముక్తి కోసం యమ ధర్మ రాజును ఉద్దేశించి దీప దానం చేయాలని వ్రత చూడామణి చెప్తున్నది. గుజరాతీయులు నరక చతుర్దశిని "కాళ చౌదశ్" అంటారు. సంస్కృతంలో "కాళ చతుర్దశి", నరకలోక వాసులకు పుణ్య లోక ప్రాప్తి కలిగించే వేసే ఉత్సవమని, అందుకు ఉద్దేశిపబడిన కార్యకలాప దినమని, తమకు నరక లోక భయం లేకుండా చేసుకునే కార్యకలాప దినమని, నరక లోక భయం లేకుండా చేసుకునే చతుర్దశి యని ప్రాచీన గ్రంథాలు వివరి స్తున్నాయి. "చతుర్దశ్యాంతు యే దీపాన్నరకాయ దదంతి చ, తేషాం పితృగణా స్సర్వే నరకాత్ స్వర్గ మాప్నుయుః" " చతుర్దశి నాడు ఎవరు నరకలోక వాసులకై దీపాలు వెలిగిస్తారో వారి పితృ దేవతలు నరకం నుండి స్వర్గం వెళతారని శాస్త్ర వచనం, చీకటి ఉండగా స్నానం చేయని వారు నరక కూపంలో పడతారని, అందుకే తెలవారు కుండా ఈరోజు అభ్యంగన స్నానం చేయాలని నిర్దేశం. ప్రతీ మాసంలోనూ బహుళ చతుర్దశి మాస శివరాత్రి. ఆనాడు కాని, మరు నాడు కాని తెల్లవార కుండా అభ్యంగన స్నానం చేయకూడదనే నిషేధం హిందూ సమాజంలో ఉంది. అయితే ఆశ్వయుజ బహుళ చతుర్దశికి అమావాస్య చూడరు. పైగా ఈనాడు అభ్యంగన స్నానం విధిగా చేయాలని వ్రత చూడామణి మున్నగు గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. స్నానం చేస్తుండగా తలచుట్టూ దీపం తిప్పడం, టపాసులు కాల్చడం ముఖ్య ఆచారం. వధకు పూర్వం నరకాసు రుడు శ్రీకృష్ణుడు దైవాంశ సంభూతుడని తెలుసుకుని, పరమాత్ముని క్షమాభిక్ష కోరాడు. ఆ పరంధాముడు మన్నించాడు. క్షమా భిక్ష కారణంగానే నరకుడు తనకూ, తన మరణ దినం నాడు స్నానం చేసే వారికి పాప విముక్తి సంపాదించు కున్నాడు, వేకువ జామునే తైలాభ్యంగన స్నానం చేసి, యమ తర్పణం చేసే వారికి యమ దర్శనం లేదని శాస్త్రం వివరిస్తున్నది. ఆశ్వయుజ బహుళ త్రయోదశి, చతుర్దశి తిథుల మధ్య కాలంలో శ్రీకృష్ణుడు నరకా సురుడిని సంహరించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏడా ఈ దినాన పండుగ జరుపుకోవడం ఆచారమైనది.

**స్నాన సమయం..** బహుళ చతుర్దశి నాడు చంద్రోదయం ఇరవై ఎనిమిది గడియలకు అవుతుంది. అప్పటికి ఒక గంట మాత్రమే రాత్రి మిగిలిఉంటుంది. చంద్రుడు ఉండగానే తెల్లవారు జామున తలంటి పోసుకో వాలి, తిలవైలంలో లక్ష్మీదేవి ఉంటుందనే భావనతో చతుర్దశి నాడు నువ్వుల నూనెతో తలంటు కోవడం సంప్రదాయం.


**స్నాన జలం...** ఈనాడు జలమందు గంగాదేవి కళలు సమాహితమై ఉంటాయని శాస్త్ర వచనం. అభ్యంగన స్నానమునకు కావలసిన నీటిని పూర్వదిన రాత్రియందే పాత్రలందు నింపి, ఆ నీటిలోనికి జలాధి దేవతను ఆహ్వానించి, సకల మహోదధి దివ్య తీర్థ సాన్నిధ్య మును కలుగ చేసి, పూజించి, ఆ నీటినే ఉదయాత్పూర్వము స్నానమాచరించాలని వివరించ బడింది.

**ఇతర విధులు..** స్నాన సందర్భంలో మరికొన్ని విధులు నిర్దేశితాలు. స్నానానికి ఉత్తరేణి, తుమ్మి తగిలిన చెట్ల కొమ్మలతో కలియబెట్టి, కలి పిన జలంలో విద్యుత్ ఉత్తారణం అవుతుంది కనుక ఓషధుల సమ్మిళితమైన సదరు నీరు ఆరోగ్యకరం కనుక అలా వినియో గించాలి. నరకబాధ తప్పించేందుకు ఉత్తరేణి ఆకులను తలపై ఉంచు కుని, దక్షిణాభిముఖంగా కూర్చుని, 14 నామాలతో యమ ధర్మరాజుకు తర్పణం చేయాలి. ఈదినం తిల లతో చేసిన పిండి వంటలను తప్పక తినాలి. ప్రదోష కాలమందు దీప దానం చేయాలి. దేవాల యాలలో, మఠాలలో దీప పంక్తులుంచాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# దీపావళి.... లక్ష్మీ పూజ


దీపమాలికలతో లక్ష్మికి నీరా జనమీయబడే దినం కావటం వల్ల దీపావళి అని నామాంకిత మైనది. నరకలోక వాసులకై దీపం ఆవళి కల్పించే దినం కనుక దీపావళి అని వాడుక లోకి వచ్చింది. దీపావళి అంటే దీపాల సమూహం. హిందూ మత సంప్రదాయానికి దీపావళి పర్వం ఒక చిహ్నం. రాక్షస రాజు బలి చక్రవర్తిని పాతాళానికి విష్ణువు అణగ దొక్కిన దినం కనుక ఒక మహోత్సవంగా పరిగణించ బడుతున్నది. శ్రీరాముడు పట్టాభిషిక్తుడైన దినం కావున ప్రధాన్యత సంతరించుకుంది. విక్రమశక స్థాపకుడైన విక్రమార్క చక్రవర్తి పట్టాభిషేక దినం కూడా ఇదే. లక్ష్మీదేవి ఈనాడు భూలోకానికి దిగి వచ్చి ఇల్లిల్లూ తిరుగుతుందని ప్రజల విశ్వాసం. మధ్యాహ్నం పిండివంటలతో భోజనం, అనంతరం లక్ష్మీదేవి తమ ఇంటికి రావడానికి దారి చూపేందుకే దీపాలంకరణలు. వామనమూర్తి బలిచక్రవర్తిని పాతాళానికి అణచివేసి, ఆయన కారాగారంలో ఉన్న దేవతలను విడుదల చేశారు. అలా విడుదలైన వారిని లక్ష్మీదేవితో పాటు క్షీరసాగరానికి తీసుకెళ్ళారు. ఆ ఆనందానికి స్మారకంగా పండుగ ఏర్పడింది. లక్ష్మీదేవికి అత్యంత ప్రీతికరమైనది. అందుకే దీపావళి పర్వదినాన లక్ష్మీపూజ ప్రధాన కార్యంగా మారింది. పెళ్ళి అయిన కొత్త అల్లుళ్లను హిందువులు పండగకు తప్పక ఆహ్వానిస్తారు. అల్లుని రాక సందర్భంగా సంతోష సూచకంగా బాణసంచా కాలుస్తారు. భోజన సమయంలో కొత్త దుస్తులు ఇచ్చి గౌరవిస్తారు. మామతో అల్లుడు కలిసి పంక్తి భోజనం చేస్తారు. రకరకాల పిండి వంటలు వడ్డిస్తారు. ఆశ్వయుజ అమావాస్య విక్రమ సంవత్సరానికి ఆఖరి రోజు. మహారాష్ట్ర ప్రజలు పెదిపూజన్ అంటారు. వారు లక్ష్మీ సరస్వతు లను పూజిస్తారు. ఈ నాటి సాయంత్రం జమా ఖర్చుల సరి చూసుకుని, కొత్త పుస్తకాలు పెట్టుకుంటారు. వాటికి పూజ చేస్తారు. నౌకర్లకు బహుమతులు ఇస్తారు. సాయంత్రం దీపాలు వెలిగిస్తారు. దీపావళి నాటి రాత్రి లక్ష్మీపూజ చేసిన తర్వాత నిద్ర పోకుండా ఉండి, అర్ధరాత్రి దాటాక చేటల మీద కర్రలు కొట్టి, డిండిమం వాయిద్యాలు మోగించాలని శాస్త్ర వచనం. ఆ వాద్యాలే ఇప్పుడు టపాకాయలుగా కాల్చడం జరుగుతున్నది. నరకాసురుని చావుకి సంతోషించి, భూలోక వాసులు బాణాసంచా కాలుస్తూ పండుగ చేసుకుంటున్నారు. ఉల్కా - దర్శనం, అగ్గిపుల్లలు, కాకర పువ్వొత్తులు, దీపపు - కడ్డీలు, చిచ్చుబుడ్లు, మతాబులు, తారాజువ్వలు, చేటలు, డిండిమలు, తాటాకు టపాకాయలు ఢమాకా కాయలు, నేల టపాకాయలు పేల్చుట ఇదు వరకున్నది. దీపావళి నాటి నుండి నెల రోజులు పెట్టే దీపాలతో క్రిమికీటకాలు నశిస్తాయి. మందు కాల్చుల వల్ల దీపాల వెలిగించు వల్ల వాయువ్యాలు కీటకాదులను నశింప చేసే శక్తి ఉంది. దీపావళి నాడు సైతం పాప పరిహారార్థం సూర్యోదయానికి ముందే తైలాభ్యంగన స్నానం చేయాలి. ప్రదోష కాలమందు అలంకరించి దీపం ఉంచాలి. దీపావళి నాటి లక్ష్మీ పూజ వల్ల ఉన్న లక్ష్మి తొలగదని, లక్ష్మీ దేవిని ప్రసన్నం చేసుకోవడానికి దోహదం చేస్తుందని నమ్మకం. దీపావళి అమావాస్య మొదలు నెల రోజులు ఆకాశదీపం పెట్టే వారికి అనంత పుణ్యమని శాస్త్రాలు చెబుతున్నాయి.



**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ఔను.. దీన్ని 'సరెండర్' అనకూడదు - కిరణ్






'దీన్ని సరెండర్ అనకండి' %-% గతంలో ఆశన్న, ఇప్పుడు రూపేశ్ పేరుతో చెలామణి అవుతున్న తక్కళ్లపల్లి వాసుదేవరావు నిన్న జర్నలిస్టులకు, యూట్యూబర్లకు చెప్పిన మాట. దీన్ని సరెండర్‌గా చూడబోమని 'విజయ్ శర్మాజీ' కూడా ఈయన హామీ ఇచ్చాడట. అవును.. ఇది సరెండర్ ఎట్లా అవుతుంది? సరెండర్ అంటే ఉద్యమంలో కొంత కాలం పని చేసిన వాళ్లు బతుకు మీద ఆశతోనో, ఏవో విభేదాల వల్లనో, వ్యక్తిగత స్వార్థం పెరగడం వల్లనో, మరే కారణంతోనో పార్టీకి చెప్పి, తెలియజేసి బయటకు వచ్చి ప్రభుత్వం ముందు లొంగిపోవడం. ఇదీ సాధారణంగా అందరికీ తెలిసిన సరెండర్. చాలా అరుదుగా కొందరు వ్యక్తులు ఆయుధాలతో సహా పారిపోయి వచ్చి సరెండర్ అయిన ఘటనలు కూడా ఉన్నాయి. వారిని ద్రోహులుగా, ఉద్యమ శత్రువులుగా ప్రకటించిన చరిత్ర కూడా మనకు తెలుసు. కానీ వేణుగోపాల్, వాసుదేవరావులు పాల్పడ్డది ఈ రెండు కోవల్లోకీ వచ్చేది కాదు. అందుకే ఇది సరెండర్ కాదు. ఇది విద్రోహం కూడా కాదు.... ఇది విప్లవ ప్రతిఘాతుకత్వం. వీళ్లిద్దరూ విప్లవ ప్రతిఘాతకులు %- counter-revolutionaries! వాసుదేవరావు అడవిలోంచి ఇంకా పూర్తిగా బయటకు రాకముందే మీడియా ముఖంగా తన ఫోన్ నెంబర్, ఒకటికి రెండు సార్లు రెట్టించి మరీ ప్రకటించాడు. తన 'శాంతి' మార్గానికి మద్దతు పలికేవాళ్లు తనను కాంటాక్ట్ చేయొచ్చని చెప్పాడు. అది ఆయనకు రాజ్యం ఇచ్చిన ఫోన్ అని, అది ఆయనకు రాజ్యం ఇచ్చిన డైరెక్షన్ అని తెలుసుకోవడానికి పెద్దగా శ్రమ పడనక్కరలేదు. అంటే.. పోరాటాన్ని కొనసాగిస్తామంటున్న అగ్ర నేతలతో ఉన్న గెరిల్లా దళ సభ్యుల్లో బలహీనులు ఎవరైనా ఉంటే, వారు ఈ ఫోన్ నెంబర్‌ను కాంటాక్ట్ చేస్తే చాలు... ఈయనకు ఈ ఫోన్ అందించిన రాజ్యం వారి లొకేషన్‌ను ట్రాక్ చేసి వెంటనే వారిని మట్టుపెట్టేందుకు వేసిన ఎత్తుగడ ఇది అని అర్థం చేసుకోవడానికి మనం సైంటిస్టులు కావాల్సిన అవసరం లేదు. ఇంతకన్నా విప్లవ ప్రతిఘాతుకత్వం మరేదైనా ఉంటుందా? అంటే, ఈయన ఇంద్రావతి నది ఒడ్డు నుంచి ఇంకా జగ్దల్‌పూర్‌కు చేరుకోకముందే మిగిలిన వారిని అంతం చేసే పథకాన్ని అమలు చేయడంలో ఎలాంటి ఆలస్యం చేయకుండా, అత్యంత చురుగ్గా నిమగ్నమైపోయాడన్న మాట!

ఇక ఈయన రాజ్యం ముందు ఉంచానని, వాటిలో కొన్నింటిని ప్రభుత్వం ఇప్పటికే ఆమోదించిందని చెబుతున్న డిమాండ్లు నవ్వు పుట్టించేలా ఉన్నాయి. డీఆర్‌జీలో చేరాలని వీళ్లను ఒత్తిడి చేయొద్దనేది వాటిలో ఒకటట. వాళ్లు %-% సరే మేమేం ఒత్తిడి చేయం అన్నారట. అసలు విప్లవోద్యమం ఈ స్థాయిలో బలహీనపడ్డ తర్వాత డీఆర్‌జీలో ఇప్పుడున్న వారినే ఇళ్లకో లేదా ఇతర బలగాల్లోకో పంపాల్సిన పరిస్థితి ఉంటుంది కదా! ఇక వాసుదేవరావు మనుషులతో వాళ్లకేం పని?

ఇకపోతే %-% జైళ్లలో ఉన్న వాళ్లలో వీరి మార్గానికి ఓకే అన్న వాళ్లను వదిలేస్తామనేది మరో హామీనట. అసలు జైళ్లలో ఉన్న వారిలో అత్యధికులు నిర్దోషులు, ఉద్యమ కార్యకలాపాలతో సంబంధం లేని మామూలు ప్రజలే అనేది లోకానికంతా తెలిసిన విషయం. కానీ ఈయన మాత్రం చాలా విచిత్రంగా వేణు-వాసుల 'శాంతి' పంథాను %-% అంటే ఇక పోరాటం చేయబోమని %-% ఒప్పుకుంటే విడుదల చేయిస్తాడట. అలాంటి వారు జైలు అధికారుల అనుమతితో తనకు ఫోన్ చేసి చెప్పొచ్చంట. అంటే జైళ్లలో ఉన్న వాళ్లలో కూడా ద్రోహుల్ని తయారు చేసే ప్రక్రియకు పూనుకున్నాడు వాసుదేవరావు. ఇక బందీల్లో ఎవరైనా వీరి పంథా తప్పంటే వారిక ఎల్లకాలం, మరిన్ని తప్పుడు కేసులపాలై జైళ్లలో మగ్గిపోవాల్సిందేనన్న మాట. అంటే ఈయన ఉద్యమంలో ఉన్న వారినే కాదు, జైళ్లలో ఉన్న వారిని కూడా లొంగదీసేందుకు కుట్ర పన్నడమే కాక... ఇప్పటికే కార్యాచరణను కూడా మొదలుపెట్టాడు! ఎంత దుర్మార్గం! ఎంత విప్లవ ప్రతిఘాతుకత్వం! మరొకటి మూలవాసీ బచావో మంచ్‌పై నిషేధాన్ని పొడిగించబోమనే హామీ. ఇప్పటికే కోర్టుల్లో కొందరు లాయర్లు ఆ నిషేధాన్ని సవాల్ చేశారు కాబట్టి ప్రభుత్వం హామీ ఇచ్చినా, ఇవ్వకున్నా అది రేపో, మాపో కోర్టుల్లో వీగిపోయే అవకాశం ఉంది. అయినా, అసలు ఒక్క మూలవాసీ సంఘమే ఎందుకు? దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘం, క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘం, చేతనా నాట్య మంచ్ వంటి సంఘాలపై నిషేధం ఎత్తేయాలని ఈయన ఎందుకు అడగటం లేదు? నిజానికి తుపాకులు దించి పోరాటాన్ని శాంతియుత పద్ధతుల్లో కొనసాగిస్తామనే కదా వేణు-వాసు ముఠా చెబుతున్నది? అలాంటప్పుడు ఆ సంఘాలన్నింటిపైనా నిషేధం ఎత్తివేస్తే, అవే సంఘాలతో శాంతియుతంగా, చట్టబద్ధంగా పోరాటాన్ని కొనసాగిస్తామని ఈయన ప్రభుత్వాన్ని ఎందుకు అడగలేదు? ఎందుకంటే.. ఆ సంఘాల సభ్యుల్లో ఉన్న విప్లవ స్ఫూర్తి వీరిని భయపెడుతుంది. దశాబ్దాల తరబడి విప్లవోద్యమంలో ఎన్నో కష్టాలకోర్చి కాకలుతీరిన వారి ముందుకు ఏ ముఖం పెట్టుకొని వెళ్లగలమనేది వీరి భయం! అయినా, అక్కడి సంఘాలతో వాసుదేవరావుకు ఏం పని? తెలంగాణకు వచ్చేస్తానని 'తొలి వెలుగు' రఘుతో చెప్పనే చెప్పాడు కదా? తెలంగాణలో ఉంటూ నువ్వు దండకారణ్యంలో శాంతియుత పద్ధతుల్లో విప్లవాన్ని (పోనీ.. ప్రజా పోరాటాలను) నడపనైతే నడపవు కదా?

ఇక, అన్నింటికన్నా ముఖ్యమైంది %-% జల్-జంగల్-జమీన్ అంశం. దండకారణ్య ఉద్యమానికి ఈ నినాదమే కీలకమని, పార్టీ అక్కడికి చేరుకోక ముందే అక్కడి ప్రజల్లో ఈ నినాదం ఉందని, అంతే కాదు.. మా వూళ్లో మా రాజ్యం (మావ నాటే మావ రాజ్) అనే స్వపరిపాలన స్ఫూర్తి కూడా బస్తర్ ఆదివాసుల్లో పార్టీ వెళ్లక ముందు నుంచే ఉందనే చరిత్ర నీకు తెలియకపోవచ్చు %-% చరిత్రను చదివే వారందరికీ తెలుసు. మరి నువ్వు పెట్టానంటున్న డిమాండ్లలో ఒక్కసారైనా ఈ మాట నీ నోట్లోంచి పెగలలేదెందుకు? అది సరే గానీ... నీతో వచ్చిన సభ్యులకు నువ్వు కోరుకుంటున్న స్కిల్ డెవలప్‌మెంట్‌తో నువ్వు శాంతియుతంగా ప్రజా పోరాటాన్ని ఎట్లా కొనసాగిస్తావో ఒకసారి నువ్వు చెబితే వినాలని ఉంది? గడ్చిరోలిలో సరెండర్ అయిన వాళ్లలో దాదాపు 70 మంది లాయిడ్ కంపెనీ ఉద్యోగులుగా, సెక్యూరిటీ గార్డులుగా మారిపోయి అక్కడి జల్-జంగల్-జమీన్ వినాశనంలో పాలు పంచుకుంటున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం కూడా దీన్నంతా వాళ్ల స్కిల్ డెవలప్‌మెంటేనని చెప్తోంది. పైగా వేణును బ్రాండ్ అంబాసడర్‌గా చేస్తామని కూడా లాయిడ్ కంపెనీ ఎండీ ప్రభాకరణ్ ఇప్పటికే ప్రకటించాడు.

కానీ నీ మాటల్లో ఎక్కడా కూడా అడవుల వినాశనానికి, ఆదివాసుల నిరాశ్రయతకు, నదుల కాలుష్యానికి దారితీసే మైనింగ్ కంపెనీలను అనుమతించవద్దనే మాట లేదు. ఇప్పటికే అదానీ కంపెనీ కొన్ని లక్షల చెట్ల నరికివేతకు పాల్పడుతూ, అటవీ చట్టాలన్నీ తుంగలో తొక్కుతూ ఉంటే.. ఆఖరుకు కోర్టులు కూడా దాన్ని అడ్డుకోవడం అటుంచి, దానికే దాసోహం అంటుంటే... నీ నోటి నుంచి అదానీ పదంలో 'అ' కూడా బయటకు రాలేదు. ఇక పెసా చట్టాన్ని అమలు చేయాలని, సవరించాలని నువ్వు ఉదాహరించిన పసలేని, పేలవమైన డిమాండ్లకు, ప్రజా పోరాటాలను కొనసాగిస్తామని నువ్వు చెప్పుకుంటున్న మాటలకు పొంతన ఉందా అసలు? అయినా, ఇవన్నీ అమాయక ప్రజలను, నీతో వచ్చిన బృందంలో ఉన్న అమాయక ఆదివాసీ దళ సభ్యులను మోసగించడానికి చెప్తున్న మాటలు కాకపోతే, ఆ డిమాండ్లతో లేదా అసలు బస్తర్ ప్రజల కష్టాలతో, సంఘర్షణలతో నీకేం పని? తెలంగాణకు వచ్చెయ్యాలనే ఏర్పాట్లలో ఉన్న నీకు వారి మంచిచెడ్డలతో ఏం సంబంధం? పైగా.. మీ బాస్ వేణు ప్రజలకు ముందస్తు క్షమాపణ/వీడ్కోలు పత్రం కూడా రాసిన తర్వాత నువ్వు వల్లిస్తున్న ఉత్తుత్త డిమాండ్లకు అసలు విలువేం ఉంది?ఒక జర్నలిస్ట్ నిన్ను 'పోరాటాన్ని ఇంకా కొనసాగిస్తామంటున్న వాళ్లు ఎవరెవరు' అనే ప్రశ్న అడిగినప్పుడు నువ్వు చెప్పిన సమాధానం నీ నిజస్వరూపాన్ని నగ్నంగా బయటపెట్టింది. 'వాళ్ల పేర్లు చెప్పను. వాళ్ల లొకేషన్ కూడా చెప్పను' అన్నది నీ జవాబు. మరి కొన్ని ప్రశ్నలకు కూడా 'నేను మీడియా ముందు ఈ విషయం చెప్పను' అన్నావు. అంటే రాజ్యానికి, దాని నిఘా సంస్థలకు తప్ప మరెవరికీ చెప్పవనేది దాని సారాంశమని అర్థం చేసుకోవడానికి పెద్దగా కష్టపడనక్కరలేదు. అసలు 'లొకేషన్' అనే మాటను జర్నలిస్టు అడగకుండానే నువ్వు యథాలాపంగా వాడి ఉండవని కూడా అర్థం చేసుకోవచ్చు. అంటే 'లొకేషన్' చేరవేయడంలో ఇప్పటికే నీది అందె వేసిన చెయ్యి అయి ఉండాలి. అది సరే గానీ... ఇంద్రావతి ప్రాంతంలో ఇన్నేసి నెలలుగా అక్కడక్కడే తిరుగుతూ ఉన్నా నీకేం నష్టం జరగలేదు.... ఎందుకు? కానీ అదే ప్రాంతంలో ఎక్కడో ఓ మారుముల గ్రామంలో తలదాచుకుంటున్న కార్తిక్, ఆయన గార్డు, ఆ గ్రామస్థులు 'ఎన్‌కౌంటర్'కు బలవుతారు. మరో గ్రామంలో బడిలో టీచరుగా స్థిరపడ్డ సుధీర్‌ను పట్టుకెళ్లి మరో ఇద్దరు గ్రామస్థులతో కలిపి కాల్చి చంపుతారు. మరో ఊళ్లో ఒక ఇంట్లో షెల్టర్ తీసుకుంటున్న రేణుకను %-% నీ గత ఇంటర్వ్యూలో నువ్వే చెప్పినట్టు, నువ్వు కలిసిన మరుసటి రోజే పట్టుకొని చంపేస్తారు. పైగా ఆమెతో నీ 'శాంతి' పథకాన్ని కూడా చర్చించానని చెప్పుకున్నావు. నీ పథకంతో విభేదించినందుకే కదా ఆమె ప్రాణాలు పోయింది? బసవరాజుతో రెగ్యులర్ టచ్‌లో ఉన్నానని, మీ శాంతి పథకానికి ఆయనే సూత్రధారి అని నువ్వన్నావు. ఇది బసవరాజు మొదలుపెట్టిన ప్రక్రియేనని కూడా నువ్వు నొక్కి చెబుతున్నావు. వేణు కూడా అదే అన్నాడు. నీకు, వేణుకు వంతపాడుతూ స్టేట్‌మెంట్లు ఇచ్చిన వాళ్లందరూ కూడా ఒకే భాషలో ట్రెయినింగ్ ఇచ్చిన చిలకల్లా అవే పలుకులు పలికారు! ఆ పెద్దమనిషి చితాభస్మంలోంచి లేచి రాడని, మీ తప్పుడు కూతలను ఖండించలేడని ఎంత నమ్మకమో కదా మీకు!? అదే పరిసర ప్రాంతంలో ఉన్న నీకు చీమ కూడా కట్టలేదు కానీ వేలాది బలగాలు చుట్టుముట్టి బసవరాజును, ఆయన సహచరులను మట్టుబెడతాయి. అప్పుడూ అదే కారణం చెప్పావు నువ్వు %-% ఎవరో ఇద్దరు సభ్యులు పారిపోయి ద్రోహం చేయడం వల్ల వారు నష్టపోయారని. అసలు కారణం, మీ 'శాంతి' పథకానికి ఆయన సుముఖంగా లేకపోవడమే కాదా? ఆయన నిన్ను వ్యతిరేకించినందు వల్లనే, వాళ్ల 'లొకేషన్' శత్రువుకు చేరింది కదా! దీనికి నువ్వే బాధ్యుడివని మేం ఎందుకు నమ్మకూడదో చెప్పు! మొన్నటికి మొన్న రాజుదాద, కోసదాదలు ఎవరి వల్లనో పట్టుబడ్డారని నువ్వు చెబితే ఇప్పుడు మేం నమ్మాలి! దానికి కొన్ని నెలల ముందు నుంచే నువ్వు, నీ బాస్ వేణు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులతో మంతనాలు సాగిస్తున్నారని నువ్వే కాదు, వాళు కూడా బాహాటంగానే చెప్పారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయితే, తారక్క లొంగుబాటు నుంచే వేణు మా కాంటాక్ట్‌లో ఉన్నాడని చెప్పాడన్న విషయం బయట అందరికీ తెలుసు. ఓ వైపు రాజుదాద, కోసదాదల ప్రాణాలు నీ గుప్పిట్లో ఉంటాయి. (ఎందుకంటే పట్టణంలో ఉంటున్న వారిద్దరితో కాంటాక్ట్‌లో ఉన్నానని నువ్వే చెప్పుకున్నావు.) మరోవైపు, నువ్వు రాజ్యంతో, దాని నిఘా సంస్థలతో లింకుల్లో ఉంటూ, మీ సామూహిక సాయుధ లొంగుబాటు పథకానికి ఏర్పాట్లు చేస్తూ ఉంటావు. రాజుదాద, కోసదాదలు మీ 'శాంతి' మార్గానికి మద్దతు పలికి ఉంటే వాళ్ల ప్రాణాలు పోయేవి కాదని అర్థం చేసుకోవడానికి పెద్దగా కష్టపడాల్సిన పని లేదు. ఇలా ప్రాణాలు కోల్పోయిన వాళ్లందరి 'లొకేషన్లు' శత్రువుకు చేరవేసింది ఎవరో చెప్పు! పెద్ద తలకాయల్ని లేపెయ్యడంలో సిద్ధహస్తుడివి... ఇటువైపు పెద్ద తలల్లోంచి చిందిన రక్తం కూడా నీ చేతులకు అంటిందా లేదా చెప్పు!

# చురకలు

## సంపాదకీయం

### పాక్ తో ట్రంప్ బంధం వెనుక అంత పెద్ద వ్యవహారం దాగుందా..?

రెండోసారి ప్రెసిడెంట్ అయిన తర్వాత పైకి భారత్ ను, భారత ప్రధాని మోడీని పొగుడుతున్నట్లు కనిపిస్తూనే.. వెనుక సుంకాలతో గిల్లుతున్న డొనాల్డ్ ట్రంప్.. మరోపక్క పాకిస్థాన్ తో రాసుకుపూసుకు తిరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం భారత్, అమెరికాతో పాటు ప్రపంచంలోని పలు దేశాలను ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దీని వెనుక ఓ బలమైన కారణం ఉందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు ఆ దేశ మాజీ రాయబారి ఒకరు. అవును... జపాన్ లో అమెరికా మాజీ రాయబారి రహమ్ ఇమాన్యుయేల్ తాజాగా స్పందిస్తూ... అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంతో దశాబ్దాల ద్వైపాక్షిక దౌత్య పురోగతిని విచ్ఛిన్నం చేస్తున్నారని ఆరోపించారు. చైనాను ఎదుర్కోవడంలో అమెరికాకు భారత్ అత్యంత కీలకమైన భాగస్వామి అనే విషయాన్ని గుర్తించకుండా అధ్యక్షుడు అహం చూపిస్తున్నారని అంటూ.. పాక్ నుంచి ట్రంప్ కుమారుడికి పెద్ద ఎత్తున డబ్బు అందుతోందని అన్నారు. వాస్తవానికి... ఈ ఏడాది ఏప్రిల్ లో పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్ తో అమెరికా వ్యాపారవేత్త జాక్ విట్కాఫ్ మధ్య బిజినెస్ డీల్ జరిగిన సంగతి తెలిసిందే! ఇదే సమయంలో... విట్కాఫ్ కంపెనీలో ట్రంప్ కుమారుడు జూనియర్ ట్రంప్, అల్లుడు జేర్డ్ కుష్నర్ వాటాదారులుగా ఉన్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలొచ్చాయి. ఈ నేపథ్యంలో స్పందించిన ఇమాన్యుయేల్.. పాక్ డబ్బుల కోసం భారత్ పై ఆయన కక్ష తీర్చుకుంటున్నారని అన్నారు. ఇదే సమయంలో... అధ్యక్షుడు తాను అమలు చేసిన కాల్పుల విరమణకు నోబెల్ శాంతి బహుమతికి అర్హుడని మోడీ చెప్పరు కాబట్టి ఆయన అవన్నీ చేస్తున్నారని ఆరోపించిన ఇమాన్యుయేల్.. దీనిని ఒక పెద్ద వ్యూహాత్మక తప్పిదంగా అభివర్ణించారు. ఈ నేపథ్యంలో... వాషింగ్టన్ అనుసరిస్తున్న తప్పుడు చర్యలను బీజింగ్ అందిపుచ్చుకుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా మహాసముద్రంలో పెరుగుతున్న చైనా ఉనికిని, అమెరికా వస్తువులపై పెరుగుతున్న సుంకాలను ఆయన ఎత్తి చూపారు. కాగా... 2009 నుండి 2010 వరకు అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామా హయాంలో వైట్ హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ గా.. 2011 నుండి 2019 వరకు చికాగో మేయర్ గా పనిచేసిన ఇమాన్యుయేల్.. 2003 నుండి 2009 వరకు అమెరికా ప్రతినిధుల సభలో మూడు పర్యాయాలు కూడా పనిచేశారు.

**పాడిందే పాడరా అన్నట్లుగా...!:** మరోవైపు ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ – పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త వాతావరణం సమయంలో.. కాల్పుల విరమణకు సంబంధించి ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. ఇందులో భాగంగా... ఇరు దేశాలు యుద్ధం ఆపకపోతే 200% టారిఫ్ లు విధిస్తానని తాను హెచ్చరించానని.. వాణిజ్యంతోనే తాను ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించానని తెలిపారు. దీంతో... ఈ విషయంపై ట్రంప్ ఇప్పటికి సుమారు 50 సార్లు మాట్లాడారని అంతర్జాతీయ మీడియా నివేదించింది!


# జర్నలిస్టులకు ఆదర్శం విద్వాన్ విశ్వం - అక్టోబర్ 19... విద్వాన్ విశ్వం వర్ధంతి

రాజకీయం, సాహిత్యం, పత్రికా రచనల మూర్తిమంతం విద్వాన్ విశ్వం. తరిమెల నాగిరెడ్డి, నీలం రాజశేఖరరెడ్డి వంటి వామపక్ష రాజకీయ వాదుల సాహచర్యంతో కమ్యూనిస్టుగా తన రాజకీయ జీవితం ఆరంభించిన స్వాతంత్ర్య సమరయోధుడు విశ్వం. సంస్కృతం, ఆంగ్లం, తెలుగు భాషల్లో పండితులు. చిలుకూరి నారాయణరావు వంటి భాషా శాస్త్రజ్ఞుల శిష్యులుగా మద్రాసులో విద్వాన్ విశ్వం అయ్యారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం బెనారస్ వెళ్ళిన విశ్వానికి మదన మోహన మాలవ్యా లాంటి ప్రముఖుల ప్రశంసలకు పాత్రుడైనాడు. బళ్ళారిలో "ఆకాశవాణి" రహస్య పత్రికను నడిపినందుకు జైలు శిక్ష అనుభవించారు. మీజాన్, ప్రజాశక్తి, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేశాడు. విద్వాన్ విశ్వం (అక్టోబర్ 21, 1915 – అక్టోబర్ 19, 1987) 1915, అక్టోబర్ 21న అనంతపురం జిల్లాలో తరిమెల గ్రామంలో ఒక విశ్వ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఆయన పూర్తి పేరు మీసరగండ విశ్వరూపాచారి. విశ్వం స్వగ్రామంలో చిన్నతనంలో రామాయణం శంకర శాస్త్రి వద్ద సంస్కృతం నేర్చుకున్నాడు. సంప్రదాయ పద్ధతిలో కర్నూలు, ప్రొద్దుటూరులలో సంస్కృత కావ్య నాటక అలంకారాలను, తర్క శాస్త్రాన్ని అభ్యసించాడు. మద్రాసు విశ్వ విద్యాలయం నుండి సంస్కృతం లో, ఆంధ్రంలోనూ విద్వాన్ పట్టా పుచ్చుకున్నాడు. అనంతపురంలో చిలుకూరు నారాయణ రావు వద్ద శిష్యరికం చేశాడు. కాశీ విశ్వ విద్యాలయంలో పరిశోధన చేస్తూ అనారోగ్యం వలన పూర్తి చేయలేక పోయాడు. కాశీ నుండి అనంతపురం తిరిగి రాగానే తరిమెల నాగిరెడ్డితో కలిసి రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించాడు. ప్రజలను చైతన్య పరచటానికి గ్రంథ ప్రచురణ అవసరమని భావించి నవ్య సాహిత్యమాల అనే ప్రచురణ సంస్థ ఏర్పాటు చేసి నవ్యసాహితి అనే పత్రికకు సంపాదకత్వం వహించాడు. ఫాసిజం మొదలైన అంశాలపై పుస్తకాలను ప్రచురించాడు. దానితో బ్రిటీషు ప్రభుత్వం రాజద్రోహం క్రింద తరిమెల నాగిరెడ్డిని, విద్వాన్ విశాన్ని అరెస్టు చేసి మొదట బళ్ళారిలోని అల్లీపూర్ జైల్లోనూ ఆ తర్వాత తిరుచిరాపల్లి జైలు లోనూ నిర్బంధించింది. తిరుచిరాపల్లి జైలులో విశ్వం బెజవాడ గోపాలరెడ్డి వద్ద బెంగాలీ నేర్చుకున్నాడు. ఈ జైలులో రాజాజీ, టంగుటూరి ప్రకాశం వంటి నాయకుల సాహచర్యం లభించింది. ఈయన అనంతపురం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా, రాయలసీమ కాంగ్రెస్ కమిటీ కార్యాలయ కార్యదర్శిగా, అనంతపురం జిల్లా జాతీయ సభకు, జిల్లా లోక జన సంఘానికి, మండల క్షామ నివారణ సభకు, జిల్లా ఆంధ్ర మహాసభకు ప్రధాన కార్యదర్శిగా,జిల్లా రైతు మహాసభకు ఉపాధ్యక్షుడుగా పనిచేశాడు. ఉద్యమం, ఉపన్యాసం మాత్రమే కాకుండా మరింత లోతుగా రాజకీయాలు శాస్త్ర పద్ధతిలో వివరించడానికి పత్రికారంగం వైపు దృష్టి సారించాడు. అడవి బాపిరాజు ఆహ్వానించడంతో మీజాన్ పత్రికలో 1945లో అసిస్టెంట్ ఎడిటర్గా చేరి కొంతకాలం పనిచేశాడు. తరువాత విజయవాడలో ప్రజాశక్తి దినపత్రికలో అసిస్టెంట్ ఎడిటర్గా సుమారు మూడు సంవత్సరాలు పనిచేశాడు. "మీజాన్" పత్రికలో రచనా వ్యాసంగం, "ప్రజాశక్తి"లో సంపాదకత్వం పాండితీ భాషలోనే సులభ శైలిని సాధించ గలిగినా, పరిపాలనా యంత్రాంగపు నిర్బంధాలకు గురయ్యాడు. తర్వాత మద్రాసుకు తరలి వెళ్ళి అక్కడ బాల భారత్ విద్యాలయంలో సంపాదకుడిగా కొన్నాళ్ళు పనిచేశాడు. 1952 ఆగష్టు 15న ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ప్రారంభమైనపుడు దానిలో ఎడిటర్ ఇన్చార్జ్గా చేరి 1959 వరకు పనిచేశాడు. 1959లో ఆంధ్రపత్రిక దినపత్రికలో అసిస్టెంట్ ఎడిటర్గా కొంతకాలం పనిచేసి 1960లో విజయవాడకు వచ్చి ఆంధ్రజ్యోతి దినపత్రికలో అసోసియేట్ ఎడిటర్గా పని చేశాడు. మళ్ళీ 1963లో ఆంధ్రప్రభ దినపత్రికకు అసోసియేట్ ఎడిటర్ చేరాడు. 1967లో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికకు సంపాదకుడిగా మారాడు. ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో పదవీ విరమణ చేసిన తరువాత 1981నుండి తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగానికి ప్రధాన సంపాదకునిగా వ్యవహరించాడు. ఈ సమయంలో విశ్వం కథా సరిత్సాగరాన్ని 12 సంపుటాలుగా తెనుగించాడు. "చందమామ"లో ద్విపద కావ్యం రూపంలో వ్రాసిన పంచతంత్ర కథలను బాపు బొమ్మలతో తి.తి.దే.ప్రచురణగా వెలువరించాడు. బ్రహ్మసూత్రాలు శంకరభాష్యం నాలుగు సంపుటాలను, అథర్వణ వేదాన్ని అనువాదం చేసి ప్రచురించాడు. శ్రీసాధన పత్రిక 1938–1939లో "విశ్వభావన"బీ ఆంధ్రప్రభ వారపత్రిక 1952–1959లో తెలుపు – నలుపుబీ ఆంధ్రపత్రిక దినపత్రిక 1958–1959లో "అవీ – ఇవీ"బీ ఆంధ్రజ్యోతి దినపత్రిక 1960–1962లో "ఇవ్వాళ"బీ ఆంధ్రజ్యోతి దినపత్రికలో టీకా–టిప్పణిబీ ఆంధ్రప్రభ దినపత్రిక 1962–1966, ఆంధ్రప్రభ



వారపత్రిక 1967–1987లో మాణిక్య వీణ తదితర శీర్షికలను నిర్వహించారు. 1987 అక్టోబర్ 19వతేదీన తుది శ్వాస వదిలాడు. పత్రికారంగంలో ఉన్నత విలువలు నిలబెట్టిన విశిష్ట పాత్రికేయులుగా నేటి తరం పాత్రికేయులకు విద్వాన్ విశ్వం ఆదర్శప్రాయుడు. విశ్వం గురించి ప్రముఖుల అభిప్రాయాలు దాశరథి...మనస్సు విప్పి మాట్లాడి సాటి రచయితలను తన వాళ్ళుగా భావించి సాటివారి శ్రేయస్సుని కోరేవారు అరుదు. ఆ సద్గుణం మేము విశ్వంగారిలో చూశాము. డాక్టర్ సి. నా. రె...కన్నీటి సుడులెన్నో కూర్చి 'పెన్నేటి పాట'గా తీర్చి రాళ్ళలో మేల్కొల్పినావు రసదిగ్ధ భావామృతార్చి 'మాణిక్యవీణ'పై నీవు మత్యంగుళులు సాచినావు పదునైన లోకవృత్తాలు అదునెరిగి పలికించినావు! మిక్కిలినేని.... విశ్వం నిండుకుండ. తొణకరు, బెణకరు. భావాల్లో అతివాది. మాటల్లో మితవాది. నిగర్వి. మందహాసంతో అందర్నీ హుందాగా పలకరించే విశాలతత్వం. మెరమెచ్చుల కోసం ఎవర్నీ ఆకాశానికెత్తి పొగడరు. తాను నమ్మిన సత్యాన్ని నమ్రతగా అందలమెక్కిస్తారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అణు భౌతిక శాస్త్ర పితామహుడు రూథర్‌ఫోర్డ్ - అక్టోబర్ 19...ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ వర్ధంతి



ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ (ఆగస్టు 30 1871 – అక్టోబరు 19 1937) న్యూజీలాండ్ కు చెందిన ఒక రసాయన శాస్త్రజ్ఞుడు. ఆయనకు అణు భౌతిక శాస్త్ర పితామహుడు అనే బిరుదు గలదు. రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి (1908) పొందాడు. అణువులలో శక్తితో కూడిన కేంద్రకం వుంటుందని కనిపెట్టాడు. పరమాణువులో ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్ అనే మూడు ముఖ్యమైన మూలకణాలున్నాయి. ఈ కణాలు పరమాణువులో ఏ విధంగా అమరి ఉన్నాయో తెలియజెప్పేదే పరమాణు నిర్మాణం. దీనికి సంబంధించి శాస్త్రవేత్తలు ఎన్నో నమూనాలను ప్రవేశ పెట్టారు. అందులో రూథర్ ఫర్డ్ నమూనా ఒకటి. తను చేసిన ఖ- కణ పరిక్షేపణ ప్రయోగ పరిశీలనల ఆధారంగా ఈ నమూనాని ప్రతిపాదించాడు. అణువు యొక్క రూథర్‌ఫోర్డ్ నమూనా (లేదాగ్రహ మండల నమూనా, ఇదే సిద్దాంతం ఆ తరువాత బోర్ నమూనా లేదా కక్ష్యా నమూనాగా ఏర్పడడానికి దోహద పడింది) ను ప్రతిపాదించాడు. ఆయన రూథర్‌ఫోర్డ్ ఖ–కణ పరిక్షేపణ ప్రయోగాన్ని బంగారు రేకు గుండా ఖ–కణ పరిక్షేపణ ప్రయోగంచేసి కెంద్రకం యొక్క ఉనికిని కనిపెట్టాడు. 1908లో రసాయనిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. న్యూజిలాండ్ లోని నెల్సన్ లో 1871 ఆగస్టు 30న జన్మించిన రూథర్‌ఫర్డ్ కు చిన్నతనం లోనే సైన్స్ పట్ల అభిరుచి కలిగింది. పదేళ్లకే ఎలిమెంటరీ ఫిజిక్స్ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివేశాడు. న్యూజిలాండ్ విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్‌తో చేరిన అతడు బీఏ, ఎమ్ఏ, బీఎస్సీ డిగ్రీలు సాధించాడు. ఇంగ్లండ్ లోని కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తూనే అత్యంత వేగంగా ప్రయాణించే విద్యుదయ స్కాంత తరంగాలను కనిపెట్టి ప్రపంచ రికార్డు సాధించాడు. ఇరవై ఏడేళ్ల వయసులోనే కెనడా లోని మెగిల్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరి పరిశోధనల్లో నిమగ్న మయ్యాడు. అక్కడే యురేనియం, థోరియంలాంటి రేడియోధార్మిక పదార్థాలు వెలువరించే ఆల్ఫా, బీటా వికిరణాలను ఆవిష్కరించాడు. రేడియోధార్మిక విఘటనం (%ఞుఎఅశీ ఖ఼ఱజవ ుఎవఘుఎ%) నియమాలను ప్రతిపాదించాడు. ఒక రేడియో ధార్మిక పదార్థంలో ఉండే సగం పరమాణువులు విఘటనం చెందడానికి పట్టే 'అర్థ జీవిత కాలం' ను నిర్వచించాడు. ఈ సూత్రం ప్రకారం రేడియో డేటింగ్ పద్ధతి ద్వారక్వ భూమి వయస్సును కూడా కనుగొనవచ్చని చెప్పాడు. అలాగే కృత్రిమ మూలకాల పరివర్తన ద్వారా నైట్రోజన్‌ను, ఆక్సిజన్‌గా మార్చవచ్చని తెలిపాడు. ఈ పరిశోధనలకు 1908లో నోబెల్ బహుమతి అందుకున్నాడు. కెనడా నుంచి ఇంగ్లండ్ తిరిగి వచ్చిన తర్వాత పలుచటి బంగారు రేకుపై ధనావేశమున్న ఆల్ఫా కిరణాలను ప్రసరింప చేసినప్పుడు 20000 కణాలలో ఒకటి వెనక్కి తిరిగి రావడాన్ని గమనించాడు. అందుకు కారణం పరమాణువులో ధనావేశమున్న కేంద్రకం ఉండటం కారణంగా కేంద్రకంలో ఉండే ప్రోటాన్లు వాటిని వికర్షించడమేనని కనుగొన్నాడు. సూర్యుడి చుట్టూ గ్రహాలు తిరుగుతున్నట్టే, పరమాణువు ల్లోని కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్లు తిరుగుతూ ఉంటాయని ప్రతిపాదించాడు. ఇదే రూథర్‌ఫర్డ్ పరమాణు నమూనాగా పేరొందింది. దీనినే గ్రహమండల నమూనా అంటారు. ఆ తర్వాత కేంద్రకంలో ప్రోటాన్లతో పాటు న్యూట్రాన్లు ఉంటాయని ఊహించాడు. రసాయన చర్యలతో ఒక మూలకాన్ని వేరొక మూలకంగా మార్చలేం. కానీ కేంద్రక చర్యలతో ఒక మూలకాన్ని మరొక మూలకంగా మార్చవచ్చు. స్థిరమైన మూలక కేంద్రకాలను ఖ – కణం లేదా ప్రోటాన్‌తో తాడించడం వల్ల వాటిని వేరొక మూలకాలుగా మార్చొచ్చు. ఈ ప్రక్రియను కృత్రిమ పరివర్తనం అంటారు. రూథర్‌ఫర్డ్ మొదటిసారిగా నత్రజనిని ఆక్సిజన్‌గా మార్చాడు. ఆ విధంగా ఏర్పడిన మూలకాలు కొన్ని రేడియో ధార్మికతను ప్రదర్శిస్తాయి. వాటిని రేడియో ఐసోటోపులు అంటారు. వాటిని మనం వైద్య రంగంలో, వ్యవసాయ రంగంలో, పరిశ్రమల్లో ఉపయో గిస్తున్నాం .ఆయన శిష్యుల్లో చాలా మంది నోబెల్ బహుమతులు సాధించడం విశేషం. అనేక అవార్డులు సాధించిన ఆయన గౌరవార్థం 104 అణుసంఖ్య ఉన్న మూలకానికి రూథర్ ఫోర్డియం అని పేరు పెట్టారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ప్రమాదకారకాలైన టపాసుల పట్ల అవగాహన అవసరం

టపాసులకు ఆద్యులు చైనీయులు. క్రీ.పూ. 200 సం. లోనే వెదురు (బాంబూ) టపాకాయలు వాడినట్లు ఆధారాలు ఉన్నాయి. దాన్ని చైనా బాషలో బాజు అంటారు. పేలుతున్న వెదురు అని అర్థం. తుపాకి మందు కని పెట్టేంత వరకు వెదురు టపాసులనే చైనా వారు వాడేవారు. క్రీ.శ. 600ల ప్రాంతంలో చైనా వారు తుపాకి మందుని కనిపెట్టారు. గన్ పౌడర్ లేక బ్లాక్ పౌడర్ రసాయన ప్రేలుడు పదార్థం. ఇది గంధకం, చార్కోల్, పోటాషియం నైట్రేట్ ల మిశ్రమం. దీన్ని సాల్ట్ పౌడర్ అంటారు. ఇది మండినప్పుడు 427 నుంచి 464డిగ్రీల ఉష్ణం వెలువడుతుంది. దీని తరువాత చేసేవారు అందుకే టపాసులకు బాజు పేరు స్థిరపడి పాయింది. క్రీ.శ. 900వ సం.లో చైనా నుండి టపాసులు ఇంగ్లాండు అరబ్బు దేశాలు, భారత దేశానికి చేరుకున్నాయి. మనదేశంలో టపాకాయల పరిశ్రమ తమిళనాడులోని శివకాశిలో విస్తరించివుంది. దేశంలోని టపాకాయల ఉత్పత్తిలో 70% శివకాశిలోని 1000కి పైగా పరిశ్రమలలో తయారవు తున్నది. పరిశ్రమలలో పనిచేసే వారు ముఖ్యంగా పసిపిల్లలు. వారిలో 4 నుంచి 16 సం.లోపు వారు 30% మంది వున్నారు. అందులో 90% మంది ఆడ పిల్లలు, పేద పిల్లలు, వెనుకబడిన తరగతివారు. చేతులకు ఎలాంటి రక్షణ కవచాలు (గ్లౌజులు) లేకుండా ప్రమాదకర రసాయన పదార్థాలలో టపాసులు తయారు చేస్తున్నారు పిల్లలు. రసాయనాల వల్ల శ్వాసకోశ సంబంధ వ్యాధులు, చర్మ వ్యాధులతో బాధ పడుతున్నారు. ప్రభుత్వ చట్టాలు ఎన్ని వున్నా పిల్లలు చేసే ఈ చాకిరీని అరికట్టలేక పోతున్నారు. 1991లో శివకాశిలో ఓ ఫ్యాకల్టీలో జరిగిన ప్రేలుడు వల్ల 39 మంది చనిపోయారు. 65 మంది గాయపడ్డారు. 2009, జూలైలో జరిగిన ప్రమాదంలో 40 మంది చనిపోయారు. ఆగస్టు 2011లో ఫ్యాక్టరీ ప్రమాదంలో 7 మంది చనిపోగా ఐదుగురు గాయపడ్డారు. సెప్టెంబర్ 2012 ప్రమాదంలో 40 మంది చనిపోగా 38 మంది గాయ పడ్డారు. ఇవి అధికారిక లెక్కలు కాగా, నిజానికి ఎక్కువగానే ప్రమాదాలు జరిగి వుంటాయి. టపాకాయలు కాల్చడం వల్ల పర్యావరణం దెబ్బతింటుంది. గాలి కాలుష్యం, శబ్ద కాలుష్యం, రసాయన కాలుష్యం చాలా ఎక్కువగా వుంది. టపాసులు కాల్చినప్పుడు శబ్దం 140 డెసిబెల్స్ దాటుతోంది. ఆరోగ్య పరంగా శబ్దాలు 125 డెసిబెల్స్ దాట కూడదు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టపాకాయల శబ్ద తీవ్రత 125 డెసిబెల్స్



దాట కూడదు. కానీ టపాకాయల తయారీ కంపెనీలు నియమాన్ని పాటించడం లేదు. ఈ శబ్దాల వల్ల తాత్కాలిక చెవుడు, శాశ్వత చెవుడు ఏర్పడు తున్నది. అధిక శబ్దం వల్ల వినికిడి సమస్యలు, రక్తపోటు, గుండెపోటు, నిద్రలేమి లాంటి సమస్యలు వస్తున్నాయి. ఎన్నో రకాల ప్రమాదాలు పొంచి వున్నాయి. టపాకాయలు కాల్చడంలో అగ్ని ప్రమాదాలు కోకొల్లలు. చేతిలో చిచ్చుబుడ్డి పేలడం, ఒళ్ళుకాలడం, బట్టలు కాలి పోవడం జరుగుతూనే వుంటాయి. చాలా మంది ఆ వెలుగు చూడలేక కళ్ళు పోగొట్టుకున్న సందర్భాలు అనేకం. దీపావళి సందర్భంగా టపాకాయలు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చు. టపాకాయలు కాల్చేటప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం చేస్తే పెద్ద ప్రమాదాలు సంభవిస్తాయి. బాణ సంచాలను ఇంటిలో కాల్చ కూడదు. ఇంటికి దూరంగా బహిరంగ ప్రదేశాలలో కాల్చడం వల్ల ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. టపాకాయలు కొన్నిసార్లు అవి పేలకుండా ఆగిపోతాయి. వాటిని వెంటనే వెళ్లి పట్టుకోవడం లాంటివి చేయకూడదు. ముందుగా వాటిపై నీటిని పోయడం వల్ల వాటి నుంచి ఎలాంటి ప్రమాదం జరిగే అవకాశం ఉండదు. టపాకాయలు కాల్చేటప్పుడు ముఖ్యంగా ఆల్కహాల్ శానిటైజర్ లను వాడి టపాకాయలను వెలిగించ కూడదు. శానిటైజర్ లకు తొందరగా మండే స్వభావం ఉండటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున దీపావళి రోజు శానిటైజర్ లను వాడక పోవడం మంచిది. టపాకాయలపై ఇచ్చిన సలహాలు సూచనలను ఖచ్చితంగా చదివి పాటించాలి. మంటలు అంటుకునే ప్రదేశాలు... కరెంటు తీగలు, ఎండు గడ్డి, పూరి గుడిసెలు ఉన్న ప్రదేశాలలో బాణా సంచాలు కాల్చ కూడదు. టపాకాయలను కాల్చి వాటిని అలాగే రోడ్డు మీద పడేయడం వల్ల ఆ దారి వెంట వెళ్లే వారికి వాటి నుంచి ప్రమాదం కలగవచ్చు. ఒక బకెట్లో ఇసుక పెట్టుకొని అందులో కాల్చిన కాకర పువ్వులను, టపాకాయలను వేయడం మంచిది. బాణా సంచాలను కాల్చేటప్పుడు ముందస్తు జాగ్రత్తగా ఒక బకెట్ నిండా నీటిని పక్కన ఉంచుకోవాలి. చిన్నపిల్లలకు పెద్దవారే దగ్గరే ఉండి జాగ్రత్తగా టపాకాయలను కాల్పించాలి. వీలైనంత వరకు అందరూ కూడా కాటన్ దుస్తులను ధరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బాణసంచా కాల్చిన తర్వాత పిల్లలు టపాకాయలను కాల్చిన చేతులతోనే ముక్కు, చెవులు, కళ్లను రుద్దుకుంటారు. చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. గొంతులో నీళ్లు పోసుకుని గార్గిలింగ్ చేయాలి. గాయం అయితే దాని మీద పదిహేను నిమిషాల పాటు చన్నీరు, వేడి నీరు పోయరాదు. తర్వాత ధారగా పోయాలి లేదా నీటి కుళాయి కింద పెట్టాలి. గాయమైన అరగంట లోపల ఈ చికిత్స జరగాలి. ఇలా చేయడం వల్ల వేడి తగ్గిపోతుంది. కంటికి చువ్వలాంటిది తగిలి గాయం అయినప్పుడు వెంటనే చేత్తో కానీ కంటిని రుద్దుతారు. చాలా ప్రమాదం. గాయం తీవ్రత పెరగడానికి, గాయం విస్తరించ డానికి కారణం అవుతుంది. కంటికి వస్త్రంతో గట్టిగా కట్టు కట్టకూడదు. ఇలా చేస్తే కంట్లో గుచ్చుకున్న నలుసు మరింత లోపలికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. కాబట్టి గాయమైన కంటిని కప్పు లేదా షీల్డుతో కప్పి డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్ళాలి. రసాయనాలు కంట్లో పడితే కంటిని పరిశుభ్రమైన నీటితో కడగాలి. కంటిని రుద్దకుండా దోసిలితో నీటిని తీసుకుని కంటికి తగిలేటట్లు చేస్తూ శుభ్రం చేయాలి. టపాసుల వినియోగాన్ని తగ్గించాలి. అధిక శబ్దాలు వెలువరించే టపాసులు కాల్చకూడదు. టపాసులు పర్యావర ణానికి ప్రమాద కారకాలు. టపాసుల కోసం డబ్బు వృథా చేయవద్దు. వెలుగులు నింపే దీపాలతో దీపావళి చేసుకుందాం. పర్యావరణ పరిరక్షణ దీపావళిని జరుపుకుందాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# అనుమతి లేకుంటే సై'ఖతం'

దమ్మపేట : ఏపీలోని కొవ్వూరు ఇసుక రేవు నుంచి తెలంగాణలోకి అక్రమంగా ప్రవేశించిన రెండు ఇసుక టిప్పర్లను సత్తుపల్లి పోలీసులు నాగుపల్లి–బుగ్గపాడు నడుమ ఈనెల 23న పట్టుకున్నారు. టిప్పర్లు పట్టుబడిన ప్రాంతం దమ్మపేట మండలం పరిధిలోకి వస్తుండటంతో వాహనాలను దమ్మపేట పోలీసులకు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి దమ్మపేట మండలానికి ఇసుక టిప్పర్లు ప్రవేశించే జలవాగు, వడ్లగూడెం సరిహద్దుల్లో కొంతమంది అటవీశాఖ సిబ్బంది అర్ధరాత్రి పూట పహారా కాస్తున్నారు. టిప్పర్లను అడ్డుకుని అటవీప్రాంతం నుంచి ఇసుక తీసుకొస్తున్నారని, కేసులు బనాయిస్తామంటూ బెదిరించి రూ.వేలు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు దమ్మపేటకు చెందిన కొంతమంది విలేకరులు (ఈనాడు, ఈటీవీ కాదు) ముసుగులో ఏపీలోని ఇసుక ర్యాంపుల నిర్వాహకులతో కుమ్మక్కై దందా సాగిస్తున్నారు. ఇదొక ఆదాయ వనరుగా మారటంతో తమ వద్దే ఇసుక కొనాలని సామాన్యులను బెదిరించి పోలీసు కేసుల్లో ఇరుక్కుంటున్నారు.


**ఏపీ ఇసుకపై చోటా నాయకుల కన్ను**

ఏపీ ఇసుక దందాపై కొంతమంది చోటా నాయకుల కన్ను పడింది. ఇసుక మాఫియాను గుప్పిట్లోకి తీసుకున్నారు. తమ అనుమతి లేకుండా దమ్మపేట మండలానికి వస్తున్న ఇసుక టిప్పర్ల సమాచారాన్ని



పోలీసులకు చేరవేస్తున్నారు. కేసులు పెట్టిస్తున్నారు. ఏపీలోని ఇసుక ఇక్కడి అధికారులు, నాయకులు, మరికొంతమందికి కాసులు కురిపిస్తోంది. దమ్మపేట, అశ్వారావుపేట, సత్తుపల్లి మండలాల్లో ఇప్పుడు ఇసుక దందానే నయా ట్రెండ్‌గా మారింది. రాజమహేంద్రవరంలో 30 టన్నుల ఇసుక లారీ లోడింగ్, రవాణా ఛార్జీలతో కలిపి మొత్తం ఇక్కడికి చేరుకునే సరికి రూ.20వేల నుంచి రూ.25 వేలు ఖర్చవుతుంది. ఇక్కడ టన్ను రూ.1,500కు అమ్ముతున్నారు. సుమారు లారీ ఇసుకను రూ.40వేల నుంచి రూ.45వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దమ్మపేట మండలంలో ఇసుక అక్రమాలపై దృష్టి సారిస్తాం. ఏపీ నుంచి ఇసుక తీసుకొచ్చి ఇక్కడ దందా చేస్తున్నవారి వివరాలు సేకరిస్తున్నాం. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. సామాన్యులు ఇసుక కోసం దళారులను ఆశ్రయించవద్దు. భగవాన్‌రెడ్డి, తహసీల్దారు, దమ్మపేట

# రోగ నిర్ధారణ ఖర్చు ఇంతింత కాదయా!



కరీంనగర్ : మల్యాలకు చెందిన ఓ యువకుడు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి నడుము నొప్పి ఉందని వెళ్లాడు. ద్విచక్ర వాహనంపై తిరిగే ఆయన వివరాలు తెలుసుకున్న వైద్యుడు కచ్చితంగా ఎంఆర్ఐ స్కాన్ చేసుకోవాలని సూచించారు. 'ఏదైనా ఉంటే ఇప్పుడే బయటపడుతుంది.. ఆలస్యం చేస్తే ఆపరేషన్ దాక పరిస్థితి వెళుతుంది'.. నీ ఇష్టమని చెప్పడంతో యువకుడు సరేనన్నాడు. దీంతోపాటు పలు రకాల రక్త పరీక్షలు చేయించడంతో మొత్తం రూ.6,800 ఖర్చయింది. వైద్యుడి ఫీజు రూ.500. తీరా రిపోర్ట్‌లు వచ్చాక.. అందులో ఏమి లేదని రెండ్రోజులు విశ్రాంతి తీసుకుంటే చాలని రూ.1,100 విలువైన మందులను రాశారు. నెలంతా కష్టపడితే రూ.18 వేలు సంపాదించే యువకుడు లేని రోగానికి రూ.8400 ఖర్చవడంతో బోరుమన్నాడు.

సిరిసిల్లకు చెందిన మహిళ స్థానికంగా ఉన్న వైద్యుడిని సంప్రదించి అక్కడ రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంది. అయినా బాధ తగ్గకపోవడంతో కరీంనగర్‌కు వచ్చింది. ఆ ఆస్పత్రి వారు పాత రిపోర్ట్‌లు తమకు పనికిరావని కచ్చితంగా కొత్తగా చేయించాలని ఐదారు రకాల పరీక్షలవి రాశారు. ఛాతి భాగంలో నొప్పి ఉందనడంతో 2డీ ఈకో పరీక్షలు చేశారు. సిరిసిల్లలో పరీక్షలకు రూ.3,200 అయితే కరీంనగర్‌లో రూ.11,600 అయ్యాయి. అవసరమున్నా లేకున్నా చేపట్టిన అన్ని పరీక్షలను గమనించిన తరువాత వైద్యుడు అజీర్తి వల్ల నొప్పి అని ఇది సాధారణమేనని తేల్చి చెప్పారు. దీంతో కూలీనాలీ చేసుకునే మహిళ ఖర్చు చూసి బావురుమంది.

**వాటాల దందా..**

నాలుగు జిల్లాల పరిధిలో చిన్నా, పెద్దవి కలిపి 183 రోగ నిర్ధారణ కేంద్రాలున్నాయి. చాలావరకు రక్త పరీక్షలు, చిన్నపాటి స్కానింగ్, ఎక్స్‌రేలను ఆయా ఆస్పత్రులకు అనుబంధంగా ఏర్పాటు చేసుకున్నారు. ఇక సీటీ స్కానింగ్, ఎంఆర్ఐ, ఇతరత్రా వాటికి పలు కేంద్రాలకు రోగులను పంపిస్తున్నారు. ఇలా రోజువారీగా బాధితులను పంపినందుకు తమకు వచ్చిన ఫీజులో 30–40 శాతాన్ని వైద్యుడికి చెల్లిస్తున్నారు. నాడీ పట్టే ప్రతి రోగికి కచ్చితంగా అన్నిరకాల రక్త, మూత్ర పరీక్షలు విధిగా రాస్తున్నారు. ఏ మాత్రం నొప్పి ఉన్నా ఎక్స్‌రే రెండు, మూడు కోణాల్లో తీయిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రికి ఏ చిన్న బాధతో వెళ్లినా కనీసం రూ.3 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. రోజువారీగా నిర్ధారణ కేంద్రాల సిబ్బంది వైద్యులకు వాటాలను సాయంత్రానికల్లా ముట్టజెప్పుతున్నారు. కేసులను పంపించేందుకు కొన్ని కేంద్రాల వాళ్లు మార్కెటింగ్ సిబ్బందిని నియమించుకోవడం గమనార్హం.

**ఇలా ఇబ్బందికరం..**

ఏడాదిన్నర కిందట తనిఖీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాలను అనుమతి లేవని గుర్తించారు.

ప్రతి మూడు నెలలకోమారు పరిశీలనలు పక్కాగా చేస్తే వీటి సంఖ్య మరింతగా పెరగనుంది.

స్కానింగ్ పరికరాల అనుమతి లేనందున కరీంనగర్‌లో ఐదారు కేంద్రాలకు నోటీసులు జారీ చేశారు.

రక్త పరీక్షల్లో ఒక్కో చోట ఒక్కో ఫలితం వస్తున్నాయి. గతంలో వీటిపై కొందరు ఫిర్యాదులందించారు.

ఇప్పటికీ అన్ని రకాల అనుమతులు లేకుండా నడుస్తున్నవి దాదాపుగా 10–15 శాతం వరకున్నాయి.

# ఖాళీ స్థలాలు.. వ్యాధులకు కారకాలు

గోదావరిఖని : నగరంలోని వివిధ కాలనీల్లోని ఖాళీ ప్రదేశాలు(ప్లాట్లు) వ్యాధులకు కారకాలుగా మారుతున్నాయి. వర్షాకాలంలో ఆయా ప్రదేశాల్లో వరద, మురుగునీరు నిలవడం, దోమలు, పందులకు ఆవాసంగా మారడం, పరిసరాల్లో నివసించేవారికి దుర్గంధంతో పాటు వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఖాళీ ప్రదేశాల్లో వరద, మురుగునీరు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రంగా ఉంచాలని.. లేకపోతే నగరపాలిక ఆధ్వర్యంలో శుభ్రం చేయించి జరిమానా విధిస్తామని పేర్కొనడంతో కొందరు యజమానులు మాత్రమే స్పందించి ఆయా స్థలాలను శుభ్రం చేయించారు. నగరపాలిక నిబంధనల ప్రకారంగా జరిమానాలు విధించేందుకు రంగం సిద్ధం చేసినప్పటికీ వివిధ కారణాలతో ఆచరణకు నోచుకోలేదు.

నగరంలోని కాకతీయనగర్, మార్కండేయకాలనీ, శాంతినగర్, శ్రీనగర్ కాలనీ, ఇందిరానగర్, శివనగర్, రాజ్యలక్ష్మీ తదితర కాలనీల్లో ఖాళీ ప్రదేశాల్లో మురుగు, వరద, చెత్తాచెదారం సమస్య తీవ్రంగా ఉంది. నివాసాల మధ్య ఖాళీ ప్లాట్లలో మురుగునీరు నిలుస్తుండటంతో దానికి ఇరువైపులా ఇళ్లలోని వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బహుళ అంతస్తుల భవనాలున్న కాలనీల్లోనే సమస్య తీవ్రంగా ఉంది. స్థలం ఖాళీగా ఉండటంతో సమీపంలోని వారు చెత్తను అందులోనే



పడేస్తుండటంతో కొన్ని కాలనీల్లో ఖాళీ ప్రదేశాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించి నోటీసులు జారీ చేస్తామని గతంలో నగరపాలక అధికారులు పేర్కొన్నా ఆచరణకు నోచుకోవడం లేదు. స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న స్థలాల్లోనూ మురుగు, చెత్త సమస్య లేకుండా శ్రద్ధ వహిస్తే అధిక శాతం సమస్య పరిష్కారం కానుంది. అధిక రేటు వస్తే విక్రయిద్దామని, వీలున్నప్పుడు ఇల్లు కట్టుకుంటామని ప్లాట్ల యజమానులు నిశ్చింతంగా ఉండగా, వాటి పక్కన ఇళ్లు కట్టుకొని నివసించే వారు రోగాల బారిన పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నగరపాలక అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి యుద్ధ ప్రాతిపదికన ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన మురుగు, వరద, చెత్త సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.

# కాసులు ముడితేనే.. కొలతలు



సిరిసిల్ల : జిల్లా రెవెన్యూ, భూసర్వే విభాగంలో అవినీతికి అడ్డూఅదుపులేకుండా పోతోంది. కూలీ నాలీచేసి కూడబెట్టుకున్న సొమ్ముతో భూమి కొనుగోలు చేసిన చిన్న రైతులు.. లక్షల రూపాయల వ్యాపారం చేసే రియల్టర్ల నుంచి మామూళ్లు ముట్టనిదే సర్వేయర్లు కొలతలు తీసి, హద్దులు చూపడం లేదు. జిల్లాలో రెండేళ్లలో అవినీతి నిరోధకశాఖ (అనిశా)కు నలుగురు సర్వేయర్లు పట్టుబడ్డారు. మే 31న ఎల్లారెడ్డిపేట సర్వేయర్ నాగరాజు సర్వే నివేదిక ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్ చేసి పట్టుబడ్డారు. అయిదు నెలలు గడవకుండానే సిరిసిల్ల సర్వేయర్లు అనిశాకు చిక్కడం గమనార్హం.

**ఇదీ సంగతి**జిల్లాలో భూమి సరిహద్దులు నిర్ణయించాలని మీసేవ కేంద్రాల్లో ఏప్రిల్ వరకు 12,583 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 6,489 రైతుల భూములు కొలిచి హద్దులు చూపారు. భూభారతిలో కొత్త సాఫ్ట్‌వేర్ రాకతో ఏప్రిల్ నుంచి సర్వే ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పటికే జిల్లాలో సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. దీని ప్రభావం మరింతగా చూపనుంది.

రెవెన్యూ సర్వేల్యాండ్ రికార్డులోని టీపన్ (కొలతల పుస్తకం) ఆధారంగా భూ కొలతలు చేపట్టాలి. ప్రస్తుతం సర్వేయర్లు గూగుల్ మ్యాప్‌తో, యాప్‌ల ద్వారా హద్దులు నిర్ణయిస్తున్నారు. వీటిలో స్పష్టత లేక తరచూ భూ వివాదాలు నెలకొంటున్నాయి. పరిష్కరించడంలో సిబ్బంది అలసత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. సిరిసిల్ల పట్టణంలో చంద్రంపేట, రగుడులో ఇటీవల ఇలాంటి సర్వేతో ఇరువర్గాల మధ్య గొడవలకు దారితీసింది. ప్రభుత్వం రెవెన్యూ శాఖలో తీసుకొచ్చిన భూభారతిలో సర్వేయర్ల పాత్రను కీలకం చేసింది. కొత్తసర్వేయర్ల నియామకం, శిక్షణకు ప్రాధాన్యం ఇస్తోంది.

జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లలో 15 మంది సర్వేయర్లు ఉండాలి. ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల సర్వేయర్లు అనిశాకు చిక్కడంతో సిరిసిల్ల డివిజన్‌లో ఒక్కరు మాత్రమే మిగిలారు. వేములవాడ రెవెన్యూ కార్యాలయంలో సర్వేయరు సత్యనారాయణ రియల్టర్ నుంచి నాలా మార్పిడి కోసం డబ్బులు తీసుకుంటుండగా పట్టుబడ్డారు. వేములవాడ డివిజన్‌లో ప్రస్తుతం నలుగురు సర్వేయర్లు ఉన్నారు.

జిల్లా భూ సర్వే విభాగం ఏడీగా రెండ్రోజుల క్రితం వరకు జగిత్యాల ఏడికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అతను పదోన్నతిపై హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ప్రస్తుతం మంచిర్యాల ఏడీ శ్రీనివాస్‌కు సిరిసిల్ల అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ లేక, క్షేత్రస్థాయిలో రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని సర్వేయర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

# కొలువులకు మార్గం


సిరిసిల్ల : జిల్లాలో డిగ్రీలు, ఆపై చదువులు పూర్తిచేసిన యువత చాలా మంది ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. వీరిలో కొందరు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడాలనే ఆకాంక్ష ఉంటే.. మరికొందరు ప్రైవేటు సంస్థల్లోనైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. ఎందులోనూ పూర్తిస్థాయి ఉద్యోగావకాశాలు లభించకపోవచ్చు. అందుకే జిల్లాలోని ఉపాధికల్పన కార్యాలయానికి అనుబంధంగా మోడల్ కెరీర్ సెంటర్ (ఎంసీసీ)ని ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టరేట్లో 2,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో సుమారు రూ.30 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

**అవకాశాలను మెరుగుపర్చేందుకు..**

దేశంలోని ప్రైవేటు సంస్థలతోపాటు విదేశాల్లోనూ విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయి. జిల్లా ఉపాధికల్పనశాఖ కార్యాలయంలో తొమ్మిది వేల మంది నిరుద్యోగులు తమ వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి నెలకు సగటున 30 మంది నిరుద్యోగులు తమకు ఉద్యోగాలు కల్పించాలని దరఖాస్తులతో వస్తున్నారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగులకు దిశానిర్దేశం చేయాల్సిన ప్రభుత్వ వ్యవస్థ (ఉపాధి కల్పన కార్యాలయం) స్థితిగతులు, పనితీరు, లక్ష్యాలను మెరుగుపరిచేందుకు మోడల్ కెరీర్ కేంద్రం ప్రారంభించనుంది.

ఎంసీసీలో ఉద్యోగ సమాచారం, నిరుద్యోగులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వటంతోపాటు ప్రతినెలా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తారు. వాటన్నింటికి అవసరమైన సమాచారం ఎంసీసీలో అందుబాటులో ఉంటుంది. ఉద్యోగమేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఆయా సంస్థల్లో అనుసరించాల్సిన తీరు. బృంద చర్చలు, ఆన్‌లైన్ ముఖాముఖిలో పాటించాల్సిన మెలకువలను ఈ కేంద్రంలో తర్ఫీదు ఇస్తారు.

విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే యువతకు తెలంగాణ విదేశీ మానవ వనరుల సంస్థ (టామ్‌కామ్) జిల్లాల వారీగా ఉద్యోగ మేళాలను నిర్వహిస్తోంది. గల్ఫ్ దేశాలతోపాటు జపాన్, యూరప్, మిడిల్‌ఈస్ట్ దేశాలు, ఇంగ్లాండ్, కెనడా, జర్మనీ ఆస్ట్రేలియాతో కలిపి 20 దేశాల్లో ఈ సంస్థ విస్తరించింది. నర్సింగ్, హోటళ్లు, నిర్మాణరంగం, డ్రైవింగ్,



కేర్‌టేకర్లు వంటి 15 రకాల విభాగాల్లో అవకాశాలు కల్పిస్తుంది. ఆయా దేశాల నిబంధనల ప్రకారం భాషలు, అందుకు అవసరమైన నైపుణ్యాలను నేర్పిస్తారు. ఆయా మేళాలు నిర్వహణ సమయంలో ఎంసీసీలో ప్రత్యేకంగా నిపుణులకు నియమించి శిక్షణనిస్తారు. విదేశీ ఉద్యోగాలకు వెళ్లాలనుకునే జిల్లా యువతకు ఇది మంచి అవకాశం.

**అందుబాటులోకి తీసుకొస్తాం**


జిల్లాలో త్వరలోనే ఎంసీసీ అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రతినెలా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నాం. వాటిలోని ప్రైవేటు కార్పొరేట్ సంస్థల్లో తొలుత తక్కువ వేతనాలు ఉంటాయి. హైదరాబాద్ లాంటి నగరాల్లో తక్కువ వేతనాలకు చేయలేమని మధ్యలోనే మానేసి వస్తున్నారు. మరికొందరు ప్రైవేటు సంస్థల్లోనూ క్రమక్రమంగా ఉన్నతస్థాయికి చేరినవారు ఉన్నారు. ఎంసీసీలో ఉద్యోగాల స్థితిగతులు.. కంపెనీలపై అవగాహన కలిగించడటం.. ఈ కేంద్రంలో ఇంటర్‌నెట్తో కూడిన కంప్యూటర్లు, ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులకు అనుమానాలు నివృత్తి చేసేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారు. రాఘవేందర్, జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి

# అత్యవసర సేవ.. కమీషన్ల తోవ

నల్గొండ: అర్ధరాత్రి పాముకాటు వేస్తేనో.. క్షణికావేశాని కిలోనై పురుగుమందు తాగిన కేసులుంటేనో..రోడ్డు ప్రమాదాలు.. తీవ్రమైన కడుపునొప్పితో బాధపడే రోగులు ప్రభుత్వ ఆసుపత్రిలోని అత్యవసర వైద్యవిభాగానికి హడావుడిగా వస్తుంటారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రిటికల్ కేర్, వైద్యులను ప్రభుత్వం ఏర్పాటు చేసినా..ఇలాంటి కేసులను వైద్యులు 'చూసీచూడనట్లు' వదిలేసి వెంటనే హైదరాబాద్, జిల్లాలోని ప్రముఖ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రికో తీసుకెళ్లాలని చేతులెత్తేస్తున్నారు. వెంటనే బాధితుల బంధువుల ఆందోళనలు, అవసరాన్ని చూసి అక్కడున్న ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు రంగప్రవేశం చేస్తారు. మీరు వాహనంలో ఎక్కండి.. నాకు తెలిసిన మంచి ఆసుపత్రి ఉందంటూ 'కమీషన్' ఇచ్చే వైద్యుడి వద్దకు తీసుకెళ్తారు. ఇలా రోజూ రెండు మూడు కేసులను తమకు తెలిసిన ఆసుపత్రులకు తీసుకెళ్లడం.. రోగుల నుంచి ముక్కుపిండి వసూలు చేయడం పరిపాటిగా మారాయి.

నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాసుపత్రులకు ఎదురుగానే ఒక్కో ఆస్పత్రి వద్ద గరిష్ఠంగా 15 వరకు ప్రైవేట్ అంబులెన్స్‌లు తిష్ఠవేస్తున్నాయి. ఆపదతో వచ్చే రోగుల అత్యవసరాలను ఆసరా చేసుకుని ప్రైవేట్ ఆస్పత్రులు ఇచ్చే కమీషన్ల కక్కుర్తితో ఇలా నిలువుదోపిడీకి పాల్పడుతున్నారు.

మూడు జిల్లాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రెండేసి చొప్పున ప్రభుత్వ అంబులెన్స్‌లు ఉన్నా.. ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ డ్రైవర్లను ఏర్పాటు చేసుకుంది. వారికి నెలకు సరిపడా వేతనాలు, డీజిల్‌కు డబ్బులు ఇవ్వడం లేదు. పైగా ఈరెండు వాహనాలు పాతవి కావడంతో తరచూ



మరమ్మతులకు గురవుతున్నాయి.

కొన్నిచోట్ల ప్రభుత్వ అంబులెన్స్ డ్రైవర్లను భయభ్రాంతులకు గురిచేసో, మభ్యపెట్టో తమ వాహనంలోకి రోగులను ఎక్కించుకుని తమకు కమీషన్ ఇచ్చే ఆసుపత్రికి తీసుకెళ్లి అప్పటికప్పుడే డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాసుపత్రుల ఎదుట నిలిపి ఉంచే ఈ ప్రైవేట్ అంబులెన్స్‌లు నెలకు ఎలాంటి కిరాయిలు చెల్లించడం లేదు. ఎవరైనా ఆటోలు, ఇతర వాహనాల్లో వస్తే వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నల్గొండ జిల్లాసుపత్రిలో రెండు అంబులెన్సులుండగా ఒకటి తరచూ మరమ్మతులకు గురవుతుందని.. మరొకదాన్ని రిఫరల్ సర్వీసులకు ఉపయోగిస్తున్నామని జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకురాలు డా.అరుణ కుమారితో తెలిపారు. తెల్లరేషన్‌కార్డు వారికి ఉచితమని.. మిగతా వారు డబ్బులు చెల్లించాలని పేర్కొన్నారు. గతంలో ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చామని.. ఆర్థిక దోపిడీ చేయవద్దని సూచించామన్నారు. ఎవరైనా వీరి ఆగడాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మరమ్మతులు.. కావాలి రూ.2.18 కోట్లు!



సిరిసిల్ల : జిల్లాలో ఈ ఏడాది కురిసిన వర్షాలకు పంచాయతీ రాజ్ పరిధిలోని రహదారులు పెద్దఎత్తున దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల గండ్లు పడగా, మరికొన్ని చోట్ల వంతెనలు కొట్టుకుపోయి తారులేచి గంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. లోలెవల్ కల్వర్టులపై నుంచి వాగులు పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

**ఇదీ పరిస్థితి..**జిల్లాలో గ్రామీణ రహదారుల పరిధి ఎక్కువ విస్తరించి ఉంది. కొన్ని చోట్ల నిర్మాణ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వాటి మనుగడ ప్రశ్నార్థంగా మారుతోంది. వర్షాలకు రహదారులపై నీరు నిలిచి.. వాహనాల రాకపోకలతో తరచూ దెబ్బతింటున్నాయి. అదే సిమెంటుతో వేసిన రహదారులతో పోలిస్తే తారు రహదారుల జీవితకాలం సగమే. తాత్కాలిక మరమ్మతులు చేసిన రహదారులు ఏడాది తిరగకుండానే పాడవుతుండగా.. మరికొన్ని రెండేళ్లలో దెబ్బతింటున్నాయి. కిలోమీటరు సిమెంటు రహదారికి నిర్మాణానికి రూ.8 కోట్ల వరకు ఖర్చవుతుంది. ఇది సుమారు 25 ఏళ్ల వరకు మన్నికగా ఉంటుంది. అదే తారు రహదారికి రూ.60 లక్షలు ఖర్చవుతుంది. వీటి జీవితకాలం పదేళ్లు మాత్రమే. అయితే అన్ని ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు వేయాలంటే వ్యయంపరంగా అంత తేలికకాదు. కనీసం వరద వచ్చే ప్రాంతాల పరిధిలోలైనా వేస్తే.. కొంత వరకైనా మన్నికగా ఉంటాయి. రహదారుల మరమ్మతుల విషయమై పంచాయతీరాజ్ ఈఈ సుదర్శన్‌తో మాట్లాడగా.. రహదారుల తాత్కాలిక మరమ్మతులకు తాత్కాలిక అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు. వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని.. రాకపోకలకు ఇబ్బందిలేకుండా చూస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 90 ప్రాంతాల్లో 80 కిలోమీటర్లకు పైన రహదారులు, వాగులు, వంకలపై ఉన్న కల్వర్టులు వర్షాలకు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిని తాత్కాలిక మరమ్మతులకు రూ.2.18 కోట్ల నిధులు అవసరం ఉండగా.. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు రూ.108 కోట్లు అవసరమని అంచనా. ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లి వారు సిరిసిల్లకు రావాలంటే ఎల్లారెడ్డిపేట మండలం పదిర మానేరువాగు దాటాలి. ఎగువమానేరు అలుగు పారినన్ని రోజులు వాగు ప్రవహిస్తూనే ఉంటుంది. ఈ గ్రామానికి రాకపోకలకు ఇబ్బందులు తప్పవు. అత్యవసరమైతే అవునూరు, వెంకటాపూర్ మీదుగా పది కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి. ఇక్కడున్న లోలెవల్ వంతెన పంచాయతీరాజ్ పరిధిలో ఉంది. దీనిని మూడేళ్ల క్రితం ఆర్అండ్‌బీకి అప్పగించారు. శాఖలు మారడంతో హైలెవల్ పంపడంలో జాప్యం జరుగుతోంది.

# స్వశక్తికి అక్షర వెలుగులు

మెట్‌పల్లి : గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళల్లో అక్షర వెలుగులు నింపడంతో పాటు చదువు మధ్యలో ఆపేసిన వారికి విద్య అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపట్టాయి. విద్యాశాఖ, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో ఉల్లాస్(అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ సొసైటీ), తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ప్రక్రియ ప్రారంభించారు. ఈ మేరకు జిల్లాలోని స్వశక్తి సంఘాల్లో చదువు రాని, మధ్యలో ఆపేసిన సభ్యులను గుర్తించి ఇప్పటికే యాప్‌లో వివరాలు నమోదు చేశారు. వీరికి చదువు నేర్పి ఆర్థిక డిజిటల్ అక్షరాస్యత, వాణిజ్య నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పిస్తారు.

**41,797 మంది గుర్తింపు**

జిల్లాలో 14 వేలకు పైగా స్వయం సహాయక సంఘాల్లో 1.79 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వీరిలో అక్షరాస్యత పెంపొందించడానికి నడుం బిగించారు.

ఇందులో భాగంగా క్షేత్ర స్థాయిలో నిరక్షరాస్యులైన అతివలను గుర్తించారు. గ్రామాల్లో సర్వే నిర్వహించి జిల్లావ్యాప్తంగా 41,797 మందిని నిరక్షరాస్యులను గుర్తించారు.

వీరికి అక్షరాలు నేర్పడానికి పది మందికి ఒకరు చొప్పున సంఘాల్లోని ఔత్సాహిక మహిళలను వాలంటీర్లుగా ఎంపిక చేశారు.

జిల్లావ్యాప్తంగా 4,151 మంది వాలంటీర్లను గుర్తించి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. మండలాల వారీగా ఉపాధ్యాయులకు, వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. చదువు చెప్పేందుకు అవసరమైన పుస్తకాలు మండలాలకు చేరుకున్నాయి. గ్రామ స్థాయిలో వాలంటీర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. చదువు నేర్చుకున్న తర్వాత వచ్చే ధ్రువీకరణ పత్రంతో మహిళలు తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) ద్వారా పదో తరగతి, ఆపై చదువు పూర్తి చేసే అవకాశం కల్పించారు.

**మధ్యలో ఆపేసిన వారికి సార్వత్రిక విద్య**



ఆర్థిక వెనుకబాటు, కుటుంబ పరిస్థితులతో మధ్యలో చదువు ఆపేసిన మహిళలపైనా దృష్టి సారించారు. తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) ద్వారా వీరికి అవసరమైన విద్య అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. వారిని ఓపెన్ స్కూల్‌లో చేర్పించి చదువుకొనేలా ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో పదో తరగతిలోపు 373 మంది, ఇంటర్మీడియట్‌లోపు 510 మంది మహిళలు చదువు ఆపేసినట్లు గుర్తించారు. వీరు పై చదువులు చదివేలా అవగాహన కల్పించారు. ఉన్నత విద్యతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రోత్సహిస్తూ ఇప్పటివరకు 291 మంది పదో తరగతి, 419 మంది ఇంటర్‌లో చేరేందుకు ప్రవేశ రుసుం చెల్లించారు. స్వశక్తి సంఘాల సభ్యుల్లో పూర్తి స్థాయిలో అక్షరాస్యులైన సభ్యులే ఉండేలా చూస్తూ వారికి భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పెంచడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# చేను బురదైంది.. కోతకు కష్టమొచ్చింది


భైంసా: జిల్లాలో సోయా రైతులకు కష్టమొచ్చింది. మొన్నటివరకు వరదలతో లోతట్టు, నదీ పరీవాహక ప్రాంతాల్లో పంటలు మునిగిపోయాయి. కాత దశలో సోయా మురిగిపోయింది. ఇతర ప్రాంతాల్లో సురక్షితంగా ఉన్న పంట చేతికొచ్చే సమయంలో వరుసగా కురుస్తున్న వర్షాలకు చేలల్లో నీరు నిలవడంతో కోత కోసే వీలు లేకుండా పోయింది. హార్వేస్టర్లు చేలలో నడిచే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో కోతకొచ్చిన సోయా పంట కాతలో మొలకలు వస్తున్నాయి. ఆరుగాలం శ్రమ వర్షార్పణం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

నష్టాలు ఎలా పూడ్చాలని కన్నీటి పర్యంతమవుతున్నారు.

**అధికారి ఏమంటున్నారంటే..**

గజిల్లాలో కోతలకు సరిపోయే హార్వేస్టర్లు ప్రైవేటులో అందుబాటులో ఉన్నాయని డీఏఓ అంజిప్రసాద్ అన్నారు. రైతులు చేలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు.

జిల్లాలో 1.10 లక్షల ఎకరాల విస్తీర్ణంతో సోయా పంట సాగు చేస్తుండగా, అత్యధిక విస్తీర్ణంలో ముథోల్ నియోజకవర్గంలో 80 వేల ఎకరాల్లో, సారంగాపూర్, లక్ష్మణచాంద, మామడ, సోన్, నర్సాపూర్ మండలాల్లో సాగవుతోంది. ఈ లెక్కన ఇక్కడి రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఇప్పటికే బాసర, భైంసా, తానూరు, ముథోల్ మండలాల్లో సోయా పంటలు నీట మునిగాయి.



వానలు వెనుకబడిన వెంటనే కోతకొచ్చిన సోయా పంట కోతలు మొదలు చేసేందుకు యంత్రాల కొరత ఉన్నట్లు తెలుస్తోంది. అందుబాటులో ఉన్న టైర్ల యంత్రాలు చేలల్లో దిగబడుతున్నాయి. చైన్ హార్వేస్టర్లు రావడం లేదు. వచ్చినా వాటి అద్దె ధరలు ఎక్కువ ఉన్నట్లు రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు కోత యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. కూలీల కొరత, వ్యయం ఎక్కువ కావడంతో వెనకడుగు వేస్తున్నారు. భూములు ఆరే వరకు వేచిచూస్తున్నారు. పది రోజులుగా పగలు ఎండ, రాత్రి వాన కురుస్తుండటంతో పంట కోతలకు రైతులకు బెంగ పట్టుకుంది.

**మొలకలు వస్తున్నాయి**

బొంతల్‌వాడ్ మారుతి రైతు, నందగాం తానూరు మండలం

ఏడు ఎకరాల్లో సోయా సాగు చేశా. ప్రస్తుతం కోతకు వచ్చింది. వానలకు మూడు ఎకరాల్లోని పంటకు కాయల్లో గింజలకు మొలకలు వస్తున్నాయి. దీంతో పంటకు చేసిన వ్యయం నష్టపోతున్నా. ఎకరాకు 20 వేలకు వరకు ఖర్చయింది. ఎకరాకు 8 నుంచి 10 పది క్వింటాళు దిగుబడి వచ్చేది రాకుండా పోతోంది.

# నిధుల్లేక నిర్వహణ భారం



సారంగాపూర్ : పంచాయతీల్లో రెండేళ్లుగా పాలకవర్గాలు లేక ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. సారంగాపూర్ మండలంలోని ఓ చిన్న పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం, పైపులైన్ల మరమ్మతు, వీధి దీపాలు.. తదితర అవసరాలకు కార్యదర్శి రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు సొంత డబ్బులు వెచ్చించారు. బీర్‌పూర్ మండలంలోని ఓ పంచాయతీ కార్యదర్శి దాదాపు రూ.లక్షకు పైగా పెట్టారు. ఇటీవల ఆయన అనారోగ్యం బారిన పడితే డబ్బులు లేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పాలకవర్గాలు లేక, అవసరాలు తీరేందుకు నిధులు లేక కార్యదర్శులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు.

**కనిపించని ప్రత్యేకాధికారులు**

పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, హరితహారం కోసం పంచాయతీకి ఒకటి చొప్పున ట్రాక్టర్, ట్రాలీతో పాటు ట్యాంకర్, చదును చేసే బ్లేడ్‌లను 2019లో నాటి ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి కొనుగోలు చేసింది.

పల్లెల రూపురేఖలు మార్చాలన్న సంకల్పంతో గ్రామాల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసింది. గ్రామంలో ఇంటింటికీ ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణకు చర్యలు తీసుకుంది.

నిధుల లేమితో వాహనాల నిర్వహణ భారం పెరిగి ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది.

జిల్లాలో మొత్తం 385 పంచాయతీలుండగా 60 గిరిజన తండాలు, చిన్న గ్రామాలకు ఆర్థిక ఇబ్బందులు తీవ్రమయ్యాయి.

ట్రాక్టర్ల రుణం చెల్లించకపోవడంతో పలు పంచాయతీలకు బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేశారు.

డీజిల్‌కు డబ్బులు లేక కొన్నింటిని పక్కన పెట్టేశారు. ఏడాదికిపైగా మూలన పడేయడంతో వాహనాలు తుప్పు పట్టడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

ప్రత్యేకాధికారిని నియమించినా ఎప్పుడూ కనపడటం లేదు. వివిధ శాఖల్లో పని చేస్తున్న వారిని ప్రత్యేకాధికారులుగా నియమించడంతో సొంత శాఖలకే పరిమితమవుతున్నారు.

గ్రామసభ నిర్వహించినపుడు, అత్యవసర సమావేశాలకు మినహా ఎప్పుడూ హాజరు కావడం లేదన్న ఆరోపణలున్నాయి.

బీర్‌పూర్ మండలం కొల్వాయి నుంచి కోమన్‌పల్లిని ప్రత్యేక పంచాయతీగా మార్చారు. చిన్న గ్రామం కావడంతో రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. ట్రాక్టర్ మరమ్మతుకు డబ్బులు లేక మూలనపడేశారు.

సారంగాపూర్ మండలం నాయకపుగూడెం పంచాయతీ పరిధిలో కొనుగోలు చేసిన ట్రాక్టర్‌కు బ్యాంకు రుణం రూ.2 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. ఏడాదిగా పంచాయతీలో డబ్బులు లేకపోవడంతో మరమ్మతులు చేయించలేని పరిస్థితులు. మరోవైపు గ్రామంలో చెత్త సేకరణకు ట్రాక్టరును అద్దెకు తీసుకొని వారానికోసారి తరలిస్తున్నారు.

.. ఇది ఈ రెండు గ్రామాల పరిస్థితే కాదు.. జిల్లాలోని అన్ని చిన్న పంచాయతీలదీ.

# దశాబ్దాలుగా అవే సమస్యలు



జగిత్యాల : జిల్లాలో వానాకాలం వరి కోతలు ప్రారంభం కావడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. కేంద్రాల సంఖ్యలో రాష్ట్రంలోనే రెండో స్థానంలో జిల్లా నిలవనుంది. 2006 నుంచి 37 సీజన్లుగా కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా ఇప్పటికీ పూర్తి స్థాయిలో వసతులు కల్పించక రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**ధాన్యం తడిస్తే నిర్వాహకులదే బాధ్యత**

ఈసారి నాట్లు ముందుగా వేయడంతో కోతలు కూడా ముందే ప్రారంభమయ్యాయి. ఇప్పటికే కల్లాలకు ధాన్యం వస్తున్నందున కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాల్సి ఉంది.

ఐకేపీ, ప్యాక్స్, మెప్మా, రైతు సంఘాల ఆధ్వర్యంలో శాశ్వత సిబ్బందిని నియమించాలి. గత సీజన్లలో పలు చోట్ల వచ్చిన కమీషన్‌ను పక్కదారి పట్టించారనే ఆరోపణలున్నందున పర్యవేక్షణ పకడ్బందీగా నిర్వహించాలి.

ప్యాడీ క్లీనర్లు, తూకం, తేమ యంత్రాలు, గన్నీ సంచులు తదితర సామగ్రిని నిల్వ చేసేందుకు గదులు నిర్మించాలి. కేంద్రాల్లో నీడ, తాగునీరు, విద్యుత్తు వంటి వసతులు కల్పించాలి.

కేంద్రాల్లో ధాన్యం, తూకం వేసిన బస్తాలకు రక్షణ కరవైంది. ప్యాడీ డ్రయ్యర్లను అందుబాటులోకి తెస్తే సేకరణ వేగవంతమవుతుంది.

అన్ని కేంద్రాల్లో మట్టి కల్లాలే ఉండటంతో వర్షాలు కురిసినపుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శాశ్వత స్థలాలున్న కేంద్రాల్లో సిమెంటు గచ్చు నిర్మించాలి.

గతంలో సరఫరా చేసిన టార్పాలిన్లు చిరిగిపోయినందున కొత్తవి ఇవ్వాలి.

ఈసారి కేంద్రాల్లో ధాన్యం తడిస్తే నిర్వాహకులదే పూర్తి బాధ్యత అని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కౌలు రైతుల సాగు భూముల వివరాలను వ్యవసాయ శాఖ ఓపీఎంఎస్ లాగిన్‌లో నమోదు చేసుకోవాలి.

నిర్వాహకులకు కమీషన్‌ను, క్వింటాలుకు రూ.5 చొప్పున హమాలీ ఛార్జీలను విడుదల చేయాలి.

**బోనస్ బకాయిలు రూ.2.50 కోట్లు**

యాసంగి సన్న ధాన్యం బోనస్ ఇప్పటికీ రాలేదు. జిల్లావ్యాప్తంగా దాదాపు రూ.2.50 కోట్లు రావాల్సి ఉంది. కేంద్రాల నుంచి మిల్లులకు పంపించిన ధాన్యంలో తరుగు, తేమ పేరిట కోతలు విధించకుండా చూడాలి. హమాలీ ఛార్జీలు, బస్తాల లోడింగ్ తదితర పేర్లతో రైతుల నుంచి అదనపు వసూళ్లు అరికట్టాలి. సేకరణ వివరాలను వెంటదివెంట ఆన్‌లైన్ చేయకపోవడంతో చెల్లింపులు ఆలస్యమవుతున్నాయి. వ్యవసాయ శాఖ పోర్టల్‌లో రైతుల వివరాలు లేకున్నా ఏఈవో ధ్రువీకరణతో కొనుగోలు చేస్తే జాప్యం నివారించవచ్చు. గన్నీ సంచులు కొత్తగా సమకూర్చి సరిపడా సరఫరా చేయాలి. కేంద్రాల నుంచి బస్తాల తరలింపు బాధ్యతలను మిల్లర్లకే అప్పగించి, వారికే రవాణా ఛార్జీలు చెల్లిస్తే సత్ఫలితాలుంటాయి.

జిల్లాలో వరి సాగు: 3.15 లక్షల ఎకరాలు

దిగుబడి అంచనా: 7.50 నుంచి 8 లక్షల మెట్రిక్ టన్నులు

ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాలు: 421

# తోడేకొద్దీ క్రమాలే..!



కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాల వల్ల నదీగర్భాలు దెబ్బతింటున్నాయి. గోదావరి, కిన్నెరసాని, ముర్రేడు తదితర నదులు, వాగులను కొల్లగొడుతూ ఇసుక మాఫియా విధ్వంసం సృష్టిస్తోంది. ఈ దందా వెనుక అక్రమార్కులే కాదు.. కమీషన్ల మత్తులో కళ్లు మూసుకుంటున్న అధికారులు, ప్రజాప్రతినిధుల హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**భవిష్యత్తులో ఎదురయ్యే నష్టాలు**

పరిమితికి మించి ఇసుక తవ్వటం వల్ల నదీగర్భం లోతు పెరిగి పరీవాహక ప్రాంతాలు కోతకు గురవుతాయి. ఇసుక అనేది నీటిని భూమిలోకి ఇంకించే సహజ వడపోత. ఇసుక లేకపోతే భూగర్భజలాలు పడిపోతాయి.

అక్రమార్కుల కృత్రిమ కొరత వల్ల చౌకగా లభించాల్సిన ఇసుక సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతోంది.

లక్ష్మీదేవిపల్లి మండలంలో ముర్రేడు, పినపాక మండలం ఏడూళ్లబయ్యారం పెద్దవాగు ఉద్ధృతికి పరీవాహక ప్రాంతాల్లోని అనేక ఇళ్లు నీటిపాలైన విషయం విదితమే.

నిబంధనలకు విరుద్ధంగా..ములకలపల్లిమండలం సీతారాంపురం ఎస్సీకాలనీ శివారులోని ముర్రేడు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇక్కడి నుంచి ఇసుకను పాల్వంచ పట్టణానికి తరలించి అధిక ధరలకు అమ్మి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.

పాల్వంచ మండలం తోగ్గూడెం, రంగాపురం, దంతెలబోర ఎస్సీకాలనీ, సంగం నాగారం, పాల్వంచ సమీపంలోని పేటచెరువు గ్రామాల నుంచి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిపోతోంది. ఆయాచోట్ల అంతర్గత రోడ్లు ఛిద్రమవుతున్నాయి.

బూర్గంపాడు మండలం సోంపల్లి, బుడ్డగూడెం, పినపాక పట్టినగర్ ప్రాంతాల్లో యథేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ మండలం గుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లు, నాలుగు ట్రాక్టర్లను అధికారులు ఇటీవల పట్టుకున్నారు.

టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి, పినపాక తదితర మండలాల్లో వాగులు అక్కడక్కడ ఆనవాళ్లు కోల్పోతున్నాయి.

రీచ్‌ల నుంచి ఇసుక రవాణాకు అనుమతులు ఉన్నప్పటికీ.. వాగులు, వంకల నుంచి నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నప్పుడు సంబంధిత అధికారులు చూసీచూడనట్లు ఎందుకు వ్యవహరిస్తున్నారు?

జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా.. నిలువరించే శక్తి అధికారులకు లేకపోవటం వెనుక అసలు కారణమేంటి?వాగుల ఒడ్డున, వంతెనలకు అతి సమీపంలో పంటపొలాల పక్కన జేసీబీలతో తవ్వకాలు జరుగుతున్నా.. వాల్టా చట్టాన్ని అమలుచేయటంలో యంత్రాంగం ఎందుకు విఫలమవుతోంది?

పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో ఇసుక అక్రమ రవాణాను అరికడుతున్నాం. ఇటీవల అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలకు భారీగా జరిమానా విధించాం. ప్రతిరోజూ గస్తీ నిర్వహిస్తున్నాం.

దినేష్‌కుమార్, మైనింగ్ ఏడీ

# గుట్ట'నక్కలు..'!

నల్గొండ: భువనగిరి ఐటీఐ కళాశాల సమీపంలో రామకృష్ణాపురం, బీబీనగర్ కొండమడుగు ప్రాంతాల్లో ఉన్న గుట్టలను యంత్రాలతో తొలచి మట్టిని వెంచర్లకు తరలిస్తున్నారు. ఇటీవలే వర్షాలు కురవడంతో ఎఫ్‌టీఎల్ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వెంచర్లన్నీ జలమయయ్యాయి. నీటిని తొలగించేందుకు మట్టి రాశులు పోయడమే పరిష్కార మార్గంగా భావించి యుద్ధప్రాతిపదికన పొక్లయిన్లు, భారీ డంపర్లు ఏర్పాటు చేసుకుని పని కానిచ్చేస్తున్నారు. స్థానికులు కలెక్టరేట్‌లో ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయమై రెవెన్యూ అధికారులను వివరణ అడిగితే తమ పరిధిలో లేదని, భూగర్భ గనుల శాఖాధికారులతో ప్రస్తావించాలని చెబుతున్నారు. జిల్లా భూగర్భ గనుల శాఖాధికారి రాఘవరెడ్డితో ఇదే విషయాన్ని ప్రస్తావించగా.. తమ వద్ద ఎవరూ ఎలాంటి అనుమతులు తీసుకోలేదని పేర్కొన్నారు. వెంచర్ యజమానులు టిప్పర్లతో వందల ట్రిప్పుల మట్టిని తరలించే అవకాశాలున్నాయని కచ్చితంగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అక్రమ మట్టి తరలింపు విషయంలో మాత్రం ఎవరూ ఎలాంటి అనుమతులు తీసుకోలేదని స్పష్టం చేశారు.



హైదరాబాద్-జనగామ జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మట్టి తరలించే టిప్పర్లు పెద్దఎత్తున వెళుతున్నాయి. వాహన వేగానికి మట్టి బయటకు వచ్చి వాహనదారుల కళ్లలో పడుతోంది.

పెంచికల్‌పహాడ్, రామకృష్ణాపురం పరిసర ప్రాంతాల్లోని కొండల్లో అనుమతుల్లేకుండా కొండలను యంత్రాలతో తవ్వుతూ రాత్రి వేళల్లో లారీల్లో నింపి సమీపంలో ఉన్న వెంచర్లలో డంప్ చేస్తున్నారు.

అక్రమార్కులు ఎలాంటి సీనరేజీ రుసుములు ప్రభుత్వానికి చెల్లించకుండానే యథేచ్ఛగా దందా నిర్వహిస్తున్నా.. అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ఇసుక రాసులు. ఖజానాకు కాసులు!

కొత్తగూడెం : భద్రాద్రి జిల్లాలోని ఇసుక రీచ్‌లు రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయాన్ని సమకూర్చుతున్నాయి. క్వారీల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయటంతో పాటు రీచ్‌ల నిర్వాహకులకు సకాలంలో బిల్లులు చెల్లించటంతో ఈ ఏడాది ఇసుక విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో బిల్లులు చెల్లించక పోవటంతో క్వారీ నిర్వాహకులు అక్రమ రవాణాకు తెరలేపారు. అందుకే రాష్ట్ర ఖజానాకు చేరాల్సిన సొమ్ము అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లింది. గత ఇసుక పాలసీలోని లోపాలను కాంగ్రెస్ సర్కారు గుర్తించి వాటి స్థానంలో నూతన విధానాలకు శ్రీకారం చుట్టింది.

**ఐదు నెలలు.. రూ.123 కోట్లు**

గిరిజన సహకార సంఘాల ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. కేవలం ఐదు నెలల్లోనే ప్రభుత్వానికి రూ.123కోట్ల ఆదాయం సమకూరింది. 2016 నుంచి ఇప్పటివరకు ఒక ఆర్థిక సంవత్సరం (2022-23)లో జిల్లాలో ఇసుక విక్రయాల ద్వారా వచ్చిన గరిష్ఠ ఆదాయం రూ.136కోట్లు మాత్రమే. ఈ ఏడాది దాన్ని అధిగమించటంతో పాటు రూ.200కోట్లకు పైగా ఆదాయం వస్తుందని టీజీఎండీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. రీచ్‌ల అనుమతుల విషయంలో జాప్యం.. ఆదాయంపై ప్రభావం చూపిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా మూడు కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వేందుకు వెసులుబాటు ఉన్నప్పటికీ.. ఇప్పటి వరకు 20లక్షల క్యూబిక్ మీటర్లే తవ్వినట్లు లెక్కలు చెబుతున్నాయి.

**వీటిపై దృష్టి సారించాలి..**



ఇసుక తవ్వకాల ద్వారా రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూరుతున్నా.. ఇసుక లారీల రాకపోకల వల్ల రహదారులు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. ఇప్పటికే భద్రాచలం-చర్ల, మణుగూరు-ఏటూరునాగారం రోడ్లపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. వీటి మరమ్మతులపై దృష్టి సారించటంతో పాటు జిల్లాలో వర్షాకాలం సైతం ఇసుక విక్రయాలు జరిపేలా అనువైన స్థలంలో స్టాక్ పాయింట్ ఏర్పాటుచేయాల్సిన అవసరముంది. గోదావరి పరిసర ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఉండటం వల్ల వాహనాల పార్కింగ్‌కు స్థలం లేక రోడ్లపైనే నిలుపుతున్నారు. దీనివల్ల ఇతర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్టాక్ పాయింట్ ఏర్పాటుచేయటం ద్వారా పార్కింగ్ స్థలం అందుబాటులోకి వస్తుంది. మారుమూల ప్రాంతాల్లోని రోడ్లు దెబ్బతినవు. రీచ్‌ల అనుమతుల విషయంలో జాప్యం జరగడంతో మరికొంత ఆదాయాన్ని కోల్పోయాం. ప్రస్తుతం ఆరు క్వారీల ద్వారా ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లాలో స్టాక్ పాయింట్ ఏర్పాటుచేయాలనే ఆలోచన ఉంది. అది కార్యరూపం దాల్చితే వర్షాకాలం సైతం ఇసుక అమ్మకాలు జరపవచ్చు. రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నాం.

# అధ్వాన రహదారులు.. అధికారులకు కనిపించవా!

సిరిసిల్ల : జిల్లా కేంద్రంగా సిరిసిల్ల పట్టణం రూపుదిద్దుకున్న తర్వాత నివాస గృహాలతో పాటు జనాభా క్రమంగా పెరుగుతోంది. అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు సమకూర్చటం కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.కోట్ల వ్యయంతో అధికారుల పట్టణ నలుమూలల సీసీ రోడ్లు నిర్మించారు. నాణ్యత లోపమో.. నిర్వహణ నిర్లక్ష్యమో తెలియదు గానీ ప్రస్తుతం అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. కొంత కాలానికే ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. జనావాసాలు, కార్మికవాడల్లో వరదనీరు నిలిచి గుంతలు ఏర్పడుతున్నాయి. కంకర తేలి ప్రమాదకరంగా



మారుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మున్సిపల్ అధికారులు కనీసం మరమ్మతులు(ప్యాచ్ వర్క్) చేయటం లేదని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ఎక్కడ చూసిన ధ్వంసమైన రోడ్లే దర్శనమిస్తున్నాయి.

**ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రమాదాలు**

పాత బస్టాండ్ నేతన్న కూడలి నుంచి వెంకంపేట ప్రభుత్వ పాఠశాల వరకు 40 అడుగులు రోడ్డును విస్తరించారు. పాఠశాల సమీపంలో వర్షపు నీరు నిలిచి రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ దారి గుండానే మొదటి బైపాస్ రోడ్డు, అపైరల్ పార్కు, వైద్య కళాశాల, రెండు పడక గదుల సముదాయాలకు వెళ్తారు. దీంతో ఈ రోడ్డుపై రద్దీ అధికంగా ఉంటుంది. వాహనదారులు, బాటసారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. 21వ వార్డు గణేష్‌నగర్‌లో ప్రధాన మురుగు కాలువపైన వేసిన సీసీ రోడ్డు ఇటీవల వర్షాలకు కుంగింది. దీంతో రాత్రి సమయంలో కనిపించకపోవటంతో వాహనదారులు, బాటసారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

# ఖమ్మం దరిన చెక్కు చెదర‘నిధి’..

ఖమ్మం : 129 ఏళ్ల క్రితం ఖమ్మం తీరాన మున్నేరుపై నిర్మించిన వారధి ఏడాది క్రితం కనీవినీ ఎరుగని రీతిలో వచ్చిన భారీ వరద ఉద్ధృతిని తట్టుకుని సగర్వంగా నిలిచింది. అంతక్రితమూ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంది. 1896లో నిజాం నవాబు కాలంలో 200 మీటర్లు పొడవు, 20 అడుగుల వెడల్పుతో ఖమ్మం కాల్వొడ్డులో సున్నం, రాళ్లు ఉపయోగించి మున్నేరుపై వంతెన నిర్మించారు. 2024, ఆగస్టు 31 రాత్రి వరద ఉద్ధృతి పోటెత్తింది. 3.25 లక్షల క్యూసెక్కుల ప్రవాహం దిగువకు వెళ్లింది. 33 అడుగుల ఎత్తులో వాగు ప్రవహించింది. పాత వారధికి రెండు వైపులా కొన్నేళ్ల క్రితం ఏర్పాటైన రెండు సిమెంట్ కాంక్రీట్ వంతెనలు భారీ వరదలకు చిగురుటాకుల్లా వణికిపోయాయి. ప్రకాశ్‌నగర్ వద్ద హైలెవల్ వంతెనైతే స్లాబులు పక్కకు జరిగాయి. కానీ పాత రాతి కట్టడం మాత్రం ప్రవాహ వేగాన్ని తట్టుకుని అబ్బురపరిచింది. పాత వంతెనకు ఇరువైపులా కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ఖమ్మం నగర అభివృద్ధి, విస్తరణలో సజీవ సాక్ష్యంగా నిలిచిన ప్రాచీన వారధిని నవీకరించి చారిత్రక వారసత్వ సంపదగా గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు.

# రోడ్లకు వర్షం దెబ్బ!

కొత్తగూడెం : ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి. ఎడతెరిపి లేని వానలతో కొన్ని మార్గాలు అధ్వానంగా మారాయి. అడుగుకో గతుకు ఉండటంతో వాహనదారులు ఆచీతూచి నడవాల్సిన, వాహనాలను నడపాల్సిన పరిస్థితి. భారీ వర్షాలతో జిల్లా వ్యాప్తంగా 221.58 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసమయ్యాయి. జిల్లా నుంచి ఖమ్మం జిల్లాలోని పలు మండలాలకు అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారులు విపరీతంగా దెబ్బతిన్నాయి.

**తాత్కాలిక మరమ్మతులు...**

డివిజన్‌లో మొత్తం 82.58 కి.మీ. మేర రహదారులు ధ్వంసం అయ్యాయి. ప్రధానంగా బూర్గంపాడు నుంచి ఏటూరు నాగారం వెళ్లే రోడ్డు, బూర్గంపాడు నుంచి మోరంపల్లి బంజర, సారపాక బూర్గంపాడు, భద్రాచలం- చర్ల, అశ్వాపురం రహదారి దెబ్బతిన్నాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ఉండేందుకు అధికారులు డోజర్లతో మట్టి, కంకర పోసి తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. తాత్కాలిక మరమ్మతులకు రూ.2.2 కోట్లు, శాశ్వత



మరమ్మతులకు రూ.59.42 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించినట్లు ఈఈ నాగేశ్వరరావు ‘న్యూస్‌టుడే’కి తెలిపారు.

జిల్లాలో ర.భ. రహదారులు: 1615 కి.మీ.

కొత్తగూడెం డివిజన్: 916 కి.మీ.

భద్రాచలం డివిజన్: 699 కి.మీ.

కొత్తగూడెం డివిజన్‌లో..

డివిజన్ పరిధిలో దాదాపు 139 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. పాల్వంచ పట్టణం నుంచి దమ్మపేట, అశ్వారావుపేట మార్గంలో రహదారి ఇబ్బందికరంగా గోతులు పడ్డాయి.

గండుగులపల్లి, సత్తుపల్లి నుంచి పట్వారిగూడెం రహదారి విపరీతంగా దెబ్బతింది. తక్షణం మరమ్మతులు చేయాల్సి ఉంది.

జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు అంచనాలు రూపొందించి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించామని ర.భ. ఈఈ వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

# నిధులకు గండి.. వివరాలు చూపండి



సిరిసిల్ల : రోగుల వివరాల నమోదులో సమస్యలు ఆస్పత్రులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధులపై ప్రభావం చూపుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవల్లో భాగంగా చికిత్సల పరిధి విస్తరించింది. ఖర్చును కూడా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. దీంతో జిల్లా, వైద్య విధాన పరిషత్తు ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. అందుకు తగినట్లుగా ప్రభుత్వం వైద్యులు, చికిత్సలు, సదుపాయాలు అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. రోగి వివరాల నమోదులో ఆధార్, రేషన్‌కార్డులను జతచేయటం సమస్యగా మారింది. కార్డుల్లో తప్పులు ఉండటం, ఈకేవైసీ తదితర కారణాలతో ఆరోగ్యశ్రీ నిధుల కోసం రోగుల వివరాలు నమోదు కావటం లేదు. జిల్లా, మండల స్థాయిల్లో పాలకవర్గాలు లేక హెచ్‌డీఎస్(హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ) నిధులు గత డిసెంబరు నుంచి నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ నుంచి మాత్రమే విడుదల అవుతున్నాయి.

**ప్రత్యేక శ్రద్ధ అవసరం** జిల్లాలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితోపాటు వైద్య విధాన పరిషత్తు(టీవీవీపీ) పరిధిలో వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట(సీహెచ్‌సీ) సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం కాలానుగుణ వ్యాధుల సీజన్ కావటంతో జిల్లా ఆసుపత్రిలో జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో రోజుకు సగటున 1200 ఓపీ నమోదు అవుతోంది. ఈ లెక్కన నెలకు ఆసుపత్రిలో ఉంటూ చికిత్సలు పొందుతున్న వారు 1500పైనే ఉంటారు. వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో 500 మంది వరకు చికిత్స పొందుతున్నారు. జిల్లా ఆసుపత్రిలో సేవలు పొందుతున్న వారిలో సగానికి పైగా రోగులు ఆధార్, రేషన్‌కార్డులు తీసుకురాకపోవటం.. తెచ్చినా వాటిల్లో తప్పులతో వివరాలు సరిగ్గా నమోదవటం లేదు. ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు వినియోగించుకునేవారి వివరాల నమోదుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే ఇలాంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండదు. గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేటలో పడకల సంఖ్య తక్కువగా ఉండటంతో చికిత్సలు నామమాత్రంగా జరుగుతున్నాయి.

**80 శాతం ఆస్పత్రుల అభివృద్ధికే..**

జిల్లా జనరల్, వేములవాడ ప్రాంతీయ దవాఖానాల్లో రోగులకు పెద్ద ఎత్తున వైద్య సేవలు అందుతున్నాయి. విషజ్వరాలు, డెంగీ, ఇతర శస్త్రచికిత్సలు చేసినవాటికి రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు ఆరోగ్యశ్రీ నుంచి నిధులు వస్తుంటాయి. అందులో 20 శాతం ట్రస్టులో ఉంచుకుని మిగతా 80 శాతం నిధులను ఆసుపత్రుల్లోని హెచ్‌డీఎస్ ఖాతాలో జమ చేస్తారు. వాటిలో 35 శాతం చికిత్సలు అందించిన విభాగాల్లో పనిచేసిన సిబ్బందికి ప్రోత్సాహకంగా అందిస్తారు. మిగతా 65శాతం మందులు, శస్త్రచికిత్సల పరికరాలు, అత్యవసర పనులకు వినియోగించుకునే వీలుంది. జిల్లా జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేక పడకల ఏర్పాటు, ఏసీలు, ఎక్స్‌రే యంత్రాలు, వేములవాడ ఆసుపత్రిలో మోకీలు మార్పిడికి ఉపయోగించే పరికరాలు వంటివి కొనుగోలు చేస్తున్నారు. 2024 డిసెంబరు నుంచి ప్రభుత్వం ఈ నిధుల విడుదలతో జాప్యం చేస్తోంది.

# సగంలోనే.. సాగు సర్వే



నకిరేకల్: పంటల సాగుకు సంబంధించి కచ్చితమైన సమాచారం సేకరించేందుకు ప్రతి సీజన్‌లో ప్రభుత్వం ఆన్‌లైన్ క్రాప్ బుకింగ్‌ను నిర్వహిస్తుంది. వ్యవసాయశాఖ ప్రత్యేక యాప్ ద్వారా రైతు సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ప్రస్తుత వానాకాలం సీజన్ ముగిసే దశకు వస్తుంది. పత్తి, ధాన్యం కొనుగోలు సీజన్ త్వరలో మొదలు కానుంది. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ముందస్తు కసరత్తును జిల్లా అధికారులు పూర్తి చేస్తున్నారు. సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదై ఉంటేనే రైతులు సీసీఐ కేంద్రాల్లో పత్తిని, ధాన్యాన్ని విక్రయించుకునేందుకు వీలుంటుంది. నమోదు లేకుంటే ఆయా కేంద్రాల్లో రైతుల పంటలను కొనేందుకు నిరాకరిస్తారు. ఇంత కీలకమైన పంటల నమోదు సర్వే జిల్లాలో నత్తనడకన సాగుతోంది. కొనుగోలు సీజన్ ముంచుకొస్తున్నా.. సర్వే యాభై శాతానికి కూడా చేరుకోకపోవడం గమనార్హం.

రైతుల పొలాలు సందర్శించి సర్వే నెంబర్ల వారీగా పంటల సాగు వివరాలను క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవోలు) నమోదు చేస్తారు. యూరియా సరఫరా పర్యవేక్షణ, టోకెన్ల జారీ తదితర పనుల్లో ఇంత కాలం ఏఈవోలు బిజీగా ఉండటంతో క్షేత్రస్థాయిలో సాగు సర్వే ముందుకు సాగడం లేదన్న అభిప్రాయాలున్నాయి. వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం ఈ సర్వేను శాటిలైట్ ద్వారానే చేపట్టాలని ముందుగా నిర్ణయించినా.. ఆ తర్వాత మళ్లీ ఏఈవోలకు అప్పగించడంతో ప్రక్రియ ఆలస్యంగా మొదలైందని అధికారులు అంటున్నారు. **వచ్చేనెల 15 నాటికి పూర్తి: పి.శ్రావణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ**

ఆన్‌లైన్ క్రాప్ బుకింగ్ సర్వేను వచ్చేనెల 15 నాటికి పూర్తిచేయాలని ఎంఏవోలు, ఏఈవోలకు ఆదేశాలిచ్చాం. ఇప్పటి వరకు యూరియా పంపిణీపైనే క్షేత్రస్థాయిలోని సిబ్బంది పనిచేయడంతో పంటల సాగు సర్వే కొంత ఆలస్యమైంది. సర్వేలో వేగం పెంచేందుకు రోజువారీ లక్ష్యాలు నిర్ణయిస్తాం.

# ఈత.. కావొద్దు గుండె కోత



మిర్యాలగూడ : సెలవులు వచ్చాయంటే పిల్లల ఆటలకు అంతే ఉండదు. అనేక మంది పిల్లలు, యువత సెలవుల్లో అధికంగా ఈతకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఈత కొట్టడం సరదాగానే ఉన్నప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే జీవితాలు అంధకారమయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కాల్వలు, చెరువులు, నీటి కుంటలు, వ్యవసాయ బావుల వద్ద ఈతకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఆయా ప్రాంతాల్లో ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉమ్మడి జిల్లాలో అనేకం చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో చిట్యాల మండలం ఏపూర్‌లో సెలవు రోజు వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు.

**పాటించాల్సిన జాగ్రత్తలు ఇవీ...**

ఈత వచ్చినా సరే కొత్త ప్రాంతాల్లో లోతు తెలుసుకున్నాకే ఈతకు దిగాలి. అడుగున బురద ఉండే నదులు, చెరువుల్లో జాగ్రత్తగా ఉండాలి. లేకుంటే బురదలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.

పెద్దల పర్యవేక్షణ లేకుండా పిల్లలను చెరువులు, నదులు, కాల్వలు, వ్యవసాయ బావులకు ఈతకు పంపించొద్దు. ఈత వచ్చినా సేఫ్టీ జాకెట్ వంటివి వాడడం ఉత్తమం. అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలి. జలాశయాల వద్ద అక్కడి పరిస్థితిని వివరిస్తూ బోర్డులు ఏర్పాటు చేయడం మంచిది.

**నిండుగా జలాశయాలు..** ఇటీవల కురిసిన వర్షాలు, కాల్వల ద్వారా వస్తున్న నీటితో ఉమ్మడి జిల్లాలోని అన్ని చెరువులు, జలాశయాలు, నదులు, కాల్వలు, వ్యవసాయ బావులు తదితర నీటి వనరులన్నీ జలకళను సంతరించుకున్నాయి. సాగర్ ఎడమ కాల్వలో నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. దీంతో ఈత వచ్చిన వారు సైతం కాల్వలో పడితే బయటకు రావడం గగనమే. ఇటీవల కాల్వలో పడిన అనేక మంది శవాలై తేలారు.

**సాగర్ ఎడమకాల్వలో యువకుడి గల్లంతు**

ప్రమాదవశాత్తు సాగర్ ఎడమ కాల్వలో యువకుడు గల్లంతైన సంఘటన మండల పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. శెట్టిపాలెం గ్రామానికి చెందిన బొల్లెద్దు సతీష్ (32) గ్రామానికి చెందిన నలుగురు బాలురతో కలిసి సోమవారం గ్రామ శివారులోని ఎడమకాల్వలో ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో అందులో ఓ బాలుడు ఈత సరిగా రాక నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా సతీష్ బాలుడిని కాపాడి ఒడ్డుకు చేర్చి ఆయాసానికి గురై నీటి ప్రవాహంలో ఒక్కసారిగా గల్లంతయ్యాడు. పోలీసులకు సమాచారం అందించగా కాల్వ వెంట గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ లభ్యం కాలేదు. సతీష్ తమ్ముడు సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**పర్యవేక్షణ ఉండాలి..: రాజశేఖర్‌రాజు, డీఎస్పీ, మిర్యాలగూడ.**

పిల్లలను సెలవుల్లో చెరువులు, కాల్వలు, కుంటలకు ఈతకు ఎట్టి పరిస్థితుల్లోనూ పంపకూడదు. ఈత కొట్టాలంటే అన్ని అనుమతులు, వసతులు ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే ఈతకు వెళ్లాలి. ఈత కొట్టేటప్పుడు పోటీలు పెట్టుకోవడం, ఈత రాకపోయినా ఎక్కువ లోతుకు వెళ్లడం వంటివి చేయకూడదు.

# లంచం.. దశావతారం

మిర్యాలగూడ : లంచం.. ఈ రెండక్షరాల అవినీతి పదం వినిపించని శాఖ, కార్యాలయం లేదు. ఏ పని కావాలన్నా, ఫైలు ముందుకు కదలాలన్నా..చివరికి విద్యుత్తు మీటరు కావాలన్నా.. ఆమ్యామ్యాలు సమర్పించుకోవాల్సిందే. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా పెరుగుతున్న ఏసీబీ కేసులే ఇందుకు నిదర్శనం. గతేడాది దసరా పండుగ నుంచి ప్రస్తుతం వరకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 మందిపై ఏసీబీ అధికారులు కేసులు నమోదు చేశారు.

**పది శాఖల్లో ఏసీబీ తనిఖీలు...**

గతేడాది దసరా పర్వదినం నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో పది శాఖలపై ఏసీబీ దాడులు చేసింది. వీటిలో పదమూడు ఘటనల్లో 15 మందిని ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకొని కటకటాల్లోకి పంపారు. వీటిలో అత్యధికంగా పోలీస్ శాఖపై మూడుసార్లు దాడులు చేసి ఓ డీఎస్పీ, ఓ సీఐ, ఇద్దరు ఎస్సైలు, ఒక కానిస్టేబుల్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రెవెన్యూ శాఖలో సైతం మూడుసార్లు దాడులు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వాటిలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, ఒక విద్యుత్తు, మిషన్ భగీరథ, పౌర సరఫరాలు, అటవీ, మత్స్యశాఖ అధికారులను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 4న సూర్యాపేట జిల్లాలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఏసీబీ అధికారులు అందులో సమయపాలన, తదితర అంశాలపై ప్రభుత్వానికి నివేదిక పంపగా గతేడాది డిసెంబరు 4న వాడపల్లి అంతరాష్ట్ర సరిహద్దు వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రూ.86,600 నగదు స్వాధీనం



చేసుకున్నారు. ఈ ఏడాది జనవరి, మే, జూన్, ఆగస్టు నెలల్లో రెండు చొప్పున ఏసీబీ కేసులు నమోదు కాగా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, జులై, సెప్టెంబరులో ఒకటి చొప్పున కేసులు నమోదయ్యాయి.

**ఇలా ఫిర్యాదు చేయండి..** ఏ శాఖలోని సిబ్బంది, అధికారులు సేవలు అందించేందుకు డబ్బు డిమాండ్ చేస్తే తక్షణమే ఏసీబీ అధికారులను సంప్రదించవచ్చు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారు. బాధితులు 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించవచ్చు 94404 46106 వాట్సప్ నంబర్‌కు వివరాలు పంపించవచ్చు. సామాజిక మాధ్యమాల్లోని ఏసీబీ పేజీల్లో సైతం ఫిర్యాదు చేయవచ్చు.

# పేట.. ఆయిల్‌పామ్ సాగులో మేటి..

అశ్వారావుపేట: ఆయిల్‌పామ్ తోటల విస్తరణలో దేశంలో తెలంగాణ రాష్ట్రం అగ్రభాగాన కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట వైపు చూస్తోంది. ఐదేళ్లలో ఎన్నడూ లేని రీతిలో రైతులు ఆయిల్‌పామ్ తోటలు వేసేందుకు ముందుకు వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ (ఎన్ఎంఈఓ) పథకంలో భాగంగా దేశంలో వివిధ రాష్ట్రాలకు 2021 నుంచి ఐదేళ్ల కాలానికి 3.22 లక్షల హెక్టార్ల తోటల విస్తరణ లక్ష్యాలు నిర్దేశించారు. తెలంగాణకు 1,24,300 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం నిర్దేశించారు. 78,869 (1,97,172.5 ఎకరాలు) హెక్టార్ల సాగుతో రాష్ట్రం ముందువరుసలో ఉంది. తెలంగాణలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆయిల్‌పామ్ అత్యధికంగా సాగవుతోంది. అందులో 70 శాతం అశ్వారావుపేట నియోజకవర్గంలోని రైతులే ఆయిల్‌పామ్ తోటలు పెంచుతున్నారు.

**ఈ ఏడాది 4,700 ఎకరాల్లో..** ఈ ఏడాది అశ్వారావుపేట నియోజకవర్గంలోనే సుమారు 1,600 మంది రైతులు 4,700 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు వేశారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఆయిల్‌పామ్ గెలలకు రూ.17 వేల నుంచి రూ.21 వేలు ధర పలకటం, ప్రస్తుతం రూ.19,107 ఉండటంతో రైతులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ.. దేశంలో తెలంగాణ ముందుండాలని, తెలంగాణలో ఉమ్మడి ఖమ్మం జిల్లా, అందులో అశ్వారావుపేట ముందుండాలనేదే తన ఆకాంక్ష అని తెలిపారు. ఇదే స్ఫూర్తితో రైతులకు టన్నుకు రూ.25,000 ధర వచ్చేలా కృషి చేస్తున్నట్లు వివరించారు.

# రామాలయం వసతి ధరల తగ్గింపు

భద్రాచలం: ఇది భక్తులకు తీపి కబురు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చి వసతి కోసం ఆశ్రయిస్తే గదుల ధరలు తగ్గించి సత్రాలను కేటాయిస్తున్నారు. ఈ కొత్త విధానం సోమవారం అమల్లోకి వచ్చింది. రోజూ పదుల సంఖ్యలో యాత్రికులు వసతి పొందుతున్నారు. అన్ని రకాలుగా 150 గదులు ఉండగా ఏడాదికి రూ.1.40 కోట్ల ఆదాయం సమకూరుతుంది. శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి, హనుమజ్జయంతి వంటి ఉత్సవాలకు సందడి కనిపించే వాటిలో వసతి విభాగం ముందు వరుసలో ఉంటుంది. సీజన్‌లో నెలకు రూ.10 లక్షలకు పైగా ఆదాయం సమకూరుతుంది.

**సామాన్య భక్తులకు ఊరట**

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడంతో రామాలయంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త నిబంధనల ప్రకారం రూ.1000కి పైగా రోజువారీ అద్దె ఉన్నవాటికే పన్ను వర్తిస్తుంది. ఏసీ లేని 90 గదులకు జీఎస్టీ పూర్తిగా రద్దయ్యింది. ఇవన్నీ రూ.700 లోపు అద్దెవే కావడంతో పన్ను పోటు తప్పింది. ఇంతకు ముందు రూ.672 ఉన్న గది అద్దె ఇప్పుడు రూ.600 అయింది. రూ.448 ఉన్న విభాగం రూ.400లకే లభిస్తుంది. ఏసీ గదులను 5 శాతం జీఎస్టీతో కేటాయిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.1,120కి కేటాయించిన ఏసీ గది ప్రస్తుత ధర రూ.1,050. ఇది సామాన్య భక్తులకు సంతోషం కలిగిస్తుంది.

**నిత్యావసర సరకులపై దృష్టి**

రామాలయంలో వార్షిక ఆదాయం రూ.80కోట్ల మేర ఉండగా సంవత్సరానికి 24లక్షల మంది దర్శించుకుంటున్నారు. అన్నదానంతో పాటు ప్రసాదాల తయారీ ఇతర అవసరాలకు బియ్యం, నూనె, పప్పులు, నెయ్యి, పంచదార వంటివి ఏడాదికి రూ.10 కోట్లకు పైగా కొనుగోలు చేస్తున్నారు. హక్కులు పొందిన వ్యాపారులు వీటిని దేవస్థానానికి సరఫరా చేస్తున్నారు. ఇందులో కొన్నింటికి 12శాతం జీఎస్టీ ఉంది. కొత్త విధానం సరకులకూ వర్తించేలా చొరవ చూపుతే ఆస్థాయిలో ఖర్చులను నియంత్రించి దేవుడి ఆదాయం పెంచవచ్చు.

**ఈఓ కార్యాలయం విస్తరణ**

ఇరుగ్గా ఉన్న తన కార్యాలయాన్ని విస్తరించేందుకు ఈఓ దామోదర్‌రావు చర్యలు చేపట్టారు. దాతలు, భక్తులు, ప్రముఖులు ఈఓను కలిసేందుకు వస్తే కొంతమందికే ఇందులో చోటు దొరికేది. సరిపడా కుర్చీలు ఉండేవి కాదు. మిగతా వాళ్లు ఛాంబర్ వెలుపల వేచి చూడాల్సి వచ్చేది. ఈ సమస్యను ఈఓ గుర్తించి విస్తరణ విధులను ఇంజినీర్లకు కేటాయించారు.

# పార్శిల్ సేవల్లో ఆర్టీసీ వేగం

చిత్తూరు: ఆర్టీసీలోని కార్గో సేవలు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి. పార్శిల్ సేవలను ప్రజలకు చేరువ చేస్తూ అంతకంతకు ఆదాయాన్ని ఆర్జిస్తోంది. లాజిస్టిక్ విభాగంలోనూ పైచేయిగానే నిలుస్తోంది. ఒకేసారి 10 నుంచి 12 టన్నుల సరకును నిర్ణయించిన సమయం లోపు చేరవేస్తూ.. ప్రజల్లో నమ్మకాన్ని సంపాదిస్తోంది. 2017లో ప్రారంభమైన కార్గో సేవలు మొదటి రోజు రూ.10 వేల ఆదాయంతో అడుగులు పెట్టి.. ప్రస్తుతం రోజుకు రూ.1.50 లక్షలు సమకూరుస్తోంది. సింగూ సొల్యూషన్స్ ప్రైవేటు సంస్థ ఏజెన్సీల ద్వారా పార్శిల్ బుకింగ్ సేవలు నిర్వహిస్తూ.. వాటికి కమీషన్ చెల్లిస్తోంది. మున్ముందు పార్శిల్ సేవలతో పాటు డోర్ డెలివరీలను మరింత పెంచే దిశగా ఆర్టీసీ అడుగులు వేస్తోంది.

**నెలకు రూ.42 లక్షల ఆదాయం..**

చిత్తూరు ఒకటి, రెండో డిపో, పలమనేరు, కుప్పం, పుంగనూరు డిపోలతో పాటు వి.కోట బస్టాండులో కూడా పార్శిల్ సేవలు అందుబా



టులో ఉన్నాయి. ఈ డిపోల పరిధిలో రోజుకు కనీసం 650 పార్శిళ్లు బుక్ అవుతుండగా.. వాటి ద్వారా నెలకు రూ.42 లక్షలకు పైగానే ఆదాయం సమకూరుతోంది.

80 ప్రాంతాల్లో..చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు ఆర్టీసీ కార్గో సేవలు అందుతున్నాయి. రాష్ట్రంలోని 80 ప్రాంతాల్లో ఉన్న డిపోలకు 10 కి.మీ దూరం వరకు డోర్ డెలివరీలు ఉంటున్నాయి. జిల్లా నుంచి బంతి, చామంతి, బెల్లం, ప్లాస్టిక్, పన్నీరు, కోవా తదితర సరకులు ఎగుమతి అవుతున్నాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సైతం కార్గో సేవలు అందడం విశేషం.

# శిశువిలాపం

కర్నూలు : నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. వివిధ స్థాయుల్లో వైద్య సేవలందించేందుకు ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఎస్ఎన్సీయూ (స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్)లు ఏర్పాటు చేశారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, సున్నిపెంట, ఆత్మకూరు, వెలుగోడు మండల కేంద్రాల్లోని ఆసుపత్రుల్లో కేంద్రాలు ఉన్నాయి. నవజాత శిశువుల్లో ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే ఈ కేంద్రాల్లో ఉంచి సంరక్షిస్తారు. పుట్టిన పిల్లలు ఏడవకపోవడం, తక్కువ బరువుతో జన్మించడం.. 35 వారాలు నిండకుండా ప్రసవం కావడం, ఫిట్స్ వచ్చే శిశువులు, ఉమ్మనీరు మింగినవారు, శ్వాస సంబంధిత సమస్యలున్న శిశువులకు కేంద్రాల్లో వైద్య సేవలందిస్తారు..

**ప్రైవేటు బిల్లు.. గుండె గుబేలు**

ఎస్ఎన్సీయూ సేవలు అత్యంత ఖరీదైనవి. వివిధ సమస్యలతో బాధపడుతున్న పిల్లలను వార్మర్లపై ఉంచి తల్లి గర్భంలోని వాతావరణం ఉండేలా చేస్తారు. ఒక శిశువును ప్రైవేటుగా ఉంచాలంటే.. ఆస్పత్రి స్థాయిని బట్టి రూ.2 నుంచి 8 వేల వరకు వసూలు చేస్తారు. వైద్య సేవలను బట్టి బిల్లులుంటాయి. మూడు నాలుగు రోజులుంటే.. రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేయాల్సిందే. అప్పుడే పుట్టిన పిల్లల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటంతో ఇన్ఫెక్షన్లు వేగంగా సోకే ప్రమాదం ప్రమాదముంటుంది.

**ఎక్కడ.. ఎలా ఉందంటే..**

ఆదోని ప్రభుత్వ మహిళా, శిశు ఆస్పత్రిలో 2022లో భవ్య ఏజెన్సీ నిర్వహణలో ఎస్ఎన్సీయూ సేవలు పీపీపీ విధానంలో ప్రారంభమయ్యాయి. పది పడకలు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ప్రతి నెలా జనన నమోదు 120-130 వరకు ఉంటుంది. పది పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రెండు కాన్సన్ట్రేటర్లు మరమ్మతులకు గురయ్యారు. ఆక్సిజన్ ప్లాంట్ పనిచేయక నాలుగేళ్లు దాటింది. ఆక్సిజన్ సిలిండర్లు కొనుగోలు చేసి సేవలందిస్తున్నారు. ఇంత పెద్ద కేంద్రం ఏర్పాటుచేసినప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన శిశువులను నెలలో కనీసం 10-15 మందిని కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు.

కర్నూలు జీజీహెచ్‌లో 60 పడకలు ఏర్పాటు చేశారు. ఇందులో 12 వెంటిలేటర్లకు గాను ఆరు మాత్రమే పనిచేస్తున్నాయి. ఎనిమిది మంది వైద్యులు, 25 మంది సిబ్బంది ఉన్నారు. రోజు 30 ఐపీ, నెలకు వెయ్యి మంది వైద్య సేవలు పొందుతున్నారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని కేంద్రాన్ని పబ్లిక్, ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# ఆదాయ గని.. తవ్వేదెవరని!

చీపురుపల్లి: ఉమ్మడి జిల్లాలో సీనరేజ్ వసూలు బాధ్యత 2023లో రెండేళ్ల కాలానికి ఓ కంపెనీతో గత ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. నెలకు రూ.7.14 కోట్లు (జీఎస్టీతో) ఆ సంస్థ చెల్లించేది. ఈ ఏడాది జులై 6తో ఒప్పందం పూర్తవడంతో బాధ్యతల నుంచి తప్పుకొంది.

ఉమ్మడి జిల్లాలో గనులు భూగర్భశాఖ అనుమతితో 153 క్వారీల లీజులు నడుస్తున్నాయి. వీటికి పర్మిట్లు జారీచేసి, సీనరేజ్ వసూలు చేసేందుకు సంస్థ 40 చెక్‌పోస్టులు, 200 మంది సిబ్బందిని వినియోగించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్‌మెటల్, గ్రావెల్ అక్రమంగా తరలుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాస్థాయిలో శాఖ అధికారితో పాటు ఇద్దరు సాంకేతిక సహాయకులు, ఒక ఆర్ఐ పర్యవేక్షించడం కష్టమవుతోంది. దీంతో ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది.

న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్, ఎస్.కోట: గనుల సీనరేజ్ రూపంలో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఉమ్మడి జిల్లాలో గనులకు పర్మిట్లు జారీ నుంచి సీనరేజ్ వసూలు, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన రికవరీ వరకూ ఓ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. ఇందుకు గానూ నెలకు రూ.7 కోట్లు ప్రభుత్వానికి చెల్లించేవారు. సంస్థ కాలపరిమితి ముగియడంతో ఆ బాధ్యత గనుల శాఖ చేతికే వచ్చింది. అరకొర సిబ్బందితో వీటి నిర్వహణ కష్టమవుతోంది. రెండు నెలలుగా పర్యవేక్షణ కొరవడడంతో ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది.

ఏం జరుగుతోంది

ప్రస్తుతం ఒకే పర్మిట్‌తో ఎక్కువసార్లు రవాణా జరుగుతోంది. కొన్నిసార్లు పర్మిట్ లేకుండా తరలిస్తున్నారు.

గతంలో అక్రమ మైనింగ్ జరిగితే ఏజెన్సీ ప్రతినిధుల సమాచారంతో అధికారులు కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు.

శాఖాపరంగా నిర్వహణ.. ప్రస్తుతం శాఖాపరంగా పర్మిట్ల జారీ, సీనరేజ్ వసూలు చేస్తున్నాం. 85 శాతం రోడ్‌మెటల్ ప్రభుత్వ పనులకు వెళ్తోంది. మిగిలినది ప్రైవేటు వారు తీసుకుంటున్నారు. గ్రావెల్‌పై ఎక్కువ దృష్టిసారించాం. గ్రానైట్ తరలింపుపై అనుమతి తప్పనిసరి. సిబ్బంది కొరత ఉంది. ఉన్న మేరకు దృష్టిసారించాం. కె.సూర్యచంద్రరావు, జిల్లా గనులు భూగర్భశాఖాధికారి

# వైద్యఆరోగ్యశాఖ.. పర్యవేక్షణలేక




పుట్టపర్తి: వైద్య ఆరోగ్యశాఖపై జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడంతో మెరుగైన సేవలు అందడం లేదు. కర్ణాటక సరహద్దున ఉండే మండలాల్లోని ఆసుపత్రుల్లో రాత్రివేళల్లో సేవలు అందడం గగనంగా మారింది. దీంతో నగరాలు, పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? అని తనిఖీలు చేయాలి. ఈ ప్రక్రియను తూతూమంత్రంగా చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు వైద్యులు సక్రమంగా విధులు రావడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గోరంట్లలో ఇద్దరు వైద్యులు ఉన్నా.. 104, సచివాలయాలకు వెళ్లి సేవలందిస్తామని చెబుతున్నారు. రామగిరి, పేరూరులో అరొకరగా సేవలతో సరిపెడుతున్నారని గ్రామస్థులు వాపోతున్నారు.

**సిబ్బంది డీఏల్లో కక్కుర్తి**

డీఎంఅండ్‌హెచ్ఓ పరిధిలో కొందరు సిబ్బందికి నెలకు టీఏ రూ.3 వేల వరకు ఇస్తారు. బడ్జెట్ అందుబాటు ఉన్నప్పుడు మూడు లేదా ఆర్నెల్లకోసారి అందిస్తున్నారు. అందులోనూ 10 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయంపై జిల్లా వైద్యాధికారిణి ఫైరోజబేగంను వివరణ కోరగా సిబ్బంది నుంచి తాము కమీషన్లు తీసుకోలేదని తెలిపారు. వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

తనకల్లులోని సామాజిక ఆసుపత్రిలో కొందరు వైద్యులు అందుబాటులో ఉండటం రోగుల సహాయకులు వాపోతున్నారు. ఎక్స్‌రే యంత్రం నిరుపయోగంగా మారి రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మడకశిర ప్రాంతీయ ఆసుపత్రికి గర్భిణులు వెళితే..రిస్క్ ఉందంటూ హిందూపురం పంపిస్తున్నారు. వంద పడకల ఆసుపత్రి అయినా.. ఆ స్థాయిలో సేవలు అందడం లేదు. ఈనెల 4న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఆసుపత్రిని తనిఖీ చేశారు. రాత్రివేళ వైద్యులు వస్తున్నారా? అని రోగులను ప్రశ్నించగా.. రారని సమాధానం వచ్చింది.

జిల్లా ఆసుపత్రి 1
ప్రాంతీయ వైద్యశాలలు: 3
సామాజిక.. : 7
పీహెచ్‌సీలు: 40
వైద్యుల పోస్టులు: 171
పనిచేస్తున్న వారు: 123

# అదిగదిగో ఆర్థిక మండలి



విజయనగరం: పెట్టుబడిదారులను ఆహ్వానించడం.. ఎగుమతులు పెంచడం.. ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం.. లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చకచకా అడుగులు వేస్తోంది. అన్ని రంగాల్లో ప్రగతి పరుగు పెట్టేలా ప్రణాళికలు రచిస్తోంది. ఉత్తరాంధ్రలో వివిధ జిల్లాలతో గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తాజా విశాఖ పర్యటనలో వెల్లడించిన విషయం విదితమే. ఇందులో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చోటు కల్పించి.. దేశ, రాష్ట్ర ఆర్థిక పురోగతికి కీలకంగా మార్చనున్నారు.

విజయనగరం స్థూల దేశీయ జిల్లా ఉత్పత్తి రూ.33,709 కోట్లు. తలసరి ఆదాయం రూ.1,42,262.

పార్వతీపురం మన్యం స్థూల దేశీయ జిల్లా ఉత్పత్తి రూ.33,459 కోట్లు. తలసరి ఆదాయం: రూ.1,41,808.

స్థూల జాతీయ ఉత్పత్తిలో ఏటా 15 శాతం వృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందించారు.

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం సేవా రంగంలో 45 శాతం, వ్యవసాయం, అనుబంధ రంగాల్లో 31 శాతం, పారిశ్రామిక రంగంలో 24 శాతం వృద్ధి నమోదవుతోంది. కొంత ప్రభుత్వం ద్వారా.. మరికొంత పీపీపీ విధానంలో వృద్ధి రేటు పెంచే ప్రయత్నం చేస్తారు.

ఉభయ జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, పర్యాటక, స్థిరాస్తి రంగాల్లో దృష్టిసారిస్తారు. చిరు ధాన్యాలు, ప్రకృతి సేద్యంలో పంటల సాగు విస్తీర్ణం పెంచుతారు.

జాతీయ రహదారి పక్కన భోగాపురం మండలంలో అయిదు వేల ఎకరాల్లో ఐటీ సంస్థలు నెలకొల్పాలని యోచిస్తున్నారు.

ప్రగతి పరుగులు పెట్టేందుకు అనువైన వనరులున్న ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. వీటిని 'గ్రోత్ హబ్'లుగా తీర్చిదిద్దాలని సంకల్పించింది. విశాఖ కేంద్రంగా పార్వతీపురం మన్యం, విజయనగరం సహా ఎనిమిది జిల్లాలను ఇందులో విలీనం చేసింది. నగరాల విస్తరణ, అభివృద్ధి, నీటి సరఫరా, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేసింది. వివిధ రంగాల్లో నిధుల వినియోగాన్ని నీతి ఆయోగ్ పర్యవేక్షిస్తోంది. ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లు రూపొందించిన ప్రణాళికల ముసాయిదాలపై సమీక్షిస్తూ సూచనలు చేస్తోంది. కేంద్ర ఆర్థిక సాయానికి ఈ జిల్లాల అధికార యంత్రాంగం ఎదురు చూస్తోంది.

**విమానాశ్రయంతో ఆర్థిక ప్రగతి**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం మరో ఎనిమిది నెలల్లో పూర్తవుతుంది. గగన కార్యకలాపాల ఆరంభంతో రవాణా, లాజిస్టిక్స్, కార్గో సేవలతో పాటు స్థిరాస్తి, పర్యాటక రంగాలు పురోగతి బాటన పయనించనున్నాయి.

ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలతో పాటు ఉభయ జిల్లాల నుంచి సీతాఫలం, మామిడి, అనాసతో పాటు మామిడితాండ్ర, జీడిపప్పు, చిరుధాన్యాలు వంటి ఆహారోత్పత్తుల ఎగుమతులు ఊపందుకుంటాయి. దిగుమతులూ పెరుగుతాయి.

ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. తయారీ, పారిశ్రామిక రంగాల వృద్ధికి ఇవి దోహదపడతాయి.

మరికొన్ని పరిశ్రమలు నెలకొల్పేందుకు వివిధ సంస్థలు ముందుకొస్తున్నాయి. జీడిపప్పు, చిరుధాన్యాల శుద్ధీకరణ, పామాయిల్ ఉత్పత్తి యూనిట్లు రానున్నాయి.

# వనితా.. లేదిక కలత

విజయనగరం: మహిళలకు రుణాలివ్వడం, వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే కాదు.. సమస్యల పరిష్కారానికి సైతం కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. కుటుంబపరమైన, ఆర్థిక, సామాజిక, మానసిక ఇబ్బందులొస్తే అండగా నిలవనుంది. ఈమేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ జెండర్ రిసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే నెల్లిమర్ల, బొండపల్లి, ఎస్.కోటలో ఏర్పాటయ్యాయి. త్వరలో విజయనగరం, రాజాం, చీపురుపల్లి, సాలూరులో రానున్నాయి.

పొదుపు సభ్యులే.. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నియమితులైన ఓబీ(ఆఫీస్ బేరర్స్)ల ఆధ్వర్యంలో పొదుపు సంఘాల్లో బాగా చదువుకున్న వారిని గుర్తిస్తారు. వీరు రిసోర్స్ పర్సన్లగా వ్యవహరిస్తారు. మిగిలిన సభ్యులు సలహాదారులుగా ఉంటారు. జెండర్ కేంద్రంలో ప్రతి గురువారం అందుబాటులో ఉంటారు. మిగిలిన రోజుల్లో వెలుగు సిబ్బందిని సంప్రదించవచ్చు.

చెప్పుకోవచ్చు.. బృందంలో అయిదుగురు రిసోర్స్‌పర్సన్లు ఉంటారు. ఒకరు ఛైర్‌పర్సన్‌గా.. మరొకరు కార్యదర్శిగా వ్యవహరిస్తారు. ఏదైనా సమస్య ఉంటే సిబ్బంది ద్వారా గానీ, నేరుగానైనా సంప్రదించవచ్చు.

**అందించే సేవలివీ..**

ఉన్నత విద్యను అభ్యసించేలా, ఉద్యోగాలు సాధించేలా బాలికలకు ప్రోత్సాహం
బాల్య వివాహాలను అరికట్టడం
మహిళలకు సమాన పనికి సమాన వేతనం
నాయకత్వ లక్షణాలపై అవగాహన, నిర్ణయాధికారం కల్పించడం
హింసలేని జీవితాన్ని అందించడం
ఆస్తి హక్కు, ఆదాయం పొందేలా చేయడం
పౌష్టికాహారం అందజేత, రక్తహీనత నివారణ
సాంకేతిక విజ్ఞానం, నైపుణ్యాల పెంపు
వేధింపులకు అడ్డుకట్ట

# అత్యాధునికంగా ఆపద్బాంధవి

పార్వతీపురం: ప్రాణాపాయంలో ఉన్నవారికి సంజీవనిలా అండగా నిలుస్తున్నాయి 108 వాహనాలు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వహణ లేకపోవడంతో చాలావరకు మూలకు చేరాయి. సేవలు సైతం అంతంత మాత్రంగానే ఉండేవి. కూటమి రాకతో తీర్చిదిద్దుతోంది. ఆకర్షణీయమైన రంగులు వేయిస్తోంది. లోపల అత్యాధునిక పరికరాలు, సౌకర్యాలు కల్పిస్తోంది. మన్యం జిల్లాలో 17 వాహనాలు ఉండగా విడతల వారీగా ఒక్కోదానికీ మరమ్మతులు చేయించారు. ఇప్పటి వరకు 14 వరకు సిద్ధమయ్యాయి. వీటితో పాటు స్థానికంగా మరో రెండు అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్(ఏఎల్ఎస్)వాహనాలున్నాయి. వాటిలో వెంటిలేటర్ సౌకర్యం కూడా ఉంది. గిరిజన ప్రాంతాల్లో ఇవి ఎక్కువ తిరుగుతున్నాయి.

ప్రత్యేకతలివీ..ఆపద సమయంలో ఇద్దరు రోగులకు ఆక్సిజన్ అందించవచ్చు

అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు వాహనాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి మానిటర్, వెంటిలేటర్ సదుపాయాన్ని మెరుగు పర్చారు

రక్తపోటు ఎక్కువగా ఉండే వారి కోసం తల, కాళ్లను ఎత్తులో ఉంచేందుకు కొలాప్స్ బుల్ స్ట్రచర్లున్నాయి

లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మంగళగిరిలోని కాల్‌సెంటర్ అధికారులు వాటి ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు

అత్యవసర ఇంజెక్షన్లు, ఏఈడీ పరికరాలు, మందులు ఉంటాయి.

సేవలు మెరుగు..

'108 వాహనాల్లో అత్యాధునిక పరికరాలున్నాయి. జిల్లాకు చెందిన అన్నింటినీ ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నాం. సేవలను సైతం మెరుగుపర్చాం. మన్యంతో పాటు గిరిశిఖర ప్రాంతాలకు సకాలంలో పంపిస్తున్నాం.' అని ఆ విభాగం జిల్లా ప్రబంధకుడు మన్మథనాయుడు తెలిపారు.

# మూడున్నరేళ్ల యాతన

చీపురుపల్లి: విజయనగరం-పాలకొండ ప్రధాన రహదారిలో చీపురుపల్లిలోని జి.అగ్రహారం వద్ద ఆర్వోబీ నిర్మాణం ప్రారంభించి దాదాపు 30 నెలలు గడుస్తున్నా.. నేటికీ పనులు పూర్తికాలేదు. వంతెన అందుబాటులోకి రాకపోవడంతో విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఒడిశా ప్రయాణికులకు అవస్థలు తప్పడంలేదు. ఆర్వోబీ శిథిలావస్థకు చేరుకోవడంతో దాదాపు మూడున్నర ఏళ్ల కిందట భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. రాజాం, పాలకొండ, ఒడిశా వైపు నుంచి చీపురుపల్లి మీదుగా విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, రాజమహేంద్రవరం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ ప్రాంతాలకు రాకపోకలు సాగించాల్సిన ఆర్టీసీ బస్సులతో పాటు లారీలు, ఇతర రవాణా వాహనాలన్నీ నిలిపేశారు. ప్రస్తుతం కొన్ని చిలకపాలెం మీదుగా.. కొన్ని గరివిడి, గర్భాం మీదుగా వెళ్తున్నాయి.

**ఇదే అసలు సమస్య**

కొత్తగా వంతెన నిర్మాణానికి 2022 ఆగస్టు 16న కేంద్ర రైల్వే బోర్డు రూ.12.97 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణాలను 2023 మార్చిలో ప్రారంభించారు. చీపురుపల్లి వైపు కాంక్రీటు గోడ నిర్మిస్తే కొత్తఅగ్రహారం, రిక్షాకాలనీకి వెళ్లేందుకు రోడ్డు సదుపాయం కోల్పోతామంటూ స్థానికులు పలుమార్లు పనులు అడ్డుకున్నారు.

ర.భ.శాఖ అధికారులు సర్వీసు రహదారి నిర్మాణానికి అడ్డంగా ఉన్న



దుకాణాలను కొంతవరకు తొలగించి 12 అడుగుల స్థలాన్ని సిద్ధం చేయించారు.

**ఆర్టీసీకి రూ.37.80 కోట్లు నష్టం**

పాలకొండ డిపో నుంచి చీపురుపల్లి మీదుగా విజయనగరం, విశాఖపట్నం, ఇతర ప్రాంతాలకు రోజూ దాదాపు 49 బస్సులు తిరిగేవి. ఇప్పుడు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి కావడంతో కేవలం 20 మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి.

వంతెన మీదుగా భారీ వాహనాల రాకపోకలను నిషేధించిన నాటి నుంచి నేటి వరకు పాలకొండ డిపోకు రూ.37.80 కోట్లు నష్టం(రోజుకు రూ.3 లక్షలు) వాటిల్లినట్లు డిపో అధికారులు చెబుతున్నారు. పాలకొండ నుంచి విజయనగరం మధ్య రాజాం, చీపురుపల్లి, గరివిడి, నెల్లిమర్ల వంటి పట్టణాలు ఉన్నాయి. ప్రయాణికులు భారీగా రాకపోకలు సాగిస్తుంటారు. పెద్ద ఎత్తున పరిశ్రమలు ఉన్నాయి. ముడిసరకు రవాణాకు ఇక్కట్లు తప్పడం లేదని వాపోతున్నారు.

**చర్యలు చేపడతాం..**

సర్వీసు రోడ్డు సమస్యతో వంతెనకు సంబంధించిన 40 మీటర్ల కాంక్రీటు గోడ నిర్మాణం ఆగిపోయింది. ఇది పరిష్కారమైతే 20 రోజుల్లో వంతెనను అందుబాటులోకి తెస్తామని గుత్తేదారు ప్రతినిధులు చెబుతున్నారు. విషయం ర.భ.శాఖ ఏఈ కె.మురళీబాబు వద్ద ప్రస్తావించగా.. సర్వీసు రహదారికి అడిగిన 12 అడుగుల స్థలాన్ని సేకరించి ఇచ్చామని, స్థానికులు సరిపోదంటున్నారన్నారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

# గొంతు దిగని గంగ...

## 'కొనలేక బెంగ'

సంతనూతలపాడు : ఒంగోలు నగరానికి కూతవేటు దూరంలోనున్న సంతనూతలపాడుకు గతంలో ఏర్పాటుచేసిన నీటి పథకం నిర్వహణ గాడి తప్పింది. నిధులిచ్చినా మరమ్మతులు లేవు. ఫలితంగా ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడంలేదు.

**ఫిల్టర్ బెడ్లు పూర్తిగా నిరుపయోగం**

చిన్న చెరువులో 10 ఏళ్ల క్రితం మంచినీటి పథకాన్ని ఏర్పాటుచేశారు. పెరుగుతున్న గ్రామ జనాభాకు తగినట్లుగా గ్రామంలోని పెద్ద చెరువు వద్దనున్న బోర్లతో పాటు ఈ పథకం నుంచి సైతం తాగు నీటిని అందించేలా నిర్మించారు. తొలి నాళ్లలో బాగానే నడిచింది. రోజులు గడిచే కొద్దీ నిర్వహణ కొరవడింది. దీంతో మైక్రో ఫిల్టర్ బెడ్‌లు పూర్తిగా నిరుపయోగంగా మారాయి. అప్పటి నుంచి గ్రామంలో రంగు మారిన నీరే సరఫరా అవుతోంది. సుమారు 10వేలకు పైగా జనాభా ఉన్న ఈ గ్రామంలో సగానికి ఈ పథకం నుంచే తాగు నీటిని అందిస్తుంటారు. కానీ స్వచ్ఛమైన నీరు సరఫరా కాకపోవడంతో కేవలం వాడుకకు మాత్రమే వినియోగించాల్సి వస్తోంది.

**బావి నుంచి తెచ్చుకుంటున్నారు**

తాగేందుకు బహిరంగ మార్కెట్లో బబుల్స్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొనుగోలు చేయలేని వారు పెద్ద చెరువు వద్దనున్న మంచినీటి బావి నుంచి తెచ్చుకుంటున్నారు. ఏళ్లు గడుస్తున్నా పథకానికి మరమ్మతులు చేపట్టడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మరో వైపు దీని నిర్వహణ భారం మోయలేక



పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 'మీది..మీది' అంటూ మొండి చెయ్యి చూపారు.

**రూ.20 లక్షల నిధుల కేటాయింపు**

మంచినీటి పథకాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు జడ్పీ నుంచి రూ.20లక్షల వరకు నిధులు కేటాయించారు. పథకాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కేటాయించి టెండర్లు పిలిచి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని యోచించారు. ఇందుకు తగ్గట్టుగా నిధులు కేటాయించినా ఇంకా టెండర్లు మాత్రం పిలవలేదు. టెండర్లు పిలిచి మైక్రో ఫిల్టర్ బెడ్‌లను అందుబాటులోకి తీసుకువస్తే గ్రామంలో స్వచ్ఛమైన తాగు నీరు సరఫరా అవుతుంది.

# కూరగాయల రసం.. ఆరోగ్యం.. ఆదాయం

కదిరి : కాలానికి అనుగుణంగా జీవన విధానమూ మారుతోంది. ఆధునిక ప్రపంచంలో ప్రజలకు శ్రమ తగ్గింది. ఆహార అలవాట్లు మారాయి. ఫలితంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం వ్యాయామం, నడక దినచర్యగా పాటిస్తున్నారు. ఈక్రమంలో పోషకాహారానికి ప్రాధాన్యమి స్తున్నారు. దీన్ని అవకాశంగా చేసుకుని అందిపుచ్చుకున్నారు ఎమ్మెస్సీ (వృక్ష శాస్త్రం) బాటనీ చదివిన యువకుడు ప్రభాకర్‌నాయుడు. వినూత్న ఆలోచనతో కదిరిలో కూరగాయల రసాల వ్యాపారానికి శ్రీకారం చుట్టారు. మైదానాల్లో వ్యాయామం, నడక పూర్తి చేసుకుని ఇంటికెళ్లే వారికి అవసరమైన జ్యూస్‌ను విక్రయిస్తూ...ఆదాయం పొందుతున్నారు.

**ఉదయం 5 గంటలకే..**

కదిరిలో నిత్యం పలు కూరగాయల నుంచి రసం తీసి విక్రయిస్తున్నారు. ఉదయం 5 గంటలకే అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకుని పది గంటల వరకు పని చేస్తున్నారు. ప్రధానంగా మైదానాల నుంచి తిరిగొచ్చే వారికి అనువుగా మొబైల్ వాహనం ద్వారా వ్యాపారం సాగిస్తున్నారు. క్యారెట్, కీర, సొరకాయ, బీట్‌రూట్, కాకర, కొత్తిమీర,



పుదీన, కరివేపాకు... ఇలా 15 రకాల జ్యూస్‌లు అందుబాటులో ఉంచుతున్నారు. వాటి వల్ల కలిగే ప్రయోజనాలపైన అవగాహన కల్పిస్తున్నారు. దీంతో వినియోగదారులకు అవసరమైన రసం ఎంపిక చేసుకోవడం సులువు అవుతోంది. తద్వారా రోజుకు సుమారు రూ.3 వేలు సంపాదిస్తున్నారు.'మాది వ్యవసాయ కుటుంబం. చదువుకున్న అందరికీ ఉద్యోగమే అంటే సాధ్యం కాదు. అందుకే అవకాశం, అనుభవం ఉన్న వాటితో ఉపాధి మార్గంగా ఎంచుకున్నాను. కొద్దిపాటి శ్రమ, జనం అభిరుచికి తగినట్లు రసాల అమ్మకంతో ఆదాయం పొందుతున్నా'.. అని ప్రభాకర్‌నాయుడు చెబుతున్నారు.

# ఏ మాత్రం వినరా!.. సొంత వైద్యంతో ఇబ్బందులు

భీమవరం : నీ తణుకు, రేలంగికి చెందిన లక్ష్మమ్మ కీళ్ల నొప్పులతో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంది. అక్కడ ఇచ్చిన మాత్రలను నెలరోజుల పాటు వాడింది. ఆ తర్వాత వైద్యుడిని సంప్రదించకుండానే అవే ఔషధాలను ఉపయోగించడంతో నోట్లో పుండ్లు పడ్డాయి. మితిమీరిన మందుల వాడకం వల్లే ఈ పరిస్థితి ఎదురైందని వైద్యులు తేల్చారు. ఉరుకులు పరుగుల జీవితం.. మారుతున్న జీవన శైలిలో వ్యాధులు నీడలా వెంటాడుతున్నాయి. వైద్యుడి సూచనలు, సలహాలు లేకుండా సామాజిక మాధ్యమాల్లో వెతికి ఆయా మందులను అవసరం ఉన్నా... లేకున్నా విచ్చలవిడిగా వాడేస్తున్నారు. చిన్నపాటి దగ్గు, జ్వరం వచ్చినా, దీర్ఘకాలిక వ్యాధులతో పాటు నొప్పి నివారణ (పెయిన్ కిల్లర్స్) మాత్రల వినియోగంతో ఔషధాల విక్రయాలు ఈ ఏడాది గణనీయంగా పెరిగినట్లు ఫార్మసీ వర్గాలు చెబుతున్నాయి.

మొగల్తూరుకు చెందిన ఏడుకొండలు తరచూ అనారోగ్యంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యాంటిబయోటిక్స్ వాడేవారు. మితిమీరిన ఔషధాల వినియోగంతో కాలక్రమంలో కిడ్నీలు రెండూ దెబ్బతిని భీమవరంలో డయాలసిస్ చేయించుకుంటున్నారు.

జిల్లాలో రక్తపోటు, మధుమేహం, గుండె, మూత్రపిండాల జబ్బులు, క్యాన్సర్ వ్యాధులతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అవి కాకుండా నొప్పి నివారణ, గ్యాస్ సమస్యలు తగ్గించే మాత్రల వినియోగం పెరిగినట్లు కొందరు దుకాణదారులు చెబుతున్నారు. గత ఎన్‌సీడీ 3.0 సర్వేలో 43,542 మంది రక్తపోటు అనుమానితులుండగా 20.86 శాతం, మధుమేహంలో 53,281 అనుమానితులకు గాను 19.08 శాతం కేసులు నిర్ధారణకు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా రిటైల్, హోల్‌సేల్ మెడికల్ దుకాణాలు సుమారు 2 వేలు ఉండగా, సీజనల్ వ్యాధులు ప్రబలే ఆగస్టు, సెప్టెంబరుల్లో గతేడాది రోజుకు రూ.3 కోట్లు నుంచి రూ.3.50 కోట్ల వరకు ఔషధాల విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది రూ.4 కోట్లకు పైనే జరిగాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కొన్ని ఔషధాలు నిర్ణీత కాలం మేరకే వాడాలి. లేదంటే దుష్ప్రభావాలు ఎదురవుతాయి. ప్రతి గ్రామంలోనూ వైద్యులు అందుబాటులో ఉన్నారు. వారి సలహా మేరకు మాత్రలు వేసుకోవాలని డీఎంహెచ్‌వో గీతాబాయి సూచించారు.

జిల్లాలో మందుల దుకాణాలు - 2 వేలు

గతేడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో విక్రయాలు రూ.3 కోట్ల నుంచి రూ. 3.50 కోట్లు

ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరులో విక్రయాలు - రూ.4 కోట్లుపైనే

# కూలిపోయే ఇళ్లకు.. ఖర్చెందుకు!

నెల్లూరు: 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పేరుతో వైకాపా ప్రభుత్వంలో జరిగిన దోపిడీ అంతా ఇంతా కాదు. నాడు ప్రభుత్వం ఇచ్చే రూ. 1.80 లక్షలకు అదనంగా ఖర్చు పెట్టుకోలేని పేదల బలహీనతను ఆసరాగా చేసుకుని.. ఆ బాధ్యతను వైకాపా నాయకులకు కట్టబెట్టగా- ముందు గుత్తేదారులుగా, తర్వాత లేబర్ ఏజెన్సీలుగా పేరు మార్చుకుని కనీస నాణ్యత పాటించకుండా దోచుకున్నారు. దాంతో లబ్ధిదారులకు అప్పగించక ముందే ఆ నిర్మాణాలు పగుళ్లు ఇచ్చాయి. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలను తేల్చినా.. బాధ్యులపై చర్యలు తీసుకోకుండా.. తిరిగి అదే గుత్తేదారులతో పూర్తి చేయించాలని నిర్ణయించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

ఇళ్లా.. ఇసుక గూళ్లా!

నెల్లూరు అర్బన్, రూరల్, కావలి, బుచ్చిరెడ్డిపాళెం, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో పరిమితికి మించి ఇసుక కలిపిన సిమెంట్ మిశ్రమాన్ని వినియోగించారు. పునాది గోతులు తీయలేదు. పలుచోట్ల కాంక్రీట్ పిల్లర్లపై నేలమట్టంలోనే బీమ్‌లు పోయగా.. వాటిపై కట్టిన గోడలు చిన్న తాకిడికే బీటలు వారుతున్నాయి. ఫ్లయాష్ బ్రిక్స్‌తో కడుతున్న గోడలు అధ్వానంగా ఉండగా.. బ్రిక్స్ మధ్య కదిలిస్తేనే సిమెంట్ మిశ్రమం రాలిపోతోంది. ఇదే రీతిలో గోడలు నిర్మించి స్లాబ్ వేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. గృహ నిర్మాణశాఖలోని కొందరు అధికారులు ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే సొమ్ములో వాటా తీసుకోవడమూ.. నాణ్యత విస్మరణకు మరో కారణమన్న ఆరోపణలు ఉన్నాయి.

# పైరు ఎదిగి.. రంగు మారి!



బొమ్మనహాళ్ : వరి పంటకు తెగుళ్లు ఆశించడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా హెచ్చెల్సీ ఆయకట్టు, వ్యవసాయ బోర్లు, చెరువుల కింద సాగైంది. ముఖ్యంగా బీపీటీ సోనా-5204, ఆర్ఎన్ఆర్, 1010 రకాలను రైతులు సాగు చేశారు. నాట్లు, ఎరువులు తదితర ఖర్చుల కింద ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలకుపైగా పెట్టుబడి పెట్టారు. పైరు ఎదిగి పొట్ట దశకు చేరుకుంటున్న తరుణంలో తెగుళ్లు ఆశిస్తున్నాయి. రంగు మారి తెల్లకంకులు ఎక్కువ కావడంతో ఈ ప్రభావం దిగుబడులపై పడుతుందని రైతులు వాపోతున్నారు.

పంటను కాపాడుకొనే యత్నంలో పురుగుమందులు పిచికారీ చేస్తున్నారు. పలువురు వ్యాపారులు నాసిరకం మందులను అధిక ధరలకు రైతులకు అంటగడుతున్నారు. చాలా మంది అవగాహన లేక కొనుగోలు చేసి... మోతాదుకు మించి పిచికారీ చేసి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఒకదఫా మందు పిచికారీకి రూ.2,500 వ్యయం అవుతున్నట్లు వాపోతున్నారు.

**జిల్లాలో ఇలా..**

సాగైంది: 1.50 లక్షల ఎకరాలు

ఏం ఆశించాయి: దోమపోటు, కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు, ఎండాకు తెగులు

ఎక్కువగా ఎక్కడంటే: కణేకల్లు, బొమ్మనహాళ్, విడపనకల్లు, డి.హీరేహాళ్, గార్లదిన్నె, పామిడి, గుమ్మగట్ట, కళ్యాణదుర్గం, కూడేరు మండలాలు

పరిశీలించి.. సూచనలు చేస్తాం

– జగదీశ్, ఏవో, కణేకల్లు

వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి వరి పైరును పరిశీలిస్తాం. తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తాం. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన మందులు సూచిస్తాం. యూరియా వాడకం తగ్గించి, మడులు ఆరబెట్టి.. నీటిని వదిలితే చీడపీడల వ్యాప్తి కొంతవరకు తగ్గుతుంది. మోతాదుకు మించి పురుగు మందులు పిచికారీ చేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదు.

**పిచికారీ చేసినా ఫలితం లేదు- సంజీవ, రైతు, లింగదహాళ్**

ఐదు ఎకరాల్లో బీపీటీ సోనా సాగు చేశా. పొట్ట దశలో దోమపోటు ఆశించింది. నివారణకు మార్కెట్లో దొరికిన పురుగు మందులు తెచ్చి పిచికారీ చేశాను. అయినా తెగుళ్లు తగ్గుముఖం పట్టడం లేదు. ఏమి చేయాలో దిక్కు తోచడం లేదు.

# వాహనాల డీజిల్ మాయ



రాయదుర్గం : పురపాలక సంఘాల్లో చెత్త తరలింపు, నీటి ట్యాంకర్ల వాహనాలకు డీజిల్‌కు ఖర్చు చేస్తున్న నిధులు రూ.లక్షల్లో పక్కదారి పడుతున్నాయి. క్షేత్రస్థాయిలో డీజిల్ వినియోగం.. దస్త్రాల ద్వారా సొమ్ము చెల్లింపులకు పొంతన కుదరటం లేదు. వాహనాల సంఖ్య తక్కువగా ఉన్నా.. వందలాది లీటర్ల డీజిల్ వినియోగిస్తున్నట్లు నమోదు చేస్తుండటం గమనార్హం. గతంలో అధికారులు, పాలకుల సహకారంతో డీజిల్ ఖర్చు దస్త్రాల్లో ఎక్కువగా చూపించి.. మిగులును జేబుల్లో వేసుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**రెట్టింపు ఖర్చు..** కళ్యాణదుర్గం పురపాలక సంఘంలో రెండు ట్రాక్టర్లు, ఒక పెద్ద ట్రక్కుకు డీజిల్ బిల్లులు 2020లో రూ.9.35 లక్షలు, 2021లో రూ.13.23 లక్షలు ఖర్చు చేయగా.. 2023-24లో అవే వాహనాలకు రూ.26.33 లక్షలు సుమారు రెట్టింపు స్థాయిలో ఉండటం గమనార్హం. ఇందులో సుమారు రూ.13 లక్షలకుపైగా నిధులు పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది.

**వాహనాలు తగ్గినా..**

రాయదుర్గం పురపాలిక పరిధిలో నాలుగు ట్రాక్టర్లు, నాలుగు ఆటోలు, ఒక ట్రక్కు, రెండు నీటి ట్యాంకర్లు, అప్పుడప్పుడు వినియోగించే ఫాగింగ్ యంత్రాలున్నాయి. వాటికి 2022-23లో రూ.25.06 లక్షలు, 2023-24లో రూ.23.69 లక్షలు, 2024-25లో రూ.25.57 లక్షల మేర డీజిల్‌కు ఖర్చు చూపారు. గతంలో రెండు ట్రక్కులు ఉన్నప్పుడు తక్కువ డీజిల్ వినియోగం కాగా.. ప్రస్తుతం ఒకే ట్రక్కు ఉండగా ఎక్కువ వినియోగం అవుతున్నట్లు చూపడం గమనార్హం. గతంలో పనిచేసిన ఓ అధికారి వాహనానికి నెలకు రూ.50 వేలకు పైగా డీజిల్ ఖర్చు చూపారు. ఏటా జరిగే ఆడిట్‌లోనూ డీజిల్ బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలు గుర్తించినా పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి.**ప్రత్యేక నిఘా పెడతాం-దివాకర్‌రెడ్డి, వంశీకృష్ణభార్గవ, కమిషనర్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం**

గతంలో జరిగిన అక్రమాలు మా దృష్టికి రాలేదు. డీజిల్ వినియోగంపై నిఘా ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటాం. ఎక్కడ వృథా అవుతుందో గుర్తించి పొదుపునకు ప్రయత్నిస్తాం.

# ప్రైవేటు పాఠశాలల వైపే మొగ్గు



లేపాక్షి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు ఏటా గణనీయంగా తగ్గుతున్నాయి. అన్ని విద్యార్హతలు ఉన్న ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నా.. గ్రామీణ ప్రాంతంలో ప్రైవేటు పాఠశాలల పట్ల ఆకర్షితులవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేటుకు దీటుగా అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ఉపకార వేతనాలు, మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అందిస్తోంది. గ్రామాల్లో తల్లిదండ్రులు ఎక్కువగా ప్రైవేటు పాఠశాలల పట్ల ఆకర్షితులవడంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేరికలు ఏటా తగ్గుతున్నట్లు గణాంకాల ద్వారా వెల్లడవుతోంది. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు ప్రభుత్వాలు తల్లికి వందనం అందించడం కూడా ఒక కారణంగా పలువురు విశ్లేషిస్తున్నారు.

**27 మూసివేత..** తాజా గణాంకాల ప్రకారం ఏకోపాధ్యాయ పాఠశాలలు అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 2,012 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో ఏకోపాధ్యాయ పాఠశాలలు 733 ఉన్నాయి. విద్యా హక్కు చట్టం మేరకు ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. విద్యార్థుల సంఖ్య పెరిగితే మరొక ఉపాధ్యాయుడ్ని కేటాయిస్తారు. జిల్లా విద్యాశాఖ గణాంకాల ప్రకారం 20 లోపు విద్యార్థులున్న పాఠశాలలు 733, పది మందిలోపు ఉన్న పాఠశాలలు 222 ఉన్నాయి. గోరంట్ల మండలంలో అత్యధికంగా 45, కదిరి 41, అమడుగూరు 36, ఓడిసిలో 36 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. మండల కేంద్రాల్లో ఏకోపాధ్యాయ పాఠశాల ఉపాధ్యాయుడు సెలవుపై వెళితే మండల విద్యాధికారులు సీఆర్ఎంపీ (క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్)తో పాఠశాలను నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. 2024-25 సంవత్సరంలో గ్రామీణ ప్రాంతంలో 40 ప్రాథమిక పాఠశాలలు, ఈవిద్యా సంవత్సరం 27 పాఠశాలలు మూతపడ్డాయి. విద్యార్థుల చేరికలు ఏటా తగ్గుతుండడంపై డీఈవో కిష్టప్పను వివరణ కోరగా ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యా వ్యవస్థ, పాఠశాల నిర్వహణ విధానంలో కొన్ని వినూత్న మార్పులు తీసుకొచ్చింది. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమై మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నామన్నారు.

జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలు : 733

ఈ ఏడాది మూతబడినవి : 27

పదిలోపు విద్యార్థులున్నవి : 222

# ఇష్టకామేశ్వరి దర్శనం సామాన్యులకు గగనం

శ్రీశైలం : క్షేత్రానికి వచ్చే భక్తులు దట్టమైన నల్లమల అడవిలో కొలువైన ఇష్టకామేశ్వరి అమ్మవారిని దర్శించుకునేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు. 2021 నుంచి అటవీ శాఖ ఆధ్వర్యంలో 'జంగిల్ రైడ్' పేరుతో జీపులు ఏర్పాటుచేసి భక్తులను ఆలయానికి తీసుకెళు‌న్నారు. ఇష్టకామేశ్వరి ఆలయం ప్రకాశం జిల్లా పరిధిలో ఉండడంతో మార్కాపురం డీఎఫ్‌వో ఆధ్వర్యంలో టికెట్ల విక్రయాలు జరుగుతున్నాయి. టికెట్లు పొందడం భక్తులకు సవాలుగా మారింది. అక్టోబరు ఒకటో తేదీ నుంచి దర్శనాలు పునఃప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారానికి అటవీశాఖ అధికారులు చొరవ తీసుకోవాలని భక్తజనం విన్నవిస్తోంది.

**వెబ్‌సైట్‌లో నామమాత్రంగా**

శ్రీశైలానికి 8 కిలోమీటర్ల దూరంలోని శిఖరేశ్వరం వద్ద అటవీశాఖ కౌంటరు ద్వారా ఇష్టకామేశ్వరి జంగిల్ రైడ్ టికెట్లను ఉదయం 9 నుంచి 11 గంటల వరకు టికెట్లు విక్రయిస్తుంటారు.

కరెంటు బుకింగ్ ద్వారా 120 టికెట్లను (ఒక్కొక్కటి రూ.1,000) విక్రయిస్తుంటారు. అటవీ శాఖకు చెందిన %nstr.co.in% వెబ్‌సైట్ ద్వారా 16 టికెట్లను నామమాత్రంగా అమ్ముతున్నారు. టికెట్ల కోసం వారాంతంలో భక్తులు అర్ధరాత్రి వేళలో శిఖరేశ్వరం కౌంటరు వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి.

120 టికెట్ల విక్రయాలు పూర్తైన తర్వాత మార్కాపురం డీఎఫ్‌వో అనుమతి పేరుతో రూ.1,500 టికెట్లను విక్రయిస్తున్నారు. ఫలితంగా ఒక్కో భక్తుడిపై రూ.500 చొప్పున అదనపు భారం పడుతోంది.



సిఫార్సులు ఉన్నవారికే ఈ టికెట్లు ఇస్తుండటంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఇష్టానుసారంగా అటవీ శాఖ**

అటవీశాఖ వెబ్‌సైట్‌లోనే మొత్తం టికెట్లు అప్‌లోడ్ చేస్తే భక్తులు వ్యయప్రయాసలకు గురికాకుండా ఉంటారు. కొన్ని నెలల కిందట ఇష్టకామేశ్వరి జంగిల్ రైడ్ టికెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఉన్నతాధికారులు చిరు ఉద్యోగులపై చర్యలు తీసుకొని చేతులు దులిపేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలయ దర్శన టికెట్లు, సినిమా టికెట్లు, కొన్ని ధ్రువపత్రాలను వాట్సప్ ద్వారా అమ్మకాలకు శ్రీకారం చుట్టింది. ఇష్టకామేశ్వరి అమ్మవారి టికెట్లను వాట్సప్ ద్వారా పొందే సౌకర్యం కల్పించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శ్రీశైలంలోని దేవస్థానం టోల్‌గేటు సమీపంలోనే అటవీశాఖ అతిథిగృహం ఉంది. సున్నిపెంటలో ఎఫ్‌డీ కార్యాలయం తొలగించిన తర్వాత అక్కడ ఉన్న భవనాన్ని నెక్కంటి బీట్ ఉద్యోగులకు కేటాయించారు. అతి దగ్గరలో ఉన్న ఈ భవనాల్లో ఇష్టకామేశ్వరి జంగిల్ రైడ్ టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీశైలం, సున్నిపెంటల్లోని ప్రదేశాల్లో టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేయడం ద్వారా భక్తులకు దూరాభారం తగ్గుతుంది.

# ఉన్నతాశయం.. ఉదాసీనం

నెల్లూరు : ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణకు భవనాలు అవసరం. చాలాచోట్ల అసంపూర్తిగా ఉండగా.. అందుకు భిన్నంగా పూర్తయినా ప్రారంభం కాలేదు. కొన్నిచోట్ల ప్రారంభించినా వినియోగంలోకి తీసుకురాలేదు. ఉన్నతాధికారులు స్పందిస్తే.. ఉపయోగంలోకి వచ్చే అవకాశం ఉంది.నెల్లూరు నగరం ఏసీ సుబ్బారెడ్డి వైద్య కళాశాల విద్యార్థుల విద్యాభ్యాసంలో భాగంగా గ్రామీణ ప్రాంత వైద్యసేవలపై అవగాహన, శిక్షణ పొందేందుకు సంగంలో రూ.1.27 కోట్లతో



ప్రభుత్వం శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసింది. 2019 ఆగస్టులో ప్రారంభించినా ఇప్పటివరకు తలుపులు తెరవక శిక్షణ జరగడంలేదు. రూ.40 లక్షలతో అదనంగా కల్పించిన విద్యార్థుల వసతి సదుపాయాలు, రూ.లక్షల విలువైన వైద్యపరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి.

**నిర్మించారు.. మరిచారు**

కావలి ప్రభుత్వ ఆసుపత్రిలో నాడు- నేడు నిధులు రూ.55 కోట్లు ఖర్చు చేసి నూతన భవన సముదాయం నిర్మించారు. అందులో కొన్ని గదులనే వినియోగిస్తున్నారు. మిగిలినవి పైఅంతస్తులో ఖాళీగానే ఉన్నాయి. ప్రధానంగా డయాలసిస్, సీటీ స్కాన్, ఎమ్మారై, ఓపీలకు గదులు వినియోగించాల్సి ఉండగా.. తాళాలు వేసి ఉంచారు. పలు సదుపాయాలు సమకూరక ఉపయోగించడం లేదంటున్నారు.

**ఏకైక డిజిటల్ గ్రంథాలయం..**

జిల్లాలో మొదటి విడతగా 237 సచివాలయాల పరిధిలో డిజిటల్ గ్రంథాలయ భవనాలను నిర్మించి వాటిల్లో అంతర్జాలం, కంప్యూటర్ వంటి సాంకేతిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం భావించింది. గుత్తేదారులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో చాలాచోట్ల భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. వింజమూరు మండలం గుండెమడకలలోనే రూ.27 లక్షలతో చేపట్టిన డిజిటల్ గ్రంథాలయ భవనం పూర్తయింది. అందులో ఎలాంటి సదుపాయాలు కల్పించక ప్రారంభానికి నోచుకోలేదు.

**వైద్య సేవలు ఎప్పుడో?**

నెల్లూరు నగరంలో ప్రజారోగ్య, పురపాలక సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో 2021లో రూ.3.82 కోట్లతో గోషా ఆసుపత్రి నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఇప్పటి వరకు 95శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనుల పూర్తికి జాప్యం జరుగుతోంది. కొద్దిపాటి పనులు పూర్తయితే ఆసుపత్రి భవనం సేవలు అందిస్తుంది. ఇక్కడ 30 నుంచి 50 బెడ్‌ల వరకు ఏర్పాటు చేయవచ్చు. వైద్యులను నియమించి.. అధునాతన వైద్య పరికరాలు సమకూర్చాల్సి ఉంది.

# కొబ్బరి అ'ధర'హో..


సోంపేట : ఉద్దానం కొబ్బరి కాయకు ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ధర పెరిగింది. కొంతకాలం నుంచి నిలకడగా ఉన్న ధర దసరా, దీపావళి పండగల నేపథ్యంలో మార్పు వచ్చింది. కవిటి ఉద్దానం తోటలకు సంబంధించి వెయ్యి కాయలు రూ.32 వేలకు పైగా, మందస కాయలు రూ.26 వేల వరకు పలుకుతున్నాయి. దీంతో రైతుల్లోనూ ఆనందం కనిపిస్తోంది.
కవిటి ఉద్దానం కొబ్బరికాయ నాణ్యత, సైజు, ఇతర అంశాల పరంగా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. దీంతో కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల పరిధిలో కొబ్బరికాయలకు డిమాండ్ ఉంటుంది. మందస ఉద్దానం పరంగా కాయ సైజు, నాణ్యత మూలంగా కొంతమేర ధర తక్కువ ఉంటుంది. దీంతో సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో ధర తక్కువగా ఉంటుంది.
గతంలో కొబ్బరి లావాదేవీలు కంచిలి కేంద్రంగా జరిగేవి. ఇక్కడి వ్యాపారులు ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేయడంతో అక్కడి పండగలు, ఉత్సవాల సందర్భంలో ధర పెరిగేది తప్ప మిగిలిన రోజుల్లో సాధారణంగా ఉండేది.
తిత్లీ తుపాను తర్వాత పరిస్థితిలో మార్పు చోటు చేసుకోవడంతో ఉద్దానం కొబ్బరిసీమలో కొత్త పరిణామాలు నెలకొన్నాయి. రైతుల వద్దకు వ్యాపారులే నేరుగా వెళ్లి కొబ్బరి కొనుగోలు చేసే పరిస్థితి నెలకొనడంతో మంచి ధర అందుకోగలుగుతున్నారు. గతంతో రైతుకు మార్కెట్ ధరలో



సగం మాత్రమే చేరేది. ప్రస్తుతం 80 శాతం వరకు అందుతోంది.
ఇటీవల కురిసిన వర్షాలకు తెల్లదోమ ఉధృతి తగ్గడమే కాక చెట్లలో కాయలు కనిపిస్తున్నాయి. యాజమాన్య పద్ధతులు పాటించే తోటల్లో రెండు నెలలకోసారి దిగుబడులొస్తే గతంలో ఎకరాకు 250 వరకు కాయ వచ్చేది. ప్రస్తుతం కవిటి ఉద్దానంలో ఎకరాకు 400 కాయ వరకు దిగుబడి వస్తోంది. మందస ఉద్దానంలో గతంలో 160 కాయ దిగుబడి రాగా ప్రస్తుతం 250 కాయ వరకు చేతికందుతోంది.
'చీడపీడల నివారణకు ప్రభుత్వ పరంగా సాయం అందితే పరిస్థితి మరింతగా మెరుగుపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒడిశా లావాదేవీలు పెరగడంతో కాయ ధర రూ.32 వరకు పెరిగింది. ఇదే పరిస్థితి కొనసాగితే నాణ్యత గల కాయ రూ.35 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి తోటలపై శ్రద్ధ పెంచితే ఆశాజనక పరిస్థితులు కనిపిస్తున్నాయి' అని కొబ్బరి ఉత్పత్తిదారుల సంఘం మేనేజింగ్ డైరెక్టర్ ఎ.శివాజీ అన్నారు.
**ఒడిశా వ్యాపారుల కీలకపాత్ర..**
జిల్లాలో కొబ్బరి లావాదేవీల్లో ధరల మార్పులకు ఒడిశా వ్యాపారులు ప్రధానపాత్ర పోషిస్తున్నారు. వీరు నేరుగా తోటలకొచ్చి కొనుగోలు చేస్తుండటం, చిన్న వాహనాల ద్వారా అక్కడి మార్కెట్లకు చేరుస్తున్నారు. దీంతో వ్యాపారులకు కొన్ని ఖర్చులు తగ్గడమే కాక రైతులకు రవాణా ఇబ్బందులు తప్పుతున్నాయి. కంచిలి వ్యాపారులకు రవాణా, నిల్వ, నిర్వహణ, కూలీలు, మార్కెట్ సెస్ పరంగా కొంత ఖర్చవుతుంది.

# రెవెన్యూలో..వీడని చిక్కుముళ్లు

భీమవరం : 'ప్రభుత్వానికి వస్తున్న అర్జీల్లో 60శాతం రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉంటున్నాయి. ఆ శాఖ పనితీరు మారాలి. ఏ జిల్లాలో రెవెన్యూ సమస్యలు తక్కువగా వస్తే ఆ జిల్లా అధికారులు బాగా పనిచేసినట్లు లెక్క. ఎక్కువ సమస్యలొస్తే అక్కడ యంత్రాంగం సరిగా పనిచేయడం లేదని అర్థం. ఇకపై నేనూ కూడా దృష్టి పెడతా' ఇటీవల కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ శాఖనుద్దేశించి సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు
**తగ్గని వినతులు..** కూటమి ప్రభుత్వం వచ్చాక భూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టింది. రీసర్వే పూర్తయిన 174 గ్రామాల్లో గ్రామసభలు, 293 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి 7,021 అర్జీలు స్వీకరించారు. అవి కాకుండా ఏడాది కాలంగా సంయుక్త ఎల్‌పీఎం 30,621 గుర్తించగా 8,060 పరిష్కరించారు.పాలకొల్లు గ్రామీణంలో 49 సెంట్ల భూమి ఉంది. ఆన్‌లైన్‌లో వేరొకరి పేరుమీద చూపిస్తోందని 2021 నుంచి అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా. ఎన్నిసార్లు వినతులిచ్చినా పరిష్కారం కావడం లేదు' అని కొంతేరుకు చెందిన ఉన్నమట్ల రామారావు ఆవేదన వ్యక్తం చేశారు.
**ఎక్కని మెట్టు లేదు..**
జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి యంత్రాంగం ఎంత కృషిచేస్తు



న్నా కొలిక్కి రావడం లేదు. వైకాపా ప్రభుత్వం అడ్డదిడ్డంగా రీసర్వే చేసి, సంయుక్త ఎల్‌పీఎం(ల్యాండ్ పార్సిల్ మ్యాప్) కేటాయించడంతో సమస్యను పరిష్కరించాలంటూ రైతులు కలవని అధికారి లేరు. ఎక్కని, దిగని మెట్టు లేదు. భూ విస్తీర్ణం తగ్గిందని, తేడాలు వచ్చాయని, సంయుక్త ఎల్‌పీఎం కేటాయించారంటూ గ్రామసభ, రెవెన్యూ సదస్సులు, మండల, తహసీల్దారు, కలెక్టర్ కార్యాలయం ఇలా ఏ వేదిక లేకుండా వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నారు. ఒకసారి వచ్చిన అర్జీదారు మళ్లీ అదే సమస్యతో అధికారుల వద్దకు వస్తున్నారు. తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో సంయుక్త ఎల్‌పీ నంబర్లతో ఇబ్బంది పడుతున్నట్లు మండల, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో పలు సార్లు ఫిర్యాదు చేసినట్లు గూడవల్లి శ్రీనివాసరావు ఆవేదన చెందారు.
చాలా వరకు పరిష్కరించినట్లు లెక్కలు చూపుతున్నా ప్రతి కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల వేదిక (పీజీఆర్ఎస్)లో భూ సమస్యలకు సంబంధించిన అర్జీల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. వస్తున్న వినతుల్లో సింహభాగం రెవెన్యూకి చెందినవే ఉంటున్నాయి. గతేడాది కాలంగా సర్వేకి సంబంధించి 8,335, రెవెన్యూకి 7,004 అర్జీలు వచ్చాయంటే, క్షేత్రస్థాయిలో సమస్యలు ఏవిధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు.
'మొగల్తూరులో 60 సెంట్ల భూమి ఉంది. రీసర్వే తర్వాత 20 సెంట్లు మరొకరి పేరుపై చూపిస్తోంది. పరిష్కరించాలని మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా' అని ఆ గ్రామానికి చెందిన పిట్టా ప్రకాశరావు వాపోయారు.

# పక్కా గృహం.. నిర్మాణానికి గ్రహణం



పెద్దదోర్నాల: నల్లమల అటవీ ప్రాంతంలోని ఆరు చెంచు గిరిజన గూడేల్లో నివసిస్తున్న 381 మంది చెంచు గిరిజనుల సొంత గూటి కల చెదిరింది. ఎండకు ఎండుతూ... వానకు తడుస్తూ చిల్లు పాకల్లో నివసిస్తున్న వారికి ఆర్డీటీ సంస్థ 15 ఏళ్లుగా పలు చెంచు గిరిజన గూడేల్లో పక్కా గృహాలు నిర్మిస్తూ వస్తోంది. కొన్నిట్లో అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో ఆ సమయంలో వారికి గృహాలు నిర్మించ లేదు. ఏడాది క్రితం చింతల, తుమ్మలబైలు, హరకేశ్వరం, గారపెంట, యాచవరం, గుడిపాడు గూడేల్లోని చెంచు గిరిజనులకు అటవీశాఖ ఇంటి స్థలాల పట్టాలు ఇచ్చింది. వాటిలో 381 పక్కా గృహాలు నిర్మాణానికి ఆర్డీటీ సంస్థ శ్రీకారం చుట్టింది. ఒక్కొక్క గృహాన్ని ఉచితంగా రూ.4.5 లక్షలతో నిర్మాణం చేపట్టింది. కొన్ని గృహాలు బేస్‌మట్టం, మరికొన్ని గృహాలు శ్లాబు దశకు చేరాయి. అయితే ఆర్డీటీ సంస్థకు అందిస్తున్న విదేశీయుల ఆర్థిక సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. ఎఫ్‌సీఆర్‌ఏ (ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) పునరుద్ధరణ చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.
**దశాబ్ద కాలంలోనే కూలిపోయాయి**జిల్లాలోని గూడేల్లో గతంలో ప్రభుత్వం గుత్తేదారులతో నాసిరకంగా పక్కా భవనాలు నిర్మించి ఇచ్చింది. అవి దశాబ్ద కాలంలోనే కూలిపోయాయి. వాటి స్థానంలో పాకలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. మా కష్టాలను చూసిన ఆర్డీటీ సంస్థ పక్కా గృహాలు నిర్మించేందుకు ముందుకు వచ్చింది. వారికి వచ్చే విదేశీ నిధులు ఆపివేశారు. దీంతో మా పక్కా గృహాల నిర్మాణ పరిస్థితి ఏమిటో అర్థం కావడంలేదని చింతల, తుమ్మలబైలు తదితర చెంచు గిరిజన గూడెంలోని చెంచు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గూడేల వారీగా కేటాయించిన ఇళ్లు చింతల-93, తుమ్మలబైలు-67, హరకేశ్వరం-22, గారపెంట-96, యాచవరం-37, గుడిపాడు గూడెం-66.

# అంతా హడావుడి... ఆపై చతికిలపడి!



కనిగిరి: కనిగిరి పురపాలక సంఘం పరిధిలో గత వైకాపా పాలనలో అయిదేళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆ పార్టీ నేతలు అధికారుల అండదండలతో అక్రమాలు, భూముల ఆక్రమణలు సాగించారు. ప్రభుత్వ, పశువులుబీడు, అసైన్డ్, వాగు పోరంబోకు భూములను ఆక్రమించుకున్నారు. కొన్నిచోట్ల అక్రమ కట్టడాలు నిర్మించగా, మరికొన్ని చోట్ల వెంచర్లు వేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమాలు, ఆక్రమణలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ ఆదేశాలతో ఏడాది కిందట అధికారులు అక్రమ కట్టడాలు కూల్చివేయంతోపాటు అనధికార వెంచర్లను గుర్తించారు. అనంతరం ఆయా భూములను స్వాధీనం చేసుకోకపోగా, ప్రభుత్వ భూములుగా గుర్తించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని పరిస్థితి నెలకొంది. కనిగిరి పురపాలక సంఘం పరిధిలోని కందుకూరు, పామూరు, కంభం, పొదిలి వెళ్లే రహదారుల్లోని సుమారు రూ.20 కోట్ల విలువైన 30 ఎకరాల్లోని అసైన్డ్, వాగు పోరంబోకు భూములను గత వైకాపా ప్రభుత్వంలోని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆక్రమించుకుని కట్టడాలు నిర్మించారు. అనంతరం ఆర్డీవో, తహసీల్దారు, కమిషనర్ బృందాలుగా ఏర్పడి సర్వే చేసి ఆక్రమణలు వాస్తవమేనని ఆక్రమిత భూములను గుర్తించారు. అక్రమ కట్టడాలను కూల్చివేసి చేతులు దులుపుకోవడంతో తిరిగి ఆక్రమణలు జోరందుకున్నాయి.
మాచవరం సమీపంలో అక్రమ కట్టడాలు కూల్చివేసిన చోటే తిరిగి భవనాలు నిర్మించడం..అమరావతి మైదానం వెనుక వాగును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, వెంచర్లు వేసి విక్రయించడం గమనార్హం ఆక్రమిత భూములను గుర్తించిన అధికారులు వాటిని స్వాధీనం చేసుకోలేదని, ప్రభుత్వ భూములని బోర్డులు ఏర్పాటు చేయ లేదని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గత వైకాపా నేతలు ఆక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ పిల్లి కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆక్రమిత ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి కంచెలు నిర్మిస్తామన్నారు.

# అవినీతి.. స్తంభాలాట



నంద్యాల : పల్లెలకు 24 గంటలు విద్యుత్తు సరఫరా చేయాలన్న పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వ్యవసాయ విద్యుత్తు ఫీడర్ నుంచి వేరు చేసి 33 కేవీ ఫీడర్ల నష్ట నివారణ చర్యలు అరికట్టాలన్న ఉద్దేశంతో పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకాన్ని (ఆర్‌డీఎస్‌ఎస్) కేంద్రం తీసుకొచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.644.25 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉంది. రెండేళ్ల కిందట ప్రారంభమైన పనులు 2026 ఆగస్టు నాటికి పూర్తి చేయాలి. 75 శాతం కేంద్రం నిధులు ఇస్తుంది.. మిగిలిన 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ పెద్దలకు దగ్గరగా ఉండే శిర్డీసాయి సంస్థకు పనుల బాధ్యత అప్పగించారు. సదరు సంస్థ ఉప గుత్తేదారులకు పంచేసింది. ఖాళీ చెక్కులు ఇవ్వాలంటూ కాంట్రాక్టు చేపట్టిన శిర్డీసాయి సంస్థ నిబంధన పెట్టింది. దీంతో పనులు చేయమంటూ ఉప గుత్తేదారులు వెళ్లిపోయారు.
**నేలవాలిన స్తంభాలు**
చేపట్టిన పనుల్లో నాణ్యతా లోపాలు బయటపడ్డాయి. స్తంభాలను భూమిలో పైపైన పాతారు. చుట్టూ కంకర మిశ్రమంతో గట్టి పరచాల్సి ఉండగా.. నామమాత్రంగా వేశారు. చిన్నపాటి గాలులకే అవి కూలిపోతున్నాయి. ఆలూరు, హోలహర్వి, పత్తికొండ, మద్దికెర , గడివేముల, పాణ్యం, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, నందికొట్కూరు మండలాల్లో నాటిన స్తంభాలు విరిగి కింద పడిపోవడం గమనార్హం. కొన్నిచోట్ల స్తంభాలు విరిగిపోయాయి. మరికొన్ని చోట్ల తీగలు తెగిపోయాయి. విద్యుత్తు శాఖ అధికారులు గుత్తేదారులకు పలుమార్లు తాఖీదులు జారీ చేశారు.
**విడగొట్టి పంచేశారు**
గ్రామాల్లో కొత్త విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయడంతోపాటు త్రీఫేజ్ నియంత్రికలు, లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. పనులు పొందిన గుత్తేదారు సంస్థ.. గ్రామాలు, ఫీడర్లు, ఉప కేంద్రాలవారీగా పనులను విడగొట్టి ఎక్కడికక్కడ సబ్ లీజులకిచ్చింది. అవసరానికి తగ్గట్టు మెటీరియల్ సరఫరా చేయడం లేదు. నిధులు సర్దుబాటు చేయలేకపోవడంతో సబ్ లీజుదారులు ఎక్కడికక్కడ పనులు ఆపేశారు. ఇప్పటివరకు 20 శాతం కూడా పూర్తి కాలేదు.
కర్నూలు జిల్లాలో తొలి విడతలో 320 గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 36 గ్రామాల్లో పూర్తి కాగా 50 గ్రామాల్లో ఆగుతూ.. సాగుతున్నాయి. నంద్యాల జిల్లాలో 350 గ్రామాల్లో పనులు చేయాల్సి ఉండగా ఏ ఒక్క గ్రామంలోనూ పనులు పూర్తి కాలేదు.
జిల్లా నిధులు(రూ.కోట్లు)
కర్నూలు 284.80
నంద్యాల 359.45

# ఆసుపత్రులకు స్వచ్ఛ మార్కు

తిరుపతి : ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది పనితీరు.. పరిశుభ్రత ఆధారంగా స్వచ్ఛ పురస్కారాలు అందించనున్నారు. జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వివిధ దశల్లో వందశాతం మార్కులు సాధించిన ఆరు కేంద్రాలను ఎంపికచేసి స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర (2025) పురస్కారాలకు ప్రతిపాదనలు పంపారు.స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కింద పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరిశుభ్రత.. పచ్చదనానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించే క్రమంలో పరిశుభ్రతలో ముందడుగు వేసే వైద్యశాలలను ప్రోత్సహించేలా కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే జిల్లాలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పరిస్థితులపై వైద్యాధికారుల నుంచి నివేదికలు తెప్పించుకున్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.శాంతకుమారి పర్యవేక్షణలోని ఐదుగురు వైద్యాధికారుల కమిటీ వాటిని పరిశీలించి మార్కులు వేసింది. జాబితా వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌కు పంపించగా వారు పరిశీలించి అందులో ఆరు ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేశారు. త్వరలో మరోబృందం వాటిని పరిశీలించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎంపిక చేస్తుంది. తరువాత రాష్ట్రస్థాయి పురస్కారాలను అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా అందజేయనున్నారు.
55% కేంద్రాలకు వంద మార్కులు జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 55 శాతం కేంద్రాలకు వందకు వంద మార్కులను కమిటీ వేసింది. వాటిలో 32 పీహెచ్‌సీలు ఉండగా ఏర్పేడు పీహెచ్‌సీకి 45 మార్కులే వచ్చాయి. 15 యూపీహెచ్‌స్మీలకు వంద మార్కులు రాగా వాటిలో రెండింటికి 45 వచ్చాయి.

# అసంపూర్తి భవనంలోనే విధులు!

పెనుగొండ : వైకాపా కక్షపూరిత రాజకీయాలతో అచంట నియోజకవర్గ పరిధిలోని పెనుగొండ పశు వైద్యశాల భవన నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోయింది. రూ.85 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ పనులకు 2019లో అప్పటి మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. భవనం కింది భాగంలో దాణా, సామగ్రి నిల్వ చేసేలా, పై అంతస్తులో కార్యాలయం ఉండేలా ఈ నిర్మాణం చేపట్టారు. పనులు కొలిక్కి వస్తున్న దశలో ప్రభుత్వం మారటంతో నిర్మాణం నిలిచిపోయింది. అప్పటికే దాదాపు రూ. 50 లక్షలు వెచ్చించారు. మరుగుదొడ్ల నిర్మాణం, తలుపులు, కిటికీలు అమర్చడం, రంగులు, విద్యుదీకరణ పనులు మిగిలిపోయాయి. చేసేదేమీ లేక అయిదేళ్లుగా అసంపూర్తి



భవనంలో ఇక్కట్ల మధ్య ఉద్యోగులు, సిబ్బంది నెట్టుకొస్తున్నారు. తలుపులు, కిటికీలు, లేకపోవటంతో కార్యాలయంలో రికార్డులు, ఇతర పరికరాలు, సామగ్రికి రక్షణ లేకుండా పోయింది. ఉద్యోగులు పొరుగున ఉన్న మండల పరిషత్తు కార్యాలయంలో మరుగుదొడ్డిని వినియోగించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు రూ.40 లక్షలు వెచ్చిస్తే పనులన్నీ పూర్తి చేయవచ్చని అంచనా వేశారు. దీనిపై పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు బొడ్డు ప్రసాద్ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

# ఉండలేక.. వెళ్లలేక

ఆకివీడు : జిల్లాలోని పెద్ద లేఅవుట్లలో ఒకటైన ఆకివీడు మండలం కుప్పనపూడిలోని తాళ్లకోడు ప్రాంతంలో ఉన్న 74 ఎకరాల పేదల కాలనీలో లబ్ధిదారులు తాగునీరు, మురుగునీరు, రహదారులు తదితర సమస్యలతో అవస్థలు పడుతున్నారు. ఒక్కొక్క లబ్ధిదారుకి సెంటు స్థలం చొప్పున మొత్తం 3,272 ప్లాట్లను కేటాయించారు. ఇందులో 3,150 మందికి రుణాలు మంజూరయ్యాయి. ఇందులో సుమారు 1800 మంది నిర్మాణ పనులు ప్రారంభించారు. సుమారు 1100 ఇళ్ల నిర్మాణ పనులు నూరుశాతం పూర్తయ్యాయి. సుమారు 800 కుటుంబాల వారు గృహప్రవేశం చేసి నివాసం ఉంటున్నారు. లేఅవుట్‌లో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాల సంఖ్య పెరుగుతోంది. దానికి తగ్గట్టు వసతులు కల్పించడం లేదని వారు గగ్గోలు పెడుతున్నారు. వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రణాళిక లేకపోవడం, నిధులు మంజూరు



చేయకపోవడంతో లేఅవుట్‌లో సౌకర్యాలు లేక రోజూ అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.
**సమస్యలతో సతమతం..** వర్షాకాలం వస్తే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. గత రెండు రోజులుగా రాత్రి సమయంలో కురిసిన వర్షాలకు లేఅవుట్ ప్రాంతంలోని నివాసాలు చుట్టూ వర్షం నీరు నిల్వఉండి చెరువులను తలపిస్తోంది. ప్రధాన రహదారుల్లో పలు చోట్ల ఏర్పడ్డ భారీ గోతుల్లో వర్షం నీరు చేరి అవి కాలువలను తలపిస్తున్నాయి.

# మట్టి దిబ్బలపై కబ్జా గద్దలు

ఒంగోలు : పాత సింగరాయకొండలో 16వ జాతీయ రహదారిని అనుకుని ఉన్న విలువైన మట్టి దిబ్బలపై కబ్జా గద్దలు వాలడంతో అవి కరిగిపోయాయి. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం చోద్యం చూడటంతో ఒకటి కాదు.. రెండు కాదు.. దాదాపు వందెకరాల ప్రభుత్వ భూములు పరాధీనమయ్యాయి. మట్టి తరలించి సొమ్ము చేసుకోవడంతోపాటు చదును చేసి మొక్కలు నాటి ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్నాయంటూ చెప్పుకొస్తున్నారు. కొంతమంది దొంగ పట్టాలు సైతం పుట్టించడం గమనార్హం.
పాత సింగరాయకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో సర్వే సంఖ్య 309లో వందెకరాల వరకు దిబ్బ పోరంబోకు భూములున్నాయి. ఏళ్ల కిందట స్థానికులైన కొంతమంది పేదలు పట్టాలు ఇచ్చారు. దీన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది దొంగ పట్టాలు పుట్టించి ఆ భూములు తమవేనంటూ మట్టి మాఫియాకు అమ్మేశారు. వీటిని కొనుగోలు చేసిన ముఠా ఇష్టానుసారం మట్టి తవ్వకాలు సాగించింది. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్తు స్తంభం ఎత్తున ఉన్న దిబ్బలు మాఫియా ధాటికి మాయమైపోయాయి. మట్టిని తవ్వేసిన అనంతరం అక్కడి భూములను పొలాలుగా మార్చి విక్రయాలు మొదలుపెట్టారు. కొంతమంది స్థిరాస్తి వ్యాపారులు వెంచర్లు వేయడానికి సిద్ధమవుతున్నారు.
**సైనికుల భూమికే రక్షణ కరవు**
సింగరాయకొండకు చెందిన ఓ సైనికుడికి ప్రభుత్వం ఇక్కడ నాలుగెకరాలు కేటాయించింది. ఈయన మరణానంతరం కొందరు భూమిపై కన్నేశారు. ఇక్కడ రెండు వర్గాలకు చెందినవారు దక్కించుకోవడానికి పోటీపడ్డారు. తన తండ్రికి చెందిన భూమి ఆక్రమణలో ఉందని, తమకు న్యాయం చేయాలని సైనికుడి కుమార్తె ఫిర్యాదు చేశారు.
**యంత్రాంగం మేల్కొంటేనే...**
ప్రభుత్వ భూముల్లో తవ్విన మట్టిని అక్రమార్కులు జిల్లాతోపాటు పక్కనున్న శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి తవ్వి పోసినందుకు ఒక్కో టిప్పరుకు రూ.ఐదారు వేలు వసూలు చేస్తున్నారు. గతంలో తవ్వకాలు సాగించిన వారూ ఇప్పటికీ అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. విలువైన మట్టి తవ్వుకుపోతున్నా రెవెన్యూ, భూగర్భ గనులు, పోలీసుశాఖలు చోద్యం చూస్తున్నాయి. చర్యలు తీసుకుంటాం: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే రెవెన్యూశాఖ చర్యలు తీసుకుంటుంది. సైనికుడి భూమి ఆక్రమణపై ఫిర్యాదులందడంతో కొలతలు వేసి ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించాం. ఇక్కడి భూముల్లో ఆక్రమణలపై తాఖీదులిచ్చాం. లక్ష్మీప్రసన్న, ఆర్డీవో, ఒంగోలు

# ఐదేళ్ల నిర్లక్ష్యం.. రోగులకు శాపం

కదిరి : కదిరి ప్రాంతీయ వైద్యశాల నూతన భవన సముదాయం నిర్మాణం నత్తనడకన సాగుతోంది. 2020లో రూ.18 కోట్లతో పనులను ప్రారంభించారు. 2022లో నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. నేటికీ పనులు సాగుతూనే ఉన్నాయి. వంద పడకల ఈ ఆసుపత్రి పది మండలాల ప్రజలకు అత్యవసర వైద్య సేవలందిస్తోంది. కొత్త భవనాలు కడుతున్నామంటూ అప్పట్లో వైకాపా నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించి ఓపీ విభాగం, పిల్లల వార్డు, క్షయ, ఆరోగ్యశ్రీ విభాగాలు ఉన్న పాత భవనాలను కూల్చివేశారు. అధునాతన సేవలందించేందుకు అవసరమైన పరికరాల ఏర్పాటుకు సరైన గదులు లేని కారణంగా కొన్ని పరికరాలను అందుబాటులోకి తీసుకురాలేక పోతున్నారు.

**బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం**

2020 డిసెంబరులో నూతన భవన సముదాయం పనులు ప్రారంభించిన గుత్తేదారుడికి అప్పటి వైకాపా ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించలేదు. దీంతో గుత్తేదారుడు పనులను అర్ధాంతరంగా ఆపి వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రోగుల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి బకాయి చెల్లించేలా చొరవ చూపారు. ఫలితంగా తిరిగి పనులు ప్రారంభమయ్యాయి. అప్పటికే భవన సముదాయం గడువు తీరడం వల్ల కొత్త సమస్య తెరపైకి వచ్చింది. ప్రభుత్వం స్పందించి నాబార్డు నిధులు



కోరుతూ 2025 వరకు గడువు పెంచాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. అనుమతి లభిస్తే పనుల్లో వేగం పెరిగే వీలుంది.

**రోగులు, సహాయకులకు తప్పని అవస్థలు**

ఆసుపత్రిలో రోజూ 500 నుంచి 600 వరకు ఓపీ ఉంటుంది. ఓపీ విభాగాన్ని ఇరుకైన పాతభవనంలో నిర్వహిస్తుండటంతో రోగులు ఎండలో గంటల తరబడి వరుసలో నిలబడాల్సి వస్తోంది. సుమారు 70 నుంచి 100 మంది వరకు ఇన్‌పేషెంట్స్ ఉండే వార్డుల్లో కొన్ని చోట్ల పెచ్చులూడుతున్నాయి. రోగుల సహాయకులు వరండాల్లో ఎదురు చూడాల్సిన పరిస్థితి. రక్తనమూనాలు, ఇతర పరీక్షలు ఇరుకైన గదుల్లో నిర్వహించాల్సి రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**అనుమతి లభిస్తే పనుల్లో పురోగతి**

– శ్రీనివాసులునాయుడు, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ

కదిరి ప్రాంతీయ వైద్యశాల నూతన భవన సముదాయం రెండంతస్తులు పూర్తయ్యింది. విభాగాల వారీగా పనులు చేయాల్సి ఉంది. నిర్మాణానికి మరింత గడువు కోరుతూ ప్రభుత్వం నాబార్డును కోరింది. అనుమతి లభించగానే పనులు వేగవంతం చేసి పూర్తి చేస్తాం.

# చేపల వేట.. తమిళనాడు గలాట!

ఒంగోలు : చేపల వేటకు తమిళనాడు రాష్ట్రం కడలూరు నుంచి మన ప్రాంతానికి వచ్చి నిబంధనలు మీరి వేటాడుతున్న అక్కడి మత్స్యకారులు.. అడ్డుకుంటున్న స్థానికులపై దాడులకు పాల్పడుతున్నారు. ఏడైనా జిల్లా పరిధిలో సంప్రదాయ చేపల వేటకు సముద్రపు ఒడ్డు నుంచి 8 కిలోమీటర్ల వరకు స్థానికులకు అనుమతి ఉంటుంది. ఇతర రాష్ట్రాల వారు తీరం నుంచి 22 కిలోమీటర్లు దాటిన తరువాతే చేపల వేట సాగించాలి. తమిళనాడులోని కడలూరు ప్రాంతం నుంచి మత్స్యకారులు జిల్లాలోని కొత్తపట్నం, బాపట్ల జిల్లా వాడరేవు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు సమీపంలోని తీర ప్రాంతాలకు వచ్చి 2 కిలోమీటర్లలోపే వేటాడుతున్నారు. కిలోమీటర్ల పొడవున్న వెడల్పున్న భారీ వలను 500 హెచ్‌పీ సామర్థ్యం గల రెండు పెద్ద బోట్లకు కట్టి ఈడ్చుకుంటూ వెళ్లిపోతున్నారు. దీంతో భారీగా మత్స్యసంపద పోగొట్టుకోవడంతోపాటు వలలు కూడా ధ్వంసమైపోతున్నాయని జిల్లా మత్స్యకారులు గగ్గోలు పెడుతున్నారు. ఒకేసారి 15 నుంచి 20 బోట్లలో దాదాపు 300 మంది మత్స్యకారులు వస్తున్నారని, అడ్డగిస్తే తమపై దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని వెంకటేష్‌పాలెం వద్ద తమిళనాడు బోటును తీసుకొచ్చి జువ్వలదిన్నె హార్బరులో నిలిపేశారు



ఫొటోలు పంపితే చర్యలు తీసుకుంటారట: ఈ విషయాన్ని మన రాష్ట్ర అధికారులు తమిళనాడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి బోటుకు జియోట్యాగింగ్ చేసి ఉంటుందని, హద్దులు దాటిన బోటు నంబరు కనిపించేవిధంగా ఫొటో పంపితే చర్యలు తీసుకుంటామని ఆ రాష్ట్ర అధికారులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక మత్స్యకార సంఘం నాయకుడు పేరయ్య కోరారు.

**మెరైన్ పోలీసులు ఏం చేస్తున్నట్లు?:** సముద్ర తీర ప్రాంతంలో శాంతిభద్రతలు, గస్తీ నిర్వహణకు మెరైన్ పోలీసు విభాగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మెరైన్ పోలీసులు గస్తీ తిరిగితే తమిళనాడు బోట్లను రాకుండా కట్టడి చేయొచ్చు. దీనిపై మత్స్యకారులు ఫిర్యాదు చేస్తున్నా ఆ బాధ్యత తమది కాదని, మత్స్యశాఖ అధికారులే పరిష్కారం చూస్తారంటూ మెరైన్ పోలీసులు తప్పుకొంటున్నారు.

# జీఎస్టీ తగ్గింపుతో 'అనంత' ఊరట



అనంతపురం: ప్రజలపై పన్నుల భారం తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో మార్పులు చేసింది. నిత్యావసర వస్తువులపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి, ద్విచక్రవాహనాలు, చిన్నకార్లు, టీవీలు, ఏసీలు, సిమెంట్ తదితర వాటిపై 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించింది. రైతుల కోసం ఎరువులు, పురుగుల మందులు, ట్రాక్టర్లపై 12 శాతం నుంచి 5 శాతానికి కుదించింది. ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది సర్కిళ్ల పరిధిలో ఏటా సుమారు రూ.600 కోట్ల మేర జీఎస్టీ వసూలవుతోంది. తాజా మార్పులతో ఉమ్మడి జిల్లా వాసులకు రూ.250 కోట్ల వరకు ఆదా కానుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఫలితంగా నిర్మాణ రంగం ఊపందుకోవడంతో పాటు వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. గార్మెంట్స్, చేనేత రంగాలతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో ఉత్పత్తి పెరుగుతుందని భావిస్తున్నారు.

**నిర్మాణానికి ఊతం**

ఉమ్మడి జిల్లాలో మొన్నటి వరకు రూ.350 సిమెంటు బస్తాపై రూ.98 జీఎస్టీ ఉండగా.. ప్రస్తుతం రూ.63కు తగ్గింది. అంటే ప్రతి బస్తాపై సగటున రూ.35 ఆదా కానుంది. ప్రస్తుతం 54 వేల ప్రభుత్వ, 20 వేల ప్రైవేటు భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. తాజా మార్పులతో ఈ రంగం మరింత వృద్ధి సాధించనుంది.

జీఎస్టీ వసూళ్లు: రూ.80 కోట్లు

తగ్గింపు: 28 శాతం నుంచి 18శాతం

ఆదా: రూ.30 కోట్లు

**వాహనాలు రయ్ రయ్..**

ఉమ్మడి జిల్లాలో ఏడాదిలో అన్ని రకాల వాహనాలు కలిపి 6,500 నుంచి 7,000 రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. ద్విచక్రవాహనాలు, చిన్న కార్లపై జీఎస్టీని తగ్గించారు. దీనివల్ల వాహనాల కొనుగోళ్లు ఊపందుకుంటాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

జీఎస్టీ వసూళ్లు: రూ.96 కోట్లు

తగ్గింపు: 28 శాతం నుంచి 18శాతం

ఆదా: రూ.36 కోట్లు

**అన్నదాతల్లో ఆనందం!**

ఎరువులు, పురుగుల మందులపై జీఎస్టీ తగ్గించారు. వీటిపై ఉమ్మడి జిల్లాలో ఏటా రూ.80 కోట్లకు పైగా జీఎస్టీ వసూలయ్యేది. తాజా శ్లాబులతో రైతులకు మేలు కలగనుంది. అలాగే ట్రాక్టర్లపైనా జీఎస్టీని 5 శాతానికి తగ్గించారు.

జీఎస్టీ వసూళ్లు: రూ.84 కోట్లు

తగ్గింపు: 12శాతం నుంచి 5శాతం

ఆదా: రూ.50 కోట్లు

**జోరందుకోనున్న విద్యుత్తు ఉపకరణాలు..**

ప్రస్తుతం టీవీలు, ఏసీలు, హీటర్లు వంటివాటిపై జీఎస్టీని తగ్గించారు. దీంతో గృహోపకరణాల కొనుగోళ్లు జోరందుకోనున్నట్లు వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

జీఎస్టీ వసూళ్లు: రూ.100 కోట్లు

తగ్గింపు: 28 శాతం నుంచి 18శాతం

ఆదా: రూ.10 కోట్లు

# పంచాయితీలు చేసి.. కాసులు పంచేసుకుంటున్నారు!



పుట్టపర్తి: చిలమత్తూరు మండలం.. కర్ణాటక సరిహద్దున, బెంగళూరు విమానాశ్రయానికి 70 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉండటంతో ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోంది. ఇక్కడ లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు గతంలో కేటాయించి, రిజిస్ట్రేషన్ పూర్తయిన 8,814 ఎకరాలను కలుపుకొని మరో 15 వేల ఎకరాలు సేకరించి పెద్ద పారిశ్రామికవాడ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసింది. భూసేకరణ ప్రారంభించింది. ఇదే కొందరు అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. చిలమత్తూరు మండలంలోని టేకులోడు గ్రామంలో ప్రభుత్వం రెండు భారీ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రైతుల నుంచి 880 ఎకరాల భూమిని సేకరించింది. అందులో 608 ఎకరాల అసైన్డ్ భూమి ఉండగా.. 140 ఎకరాలు పట్టా భూమి ఉంది. అసైన్డ్ భూముల రైతులకు ఎకరాకు రూ.12.66 లక్షలు చొప్పున ప్రభుత్వం పరిహారం నిర్ణయించింది. ఇప్పటికే మూడు విడతల్లో పంపిణీ కూడా చేపట్టింది. పట్టా భూములకు సంబంధించి పరిహారం నిర్ణయించలేదు.

**వివాద భూములే లక్ష్యం**

ప్రభుత్వం సేకరించిన భూముల్లో అత్యధికంగా అసైన్డ్ భూములు ఉండటంతో కొందరు నాయకులు రంగప్రవేశం చేశారు. వివాదాలున్న భూములను గుర్తిస్తున్నారు. పలువురు పేద రైతులు తమ అవసరాలకు గతంలో భూములు అమ్ముకున్నారు. వీటిని భూస్వాములు కొనుగోలు చేశారు. పాసుపుస్తకాల్లో మాత్రమే పేరు మారి ఉంటుంది. డిక్లాట్, డీఆర్‌ఓఎస్‌లో పాత లబ్ధిదారుల పేర్లే ఉంటాయి. వీరిద్దరి మధ్య వివాదం సృష్టిస్తున్నారు. పంచాయితీ చేసి పరిహారం వచ్చేలా చేస్తున్నారు. ఆ తర్వాత సొమ్ము తీసుకుంటున్నారు. నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడి సహకారంతో మండలానికి చెందిన ఓ తెదేపా నాయకుడు ఈ వ్యవహారమంతా నడుపుతున్నాడు.

**వారసులైని వాటిపై కన్ను..**


సర్వే నంబరు 103లో 15.92 ఎకరాల భూమి ఉంది. పట్టాదారు పేరు వంక అని, అనుభవ స్వభావం అన్‌నోన్ అని ఉంది. ఇలాంటి భూములకు రైతులను సృష్టించి పరిహారం కొట్టేసే ప్రయత్నంలో ఉన్నారు. పచ్చికబయళ్లు, వంక పోరంబోకు తదితర భూముల వివరాలను సేకరించి పరిహారం కొట్టేస్తున్నారు. నాయకుల అక్రమాలకు కొందరు అధికారులు వత్తాసు పలకలేక అక్కడి నుంచి బదిలీ చేయించుకుంటున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటికే ఐదుగురు తహసీల్దార్లు మారారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

**అవకతవకలుంటే విచారణ చేస్తాం**

– ఆనంద్‌కుమార్, పెనుకొండ ఆర్డీవో

టేకులోడు సెజ్‌లో ఇప్పటి వరకు అసైన్డ్ ల్యాండ్‌కు సంబంధించి మూడు విడతల్లో 350 ఎకరాలకు పరిహారం చెల్లించాం. భూ యజమానుల మరణిస్తే వారి కుమారులకు పరిహారం ఇస్తున్నాం. ఎక్కడైనా అవకతవకలు జరిగితే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

# యూరియా.. ఇచ్చేదెన్నడయ్యా



అనంతపురం : జిల్లాలో ఎప్పుడూ లేని విధంగా యూరియా కొరత వేధిస్తోంది. డీలర్లు, వ్యవసాయాధికారులు కుమ్మక్కై పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేట్ డీలర్లకు అధిక మొత్తంలో యూరియా కేటాయించడం, వారంతా అధిక ధరలకు అమ్ముకున్నారన్న విమర్శలు లేకపోలేదు. అధికారుల తప్పిదాలతో యూరియా కొరత తీవ్రమైంది. రోజంతా రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు నిరీక్షిస్తున్నా బస్తా యూరియా కూడా దొరకడం గగనమైంది. నిత్యం రైతులకు కష్టకు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. మరో వారంలో ఖరీఫ్ సీజన్ ముగియనుంది..

**కేంద్రాల్లో అరకొరగా నిల్వలు**

జిల్లాలో రైతు సేవా కేంద్రాలకు, పీఏసీఎస్‌లకు, డీసీఎంఎస్‌కు ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా యూరియా, ఇతర ఎరువులు సరఫరా చేస్తున్నారు. జిల్లాలో 436 రైతు సేవా కేంద్రాలు ఉండగా కేవలం 68 కేంద్రాల్లో మాత్రమే 186 మెట్రిక్ టన్నులు ఉందని వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో కొన్ని ఆర్ఎస్‌కేల్లో అరకొరగా ఉంచారు.

**ఆందోళన చెందాల్సిన పని లేదు**

–ఉమామహేశ్వరమ్మ, సంయుక్త సంచాలకులు, వ్యవసాయశాఖ

జిల్లాలో ఒక రైతుకు పట్టాదారు పాసుపుస్తకానికి రెండు బస్తాల చొప్పున యూరియాను ఈ–పాస్ ద్వారా పంపిణీ చేస్తున్నాం. మొత్తం 3,442 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. అందులో 186 మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రాల్లో నిల్వ ఉంది. ఇంకా రావాల్సి ఉంది. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు.

# సేద్యానికి 'సౌర'భం..!

శ్రీకాకుళం : వ్యవసాయ రంగంలో విద్యుత్తు సమస్యలు అధిగమించేందుకు అడుగులు పడుతున్నాయి. 'పీఎం కుసుమ్' పథకంతో సౌర వ్యవసాయం అందుబాటులోకి తీసుకురానున్నారు. జిల్లాలో ఫీడర్ల ప్రాంతాల్లో సౌర ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటితో ప్రభుత్వానికి ఆర్థికభారం తగ్గడమే కాక రైతులకు ఇబ్బందిలేకుండా విద్యుత్తు సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో మొత్తం 30,197 వ్యవసాయ సర్వీసులున్నాయి. వీటిలో ఎక్కువ విద్యుత్తును వినియోగించుకునే సబ్‌స్టేషన్ల పరిధిలో సౌర ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో ఆరు మండలాల్లో ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో నిర్మించనున్నారు. ఇప్పటివరకు 98 ఎకరాల్లో 20.76 మెగావాట్ల సామర్థ్యంతో ఉత్పత్తికి కార్యాచరణ చేపట్టారు.

**ఆరునెలల్లో పూర్తి చేసేలా..** సౌర ప్లాంట్ల ఏర్పాటుకు గత జూన్ 30న ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ పూర్తిచేసింది. శ్రీకాకుళం, ఆమదాలవలస, టెక్కలి, పాతపట్నం, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని గుర్తించిన స్థలాల్లో గుత్తేదారు సంస్థలు పరిశీలించాయి. పనులు ప్రారంభించిన ఆరునెలల్లో పూర్తిచేయనున్నారు. ప్రభుత్వ స్థలాల్లో 63 ఎకరాల్లో 15.75



మెగావాట్లు, కవిటిలోని 15 ఎకరాల ప్రైవేటు స్థలంలో 3.75 మెగావాట్లను ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేయనున్నారు. ప్రైవేటు భూమికి ఎకరాకు రూ.31 వేల లీజును ఏడాదికి చెల్లించనున్నారు. మిగిలిన 20 ఎకరాలు పరిశీలన దశలో ఉంది.

**తగ్గనున్న ఆర్థిక భారం..**

జిల్లాలో ఉచిత వ్యవసాయ విద్యుత్తు సర్వీసులు 29,692 ఉన్నాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి నెలకు సగటున రూ.5 కోట్ల మేర భారం పడుతోంది. ఇప్పుడు జిల్లాలో ఏర్పాటు చేయనున్న సౌర ప్లాంట్ల ద్వారా నెలకు రూ.కోటికిపైగా ఆదా అవుతుందని అధికారుల అంచనా. దీంతో పాటు విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు నివారించవచ్చు.

**వీలైనంత త్వరలో ప్రారంభం..:** టెండర్ల ప్రక్రియ పూర్తయింది. భూములను అప్పగించిన తర్వాత పనులు ప్రారంభమవుతాయి. పీఎం కుసుమ్ పథకం రైతులకు ఎంతో మేలు చేస్తోంది. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఎస్ఈ, ఈపీడీసీఎల్

# లెక్కలున్నాయ్.. మొక్కల్లేవ్..!

ఇచ్ఛాపురం : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు పురపాలక సంఘాల్లో భారీగా నిధులు ఖర్చు చేస్తున్నా లక్ష్యం నెరవేరడం లేదు. ఇచ్ఛాపురం, పలాస–కాశీబుగ్గ, ఆమదాలవలస, శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాలు, చెరువు గట్లు, వీధుల్లో మొక్కలు నాటామని లెక్కల్లో చూపుతున్నా ఆయా ప్రాంతాల్లో అవి కనిపించడం లేదు. గతేడాది మే నుంచి ఈ ఏడాది సెప్టెంబరు 22 వరకు క్షేత్రస్థాయి పరిస్థితిపై పరిశీలన కథనం.

**కొరవడిన పర్యవేక్షణ**

పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ వద్ద రోడ్డు పక్కన ఎమ్మెల్యే గౌతు శిరీష 12 మొక్కలు నాటారు. మిగిలినవి సచివాలయ ఉద్యోగులు తీసుకెళ్లి వార్డుల్లో నాటాల్సి ఉండగా అవి ఏమయ్యాయో తెలియని పరిస్థితి నెలకొంది. గతంలో నాటిన వాటిని సంరక్షించే బాధ్యులు లేకపోవడంతో ఎండిపోతున్నాయి.

**సంరక్షణ విస్మరించారు..**

ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలో నాటిన మొక్కల్ని సంరక్షించే వారు కరవయ్యారు. వైకాపా పాలనలో రూ.12 లక్షలతో 1,600 మొక్కలు కొనుగోలు చేసినట్లు దస్త్రాల్లో చూపినా ఎక్కడ నాటారనే వివరాలు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ పాఠశాల మైదానంలో రక్షణ లేకుండా పోయింది.

**ప్రతిపాదనలకే పరిమితం**

ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో 8 చెరువులు, 4 ఉద్యానాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇతర ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినా ఒక్కటీ నాటలేదు. వనమహోత్సవం నిర్వహిస్తామని చెబుతున్నా స్పష్టత కరవైంది.

**తీగలకు అడ్డొస్తున్నాయని నరికేశారు..**

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో మొక్కలు నాటి ఆపై నరికేస్తున్నారు. గతంలో డే అండ్ నైట్ కూడలి నుంచి 7 రోడ్ల కూడలి వరకు విభాగినుల మధ్య పెద్దఎత్తున నాటారు. అవన్నీ వృద్ధనంతో కళకళలాడుతుండేవి. విద్యుత్తు తీగలకు తగులుతున్నాయనే నెపంతో నరికేశారు. తాజాగా 4 వేల మొక్కలు నాటుతున్నా సంరక్షణ లేకపోవడంతో పశువులు నాశనం చేస్తున్నాయి.

# పేదల సొంతింటి కల నెరవేరేలా..!

పొందూరు, జి.సిగడాం: కూటమి ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ప్రణాళికలు రూపొందించి అధికారులకు లక్ష్యాలను నిర్దేశించి బాధ్యతలు అప్పగించింది. వచ్చే నెల 2న (దసరా నాటికి) లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించాలని నిర్ణయించడంతో పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకున్నారు. వైకాపా పాలనలో మంజూరైన ఇళ్లలో 30 శాతం కూడా పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే పేదల గృహ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. లబ్ధిదారులకు ఆర్థికంగా చేయూత అందించింది. దశల వారీగా పనులు పూర్తి చేసేలా పర్యవేక్షిస్తోంది.

**అధికారులదే బాధ్యత**

దసరా నాటికి జిల్లాలో 12,685 గృహాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం నిర్ణయించగా ప్రస్తుతం 7,811 ఇళ్లు అందుబాటులోకి వచ్చాయి. 4,874 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి.

అవన్నీ పూర్తిచేసేలా అధికారులు రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని పర్యవేక్షిస్తున్నారు. అన్ని మండలాల్లో గృహ నిర్మాణ సంస్థ డీఈ, ఏఈలతో సమావేశాలు నిర్వహిస్తూ ఉన్నతాధికారులు సూచనలు చేస్తున్నారు.

**ఇదీ పరిస్థితి**

కంచిలి, కవిటి, నరసన్నపేట, సోంపేట, మందస మండలాలు లక్ష్యం చేరుకోవడంలో వెనుకబడి ఉన్నాయి. లక్ష్యానికి దగ్గరగా సారవకోట, హిరమండలం, ఆమదాలవలస ఆర్బన్, రణస్థలం ఉన్నాయి. గృహ నిర్మాణాలు పూర్తయిన జాబితాలో హిరమండలం, సారవకోట, ఎల్ఎన్‌పేట, బూర్జ, జి.సిగడాం మండలాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

**చర్యలు తీసుకుంటున్నాం..:** దసరా నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి గృహ ప్రవేశాలకు సిద్ధమయ్యేలా సన్నాహాలు చేస్తున్నాం. లబ్ధిదారులతో మాట్లాడి పనులు వేగవంతమయ్యేలా పర్యవేక్షిస్తున్నాం.-డి.రమాకాంతరావు, ఇన్‌ఛార్జి పీడీ, గృహ నిర్మాణ సంస్థ, శ్రీకాకుళం

చురకలు



## నేషనల్ క్రష్ ట్యాగ్.. షిఫ్ట్ అవుతుందా?


నేషనల్ క్రష్ అంటే చాలు.. ఎవరికైనా రష్మిక మందన్న పేరు వెంటనే గుర్తుకొస్తుంది. నార్త్ టు సౌత్.. వరుసగా బ్లాక్ బస్టర్ హిట్స్ తో దూసుకుపోతున్న అమ్మడు.. కొన్నాళ్లుగా నేషనల్ ట్యాగ్ తో సందడి చేస్తోంది. ఇప్పుడు ఆ ట్యాగ్ షిఫ్ట్ అవుతుందా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. కొన్ని గంటలుగా సోషల్ మీడియాలో అదే ట్రెండ్ అవుతోంది. కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ సప్త సాగరాలు దాటి మూవీతో తెలుగు సినీ ప్రియులకు చేరువైన విషయం తెలిసిందే. తన అందం, అభినయంతో ప్రేక్షకుల్ని మెప్పించిన అమ్మడు.. ఇప్పుడు ఓ రేంజ్ లో దూసుకెళ్తున్నారు. వరుస ఛాన్సులు అందుకుని జోరు మీద ఉన్న ఆమె.. త్వరలోనే జూనియర్ ఎన్టీఆర్ మూవీతో టాలీవుడ్ లోకి రానున్నారు. రీసెంట్ గా రిలీజ్ అయ్యి బ్లాక్ బస్టర్ గా నిలిచిన కాంతార చాప్టర్ 1లో యువరాణి పాత్రలో అదరగొట్టారు. కనకవతిగా అమ్మడి యాక్టింగ్ కు అంతా ఫిదా అయ్యారు. యువరాణిగా చూపించిన గాంభీర్యానికి అట్రాక్ట్ అయ్యారు. క్లైమాక్స్ లో తనలోని టాలెంట్ మొత్తాన్ని బయటపెట్టి ఒక్కసారిగా



తనవైపునకు అందరి దృష్టిని తిప్పుకున్నారనే చెప్పాలి. దీంతో ఇప్పుడు అంతా ఆమెను నేషనల్ క్రష్ అని పిలుస్తున్నారు. సోషల్ మీడియాలో కొన్ని గంటలుగా ఆ విషయాన్ని హ్యాష్ ట్యాగ్ తో ట్రెండ్ చేస్తున్నారు. ఇంకొందరు నెటిజన్లు.. రష్మిక ఫస్ట్ నేషనల్ క్రష్ అయితే రుక్మిణీ వసంత్ సెకండ్ నేషనల్ క్రష్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. అమ్మడు పాన్ ఇండియా హీరోయిన్ అంటూ కితాబిస్తున్నారు. ఇక రుక్మిణీ వసంత్ విషయానికొస్తే.. కన్నడ మూవీ బీర్బల్ త్రయం మూవీ తో సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత అప్పుడో ఇప్పుడు ఎప్పుడో సినిమాతో టాలీవుడ్ లోకి వచ్చింది అమ్మడు. కానీ సూపర్ హిట్ మూవీ సప్త సాగరాలు దాటితో తెలుగు ఆడియన్స్ కు చేరువైంది. విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకున్నారు రుక్మిణి. ఇటీవల కోలీవుడ్ యంగ్ హీరో శివ కార్తికేయన్ మదరాసితో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. తన నటనతో ఆకట్టుకున్నారు. ఇప్పుడు ఎన్టీఆర్– ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో రూపొందుతున్న డ్రాగన్ మూవీలో యాక్ట్ చేస్తున్నారు. కన్నడ స్టార్ హీరో యష్ టాక్సిక్ లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పుడు మరిన్ని సినిమాల్లో నటించేందుకు సిద్ధమవుతున్నారు.

## పవన్ లైనప్ పై క్లారిటీ ఇదే!

రాజకీయాల్లోకి వెళ్లి ఎలక్షన్లలో గెలిచి ఏపీలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కళ్యాణ్ ఇకపై సినిమాలు చేయరేమో అని అందరూ అనుకున్నారు. కానీ అప్పటికే ఆయన్ను నమ్ముకుని మూడు సినిమాలు మొదలవడంతో ఎలాంటి పరిస్థితుల్లోనైనా సరే వాటిని పూర్తి చేయాల్సిందేనని కంకణం కట్టుకున్న పవన్ ఇప్పటికే రెండు సినిమాలను పూర్తి చేసి రిలీజ్ కూడా చేశారు. **ఫ్యాన్స్ ఆకలిని తీర్చిన ఓజి...** ఆ రెండు సినిమాలే హరి హర వీరమల్లు, ఓజి. వాటిలో వీరమల్లు సినిమా దారుణమైన ఫలితాన్ని అందుకోగా, ఓజి సినిమా మాత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించడంతో పాటూ ఎన్నో ఏళ్లుగా ఎంతో ఆశగా ఉన్న ఫ్యాన్స్ ఆకలిని కూడా తీర్చింది. ఈ ఇయర్ లోనే పవన్ నుంచి వీరమల్లు, ఓజి సినిమాలు రావడంతో పాటూ ఓజి సినిమా బ్లాక్ బస్టర్ గా నిలవడంతో ఫ్యాన్స్



ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

**పవన్ తర్వాతి సినిమాల కోసం పలువురు డైరెక్టర్లు...** ఇక మూడో సినిమా ఉస్తాద్ భగత్ సింగ్. ఆల్రెడీ ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ ను కూడా పూర్తి చేసిన పవన్ కళ్యాణ్ ఇకపై వరుస పెట్టి సినిమాలు చేయనున్నారని గత కొన్ని రోజులుగా వార్తలొస్తున్నాయి. అందులో భాగంగానే పలువురి డైరెక్టర్ల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. అయితే తాజా సమాచారం ప్రకారం పవన్ ఏ కొత్త సినిమాకీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదని తెలుస్తోంది. ప్రస్తుతం రాజకీయాల్లో బిజీగా ఉన్న పవన్ ఏ కొత్త సినిమాకీ సైన్ చేయలేదట. ఇప్పుడు ఆయన దృష్టంతా తన రాజకీయ పనులపైనే పెట్టారని ఆయన సన్నిహిత వర్గాల నుంచి సమాచారం అందుతుంది. కాబట్టి పవన్ కు సంబంధించి ఏ సినిమా గురించైనా మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు దాన్ని నమ్మడానికి వీల్లేదన్నమాట. మొన్నటివరకు ఒప్పుకున్న సినిమాలను పూర్తి చేయడానికి ఎంతో కష్టపడిన పవన్, ఇకపై ఎంతో ఆలోచించి సినిమాలను చేయాలనుకుంటున్నారట.




## ఓటీటీ డీల్.. థియేటర్లో 1000 కోట్లు కొట్టేలా తారక్ ప్లాన్!



ఇటీవల కాలంలో ఓటీటీ మార్కెట్ డౌన్ అయ్యిందనే కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే ఓటీటీ రిలీజ్ ల వల్ల మేకర్స్ కు డబ్బులు ఎంతో కొంత వస్తున్నా.. ఇది థియేట్రికల్ రన్ పైన ప్రభావం చూపిస్తుంది. ఓటీటీలు ఎంట్రీ ఇచ్చిన తర్వాత.. గతంలోలాగా సినిమాలు 50 రోజులు, 100 రోజులు థియేటర్లలో ఆడడం లేదు. కేవలం 4 వారాల థియేట్రికల్ పీరియడ్ తోనే ఓటీటీలోకి వచ్చేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఒకవేళ సినిమా తేడా కొడితే అనుకున్న దాని కంటే ముందుగానే ఓటీటీలో దింపుతున్నారు. ఇది సినిమా ఫలితాన్ని శాసిస్తుంది. ఓటీటీలు లేని రోజుల్లో వేరేలా ఉండేది. సినిమా కాస్త నెగిటివ్ టాక్ తెచ్చుకున్నా.. నాలుగు వారాల దాకా డీసెంట్ ఆక్యుపెన్సీతోనే రన్ అయ్యేది. తద్వార అంతో ఇంతో వసూళ్లు కూడా పెరిగేవి. కలెక్షన్లు పెరిగితే థియేటర్ ఓనర్లు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు నాలుగు రూపాయిలైన సంపాదిస్తారు. %కానీ, ప్రస్తుతం పరిస్థితి అలా లేదు. ఆదాయం కోసం థియేట్రికల్ లాంగ్ రన్ పణంగా పెడుతున్నారు. 6 వారాల నిబంధన ఉన్నా రెవెన్యూకు ఆశపడి, చాలా మంది నిర్మాతలు సినిమా విడుదలైన 28 రోజులకే ఓటీటీ డీల్స్ క్లోజ్ చేస్తున్నారు. ఇది బాక్సాఫీస్ కలెక్షన్లపై చూపిస్తుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని జూనియర్ ఎన్టీఆర్– ప్రశాంత్ నీల్ డ్రాగన్ మేకర్స్ ఓటీటీ ట్రెండ్ కు శ్రీకారం చుట్టారు. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ సినిమా ఓటీటీ విషయంలో మేకర్స్ జాగ్రత్తగా వ్యవహరించారు. భారీ బడ్జెట్ తో రూపొందుతున్నందున ఇది థియేటర్లలో రిలీజ్ అయిన 8 వారాల తర్వాతే నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కు వచ్చేలా అగ్రిమెంట్ చేసుకున్నారు. అంటే సినిమా విడుదలైన 8 వారాలు పూర్తైయ్యే దాకా ఇది ఓటీటీలోకి రాదు. సాధారణంగా ఈ రూల్ బాలీవుడ్ లోనే ఉంది.

ఇక డ్రాగన్ విషయంలో ఎలా ఉంటుంది అనుకుంటున్న తరుణంలో వాళ్ళు కూడా అదే రూట్లో వెళుతున్నట్లు తెలుస్తోంది. తమిళ్, తెలుగు వెర్షన్లకు కూడా ఈ రూలే వర్తిస్తుంది. ఈ నిబంధనతో సినిమా థియేట్రికల్ రన్, కలెక్షన్లు బెనిఫిట్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. రిలీజ్ అయ్యాక సినిమాకు గుడ్ మౌత్ టాక్ వస్తే థియేటర్లలో లాంగ్ రన్ అయ్యే ఛాన్స్ ఉండడం పక్కా. గతంలో కల్కి 2898 ఏడి, పుష్ప 2 సినిమాలు లాంగ్ రన్ లో థియేటర్లలో ఆడాయి. ఈ సినిమాలు లాంగ్ రన్ లో రూ.1000 కోట్లపై చిలుకు వసూళ్లు సాధించాయి. ఈ సినిమా విషయంలోనూ మేకర్స్ అదే ఫార్ములాను ఫాలో అవుతున్నారు. RRR తరువాత దేవర సినిమాతో ఆ రేంజ్ సక్సెస్ అందుకోలేకపోయిన తారక్ ఈసారి డ్రాగన్ తో 1000 కోట్లు అందుకోవాలని ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. కాగా, ఈ సినిమా వచ్చే ఏడాది జూన్ 25న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటన చేశారు.

## బాలయ్య 'అఖండ-2'.. ఆ పనులన్నీ కంప్లీట్..




టాలీవుడ్ సీనియర్ హీరో, గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ లీడ్ రోల్ లో మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను అఖండ 2: తాండవం మూవీ రూపొందిస్తున్న విషయం తెలిసిందే. వారిద్దరి కాంబినేషన్ లో ఇప్పటి వరకు వచ్చిన సింహా, లెజెండ్, అఖండ సినిమాలు బ్లాక్ బస్టర్ హిట్స్ గా నిలవడంతో అఖండ సీక్వెల్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. దసరా పండుగ కానుకగా సెప్టెంబర్ 25వ తేదీన అఖండ సీక్వెల్ విడుదల కావాల్సి ఉండగా.. సినిమా షూటింగ్ ఆలస్యం కావడంతో వాయిదా పడింది. ఇప్పుడు డిసెంబర్ 5వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల అవ్వనుంది. దీంతో మేకర్స్ సినిమాకు సంబంధించిన పనులు పూర్తి చేస్తున్నారు. అందులో భాగంగా అన్ని డీల్స్ కంప్లీట్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే అఖండ–2 థియేట్రికల్ రైట్స్ కళ్లు చెదిరే ధరకు అమ్ముడుపోగా.. రీసెంట్ గా శాటిలైట్ హక్కులు కూడా అదే విధంగా నెంబర్ కు సేల్ అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే అఖండ సీక్వెల్.. ఓటీటీ రైట్స్ ను ప్రముఖ ఓటీటీ జియో హాట్ స్టార్ రూ.85 కోట్లకు దక్కించుకుందని ఇప్పటికే సినీ వర్గాల్లో టాక్ వినిపించింది. ఇప్పుడు అన్ని భాషల్లో కలిపి శాటిలైట్ రైట్స్ ను స్టార్ టీవీ రూ.60 కోట్లకు సొంతం చేసుకుందని తెలుస్తోంది. అలా మొత్తం డిజిటల్, శాటిలైట్ రైట్స్ ద్వారానే అఖండ–2 సినిమా రూ.145 కోట్లు రాబట్టిందని టాక్. ఇది బాలయ్య కెరీర్లోనే హయ్యెస్ట్ డీల్ అనే చెప్పాలి. బాలకృష్ణ చిత్రాలలో అత్యధిక ధరకు అఖండ–2కు చెందిన హక్కులు అమ్ముడయ్యాయి! ఇక సినిమా విషయానికొస్తే.. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

ఎం.తేజస్విని నందమూరి సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. సంయుక్త హీరోయిన్ గా నటిస్తుండగా.. ఆది పినిశెట్టి, హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రగ్యా జైస్వాల్ కూడా మరో ముఖ్యపాత్రలో కనిపించనున్నారు. తమన్ సంగీతంతోపాటు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తుండగా.. రీసెంట్ గా మిశ్రా సోదర ద్వయాన్ని రంగంలోకి దించారు. శక్తిమంతమైన నేపథ్య సంగీతం అందించడంతోపాటు గొప్ప ఆధ్యాత్మిక అనుభవాన్ని పంచేందుకు వారిని తీసుకొచ్చారు మేకర్స్. పండిట్ శ్రవణ్ మిశ్రా, పండిట్ అతుల్ మిశ్రా సంస్కృత శ్లోకాలు పఠించడంలో ఎంతో నైపుణ్యం ఉన్నవారన్న విషయం తెలిసిందే.

## పువ్వుల అందాన్నే డామినేట్ చేస్తున్న సిమ్రాన్.. ఆ లుక్ అదరహో!

ముగ్ధ మనోహరమైన మోముతో ప్రేక్షకులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటూ అభిమానులను అలరించే దిశగా అడుగులు వేస్తున్నారు హీరోయిన్స్. అటు గ్లామర్ తోనే కాదు ఇటు సాంప్రదాయంగా కూడా కనిపిస్తూ ఆశ్చర్యపరుస్తున్నారు. ఇంకొంతమంది వయసు పెరిగినా.. అందాన్ని తగ్గించుకుంటూ అందరిని ఆశ్చర్యపరుస్తున్నారు. ముఖ్యంగా ఈ హీరోయిన్స్ అందం చూసి పువ్వుల అందం కూడా తక్కువేనేమో అనేంతల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలా ఎప్పటికప్పుడు తమ అందంతో.. మేని ఛాయతో అపురూపమైన సౌందర్య లావణ్యవతులుగా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు హీరోయిన్స్. అలాంటి వారిలో సిమ్రాన్ చౌదరి కూడా ఒకరు. నిత్యం సోషల్



మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అటు ఆడియన్స్ ను ఇటు ఫాలోవర్స్ ను అలరిస్తూ భారీ పాపులారిటీ సొంతం చేసుకుంటోంది ఈ చిన్నది. అందులో భాగంగానే తాజాగా కొన్ని ఫోటోలను షేర్ చేసింది. ఇందులో తన ముఖానికి దగ్గరగా పువ్వులను తాకిస్తూ చాలా మనోహరంగా ఫోటోలను షేర్ చేసింది. ఇక ఆ పువ్వులు, ఈమె ముఖాన్ని ఒకే దగ్గర పెట్టి చూసేసరికి పువ్వుల అందాన్ని ఈమె డామినేట్ చేస్తోంది అంటూ ఫాలోవర్స్ కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా చూడ చక్కని అందంతో మేని ఛాయతో మరొకసారి మెస్మరైజ్ చేస్తోంది సిమ్రాన్ చౌదరి. సిమ్రాన్ చౌదరి ఈ ఫోటోలలో బ్లాక్ స్లీవ్ లెస్ డ్రెస్ ధరించి బుగ్గలు ఎరుపెక్కేలా ఫోటోలకు ఫోజులిచ్చింది. ఏది ఏమైనా రోజురోజుకు మరింత అందంగా ముస్తాబవుతూ అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. మరి దర్శకుల కంట్లో ఎప్పుడు పడుతుందో? ఎప్పుడు ఈమెకు వరుస అవకాశాలు వస్తాయో చూడాలి అని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

## ఇంటిమేట్ సీన్లపై పేరెంట్స్ సలహా.. ఖంగుతిన్న సోనమ్ బజ్వా!

సినిమా ఇండస్ట్రీలోకి వచ్చే చాలామంది హీరోయిన్లు కొన్ని కండిషన్లు పెట్టుకొని ఇండస్ట్రీకి వస్తారు. అయితే ఇండస్ట్రీకి వచ్చే ముందు తమ తల్లిదండ్రులు ఇంటిమేట్ సన్నివేశాలు, ముద్దు సన్నివేశాల్లో నటించకూడదు అని కండిషన్స్ పెడుతుంటారని చెబుతూ ఉంటారు. వారి పేరెంట్స్ కండిషన్స్ మేరకే సినిమాల్లో 'నో కిస్ పాలసీ' ని ఫాలో అవుతూ ఉంటామని చెబుతూ ఉంటారు. అంతేకాదు కొంత మంది పేరెంట్స్ ఏమీ అనకపోయినా అలాంటి ఇంటిమేట్ సన్నివేశాలలో చేసినప్పుడు పేరెంట్స్ తో కలిసి ఆ సినిమా చూస్తే ఎలా ఉంటుందోనని మొహమాటపడి అలాంటి సీన్స్ చేయడానికి ఒప్పుకోరు. అయితే వాళ్ళు పెట్టుకున్న కండిషన్ల వల్ల ఎన్నో హిట్ సినిమాలు కూడా మిస్ అవుతూ ఉంటారు. అయితే తాజాగా అలాంటి ఒక విషయం గురించే ప్రస్తావించింది నటి సోనమ్ బజ్వా.. కిస్ సీన్స్, ఇంటిమేట్ సన్నివేశాల గురించి తన పేరెంట్స్ స్పందించిన తీరుకి షాక్



అయ్యాను అంటూ అందరూ ఆశ్చర్యపోయే విషయం చెప్పింది. మరి ఇంతకీ ముద్దు సన్నివేశాలపై సోనమ్ బజ్వా ఏమన్నారో ఇప్పుడు తెలుసుకుందాం.. పంజాబీ బ్యూటీ సోనమ్ బజ్వా ముద్దు సన్నివేశాలపై తన పేరెంట్స్ స్పందించిన తీరును వెల్లడిస్తూ.. సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ముద్దు సన్నివేశాలను చేయడానికి నేను నిరాకరించాను. దానివల్ల ఎన్నో హిట్ సినిమాల్లో ఛాన్స్ వదిలేసుకున్నాను. సినిమాల్లోకి వచ్చినప్పుడే ఇలాంటి సీన్స్ చేయకూడదని ఫిక్స్ అయ్యాను. ఎందుకంటే మా పేరెంట్స్ తో కలిసి ఆ సినిమాలు చూసినప్పుడు అలాంటి ఇంటిమేట్ సీన్స్ వస్తే కాస్త అసౌకర్యంగా ఉంటుందని ముందే ఆ సీన్స్ చేయకూడదని కొన్ని సినిమాలు రిజెక్ట్ చేశాను. అయితే ఈ కారణంగా ఎన్నో పెద్ద సినిమాల్లో ఛాన్స్ మిస్ చేసుకున్న తర్వాత ఒకసారి మా పేరెంట్స్ తో ఈ విషయం గురించి చర్చించినప్పుడు "ఇదంతా యాక్టింగ్ లో భాగమే.. నటిగా రాణించాలంటే ప్రతి ఒక్క సీన్ చేయగలగాలి. అందులో పెద్ద తప్పేముంది" అని స్పందించారు. వాళ్ళ రియాక్షన్ కి నేను కూడా షాక్ అయ్యాను. వాళ్లను బాధపెడు తుంది అనే కారణంతో నేను ఇన్ని సంవత్సరాలుగా ఎన్నో సినిమాలు మిస్ చేసుకున్నాను అని అనిపించింది. అయితే ఇలాంటి సీన్స్ ఒప్పుకోక పోవడానికి నా పేరెంట్స్ తో పాటు పంజాబీ ప్రేక్షకులు ఏమనుకుంటా రో అని కూడా భయం ఉండేది. బాలీవుడ్ లో ఎన్నో పెద్ద సినిమాల్లో ఆఫర్స్ వచ్చాయి. కానీ వాటిలో కిస్ సన్నివేశాలు ఉండేవి. అలాంటి సన్నివేశాల్లో నటిస్తే పంజాబ్ ప్రేక్షకులు నన్ను అంగీకరిస్తారా.. ఒకవేళ ఆ సీన్స్ చేస్తే కుటుంబ కథా ప్రేక్షకులు నన్ను తిట్టుకుంటారు కావచ్చు అని నాకు నేనే ఫీల్ అయ్యి చాలా పెద్ద పెద్ద సినిమాల్లో అవకాశాలు మిస్ చేసుకున్నాను. ఆ తర్వాత నా పేరెంట్స్ రియాక్షన్ చూసి మంచి ఛాన్స్ మిస్ చేసుకున్నానని బాధపడ్డాను. అంటూ పంజాబీ బ్యూటీ సోనమ్ బజ్వా చెప్పుకొచ్చింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536